fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 76 | విజయవాడ, ఆదివారం 18 మార్చి 2018 | 12 + స్నేహ + 12 పేజీలు వెల : 5.00

అధ్యక్షుడిగా మరోసారి

సీ జిన్‌పింగ్



9

ప్రత్యేక హోదా కోసం రేపు

రౌండ్‌టేబుల్ సమావేశం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోరుతూ రేపు విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. సోమవారం ఉదయం 10 గంటలకు ఐవిప్యాలెస్‌లో జరిగే ఈ సమావేశానికి వామ పక్షాలు, ప్రజా సంఘాలు, వేదికల నాయకులు హాజరవనున్నారు. అలాగే జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ కూడా హాజరు కానున్నారు. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నారు.

ముదురుతున్న

యుసి పోరు

కేంద్ర, రాష్ట్రాల మధ్య వాగ్వాదాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

హోదా కోసం అవిశ్వాస పోరు ఊపందుకుంటున్న సమయంలో యుసి (వినియోగ ధ్రువీకరణ పత్రం)ల యుద్ధం కూడా ప్రారంభమైంది. తామిచ్చిన నిధులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు యుసిలు ఇవ్వలేదని కేంద్రం చెబుతున్న సంగతి తెలిసిందే. దీనిని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరిస్తోంది. ఇటీవల శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఇప్పటిరకు కేంద్రం విడుదల చేసిన నిధులన్నింటికి యుసిలు ఇచ్చివేశామని చెప్పారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ విషయాన్ని తీవ్రంగా తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్ర బిజెపి నేతల ద్వారా కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించిన తీరు, యుసిల వివాదాన్ని ప్రచారంలో పెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. బిజెపి అధ్యక్షుడు రాష్ట్ర బిజెపి నేతలతో శనివారం నిర్వహించిన సమావేశంలోనూ ఈ విషయం చర్చకు వచ్చినట్లు తెలిసింది. సంబంధించి ధ్రువీకరణ ఇవ్వని నిధుల వినియోగాన్ని బాహాటంగా చెప్పడం ద్వారా తెలుగుదేశం పార్టీని ఇరకాటంలో పడేయాలని నిర్ణయించినట్లు సమాచారం. మరోవైపు యుసిల విషయంలో కేంద్రం చెబుతున్న లెక్కలతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న గణాంకాలు కూడా అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వ అధ్వర్యంలో ఉన్న ఎపి భవన్ కూడా తాజాగా కొన్ని లెక్కలను వెల్లడించింది. ఈ లెక్కలు గందరగోళాన్ని మరింతగా పెంచేవిగా ఉన్నాయి. రాజధానికి సంబంధించి ఇప్పటికే లెక్కలు చెప్పామని రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా

మిగతా 9లో



పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు ప్రజాశక్తి ఉగాది శుభాకాంక్షలు.
పండుగ సందర్భంగా ఆదివారం మా కార్యాలయానికి సెలవు. పునర్దర్శనం మంగళవారం - చీఫ్ జనరల్ మేనేజర్



దేశాన్ని చీల్చేందుకు బిజెపి యత్నం

- ప్లీనరీలో రాహుల్ గాంధీ
- బ్యాలెట్ ద్వారా ఎన్నికలు : కాంగ్రెస్ డిమాండ్
- ఎపికి ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందే
- మోడీ వన్నీ డ్రామాలే: సోనియా గాంధీ
- ప్రారంభమైన కాంగ్రెస్ 84వ ప్లీనరీ సమావేశాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ ప్రజానీకంలో విద్వేషాలు రగిల్చేందుకు బిజెపి యత్నిస్తోందని,మోడీ ప్రభుత్వం పట్ల ప్రస్తుతం దేశమంతా అసంతప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. రెండు రోజుల పాటు జరిగే కాంగ్రెస్ పార్టీ 84వ ప్లీనరీ సమావేశాలు శనివారం నాడిక్కడ ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. రాహుల్ పార్టీ అధ్యక్షుడుగా ఎన్నికైన తరువాత జరుగుతున్న తొలి ప్లీనరీ సమావేశాల్లో పలు అంశాలపై కీలక తీర్మానాలను ఆమోదించారు. ఎన్నికల ప్రక్రియపై విశ్వసనీయత కొనసాగించేందుకు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరపాలని ప్లీనరీ డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందేనని, దానితో పాటు విభజన సమయంలో ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేయాలని తీర్మానం చేసింది. అంతకు ముందు రాహుల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం

మిగతా 9లో

ప్రజలకు టిడిపి

క్షమాపణ చెప్పాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ద్వంద్వ వైఖరి అవలంభించి ప్రజలకు తీరని నష్టం చేసిన టిడిపి తక్షణం ప్రజలకు క్షమాపణ చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కాకపోవడానికి బిజెపితో పాటు టిడిపి కూడా కారణమేనన్నారు.. గుంటూరులో అతిసార ప్రాంతాల్లో శనివారం పర్యటించిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం అన్ని పార్టీలూ ఏకతాటిపైకి వచ్చాయని చెప్పారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అఖిలపక్షం వారిని చర్చలకు పిలుస్తామని చెప్పిన సీఎం ఇంత వరకూ స్పందించలేదన్నారు. సీఎం గత కొన్ని రోజులుగా కీలక అంశాలపై పరస్పర విరుద్ధంగా

మిగతా 9లో

ఒకే కుటుంబంలో

నలుగురు మృతి

- ఒకరికి తీవ్ర అస్వస్థత - ఆస్పత్రికి తరలింపు
- సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేస్తుండగా ఘటన

ప్రజాశక్తి-నక్కపల్లి (విశాఖ)



అప్పారావు | రాజశేఖర్ | కృష్ణ | నాగేశ్వరరావు

విశాఖజిల్లా నక్కపల్లి మండలం ఉపమాక ఎస్సీ కాలనీలో శనివారం కొత్త అమావాస్య పండగ పూట విషాదం చేటుచేసుకుంది. సెప్టిక్ ట్యాంక్ నుంచి వెలువడిన విషవాయువు వలన ఒకే కుటుంబంలో నలుగురు మృతిచెందారు. ఒకరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో తండ్రీకొడుకులు ఉన్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కాంద్రకోట అప్పారావు ఇంటి సెప్టిక్ ట్యాంక్ నిండిపోయింది. దీంతో పక్కనున్న మరో సెప్టిక్ ట్యాంక్‌లోకి

మిగతా 2లో

ఎన్డీయే సర్కారుపై

అవిశ్వాసానికి పూర్తి మద్దతు

సిపిఎం పొలిట్‌బ్యూరో ప్రకటన

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా, ఇతర అంశాలపై ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న డిమాండ్‌తో తెలుగుదేశం పార్టీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు ఎన్డీయే సర్కారుపై ప్రతిపాదిస్తున్న అవిశ్వాస తీర్మానానికి సిపిఎం పొలిట్‌బ్యూరో పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ నెల 16, 17 తేదీలలో ఇక్కడ జరిగిన పొలిట్‌బ్యూరోలో వివిధ అంశాలపై చర్చించినట్లు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ఇతర హామీలపై కొనసాగుతున్న ఉద్యమాన్ని తాము గట్టిగా సమర్థిస్తున్నామని పొలిట్‌బ్యూరో శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. విభజన చట్టం చేస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీల అమలులో వెనక్కి తగ్గటం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగినపుడు అన్నిరంగాలలో ప్రభుత్వ వైఫల్యంతో పాటు, పార్లమెంటరీ జవాబుదారీ తనాన్ని తప్పించుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎండగడతామని వివరించింది. లోక్‌సభ మొత్తం సభ్యుల సంఖ్యలో కనీసం 10 శాతం మంది మద్దతు వుంటే తీర్మానాన్ని చేపట్టేందుకు అంగీకరించాల్సి వుండగా లోక్‌సభ స్పీకర్ సభలో పరిస్థితి అదుపులో లేదంటూ సభను వాయిదా వేయటం శోచనీయమని పేర్కొంది. సభలో ఇదే పరిస్థితి కొనసాగుతున్న సమయంలో

మిగతా 8లో

గుంటూరు కమిషనర్‌పై

బదిలీవేటు

- అతిసార శాఖా పరమైన వైఫల్యమన్న సిఎం
- న్యాయ విచారణకు సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/అమరావతి బ్యూరో



కమిషనర్ అనురాధ

అతిసార ప్రబలి 16 మంది మృతిచెందిన ఘటనకు బాధ్యురాలిగా చేస్తూ స్థానిక మున్సిపల్ కమిషనర్ చల్లా అనురాధపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆమె స్థానంలో నూతన కమిషనర్‌గా విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీకేష్ బాలాజి లథకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. 15 రోజులైనా అతిసారను అదుపు చేయలేకపోవడం, మరణాలు ఆగకపోవడంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఇతర ప్రాంతాల నుంచి కమిషనర్లును రప్పించి గుంటూరులో పరిస్థితిని అధ్యయనం చేస్తున్నారు. నీటి కాలుష్యం నివారణకు చేపట్టిన చర్యలు నామమాత్రంగానే ఉన్నా యని ఉన్నతాధికారులు నిర్ధారణకు వచ్చారు. తొలుత స్థానిక జిఎంసి అధికారులు 9 మందిని సస్పెండ్ చేయగా శనివారం కమిషనర్ చల్లా అనురాధపై బదిలీ వేటు వేశారు. అతిసార ప్రబలి ప్రజలు చనిపోవడానికి శాఖాపరమైన వైఫల్యమే కారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శనివారం తన నివాసం నుంచి మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక అధికార యంత్రాంగం పనితీరు విఫలమైతే ఉన్నతస్థాయి అధికారులు చక్కదిద్దాలని ఆయన సూచించారు. ప్రజారోగ్యంపై ఉదాసీనత, నిర్లక్ష్యాన్ని సహించేదిలేదని, బాధ్యతా రాహిత్యంగా ఉండేవారిపై కఠిన చర్యలు తప్పవని సిఎం హెచ్చరించారు. పైపులైన్ల లీకేజీపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారుల్ని సిఎం ఆదేశించారు. మురుగు కాలువలన్నీ శుభ్రపరచాలని, శిథిలావస్థకు చేరిన పాత పైపులైన్లు తొలగించి కొత్తవి వేయాలని సూచించారు. గుంటూరు ఘటనపై నివేదిక పంపాలని ఆదేశించారు. డయేరియా కేసులు తగ్గుముఖం పట్టాయని, రెండు మూడు రోజుల్లో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వస్తుందని మునిసిపల్ శాఖ

మిగతా 2లో

అకాల వర్షంతో అపార నష్టం



గుంటూరు జిల్లా మాచర్ల మార్కెట్ యార్డులో తడిసిన కందుల బస్తాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం కురిసిన వర్షాలు సాగునీరు లేక వరి పంట ఎండిపోతున్న రైతులకు ఆనందాన్ని కలిగించగా, మిర్చి, మొక్కజొన్న, మామిడి, అరటి తదితర ఉద్యాన పంటల రైతులకు, రొయ్యల చెరువుల యజమానులకు దు:ఖాన్ని కలిగిస్తున్నాయి. సోమవారం నుంచి పొడివాతావరణం నెలకొంటుందని విశాఖ వాతావరణ అధికారులు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా గత రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. గుంటూరు జిల్లాలో కారుమబ్బులు పట్టడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. డెల్టా ప్రాంతంలో జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర, పసుపు, అరటి, ఇతర కూరగాయల పంటలు వేశారు. పల్నాడు ప్రాంతంలో మిర్చి, జొన్న పైర్లు ప్రధానంగా సాగుచేశారు. ఇప్పటికే చిరుజల్లులతో రైతులు కొద్దిమేర నష్టపోయారు. పొలాల్లోని పంటలను కాపాడుకోడానికి పట్టాలు కప్పడం కోసం ఉరుకులు పరుకులు పెడుతున్నారు. మాచర్ల వ్యవసాయ

మిగతా 9లో

మండలాల్లో బిజినెస్ మేనేజర్లు

సెర్ప్ సిఇవో కృష్ణమోహన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నేషనల్ లైవ్లీహుడ్ మిషన్ (ఎన్ఆర్ఎల్ ఎమ్) పథకంలో భాగంగా మండలాల్లో బిజినెస్ మేనేజర్లను నియమించనున్నట్లు సెర్ప్ సిఇఒ కృష్ణమోహన్ తెలిపారు. ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లో స్టార్టప్ విలేజ్ ఎంటర్ ప్రెన్యూర్లను తయారు చేసేందుకు కార్యచరణ సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఈ పథకం కోసం ఇప్పటికే గ్రామ, మండల, జిల్లా స్థాయి సంఘ సమాఖ్యల ద్వారా శిక్షణ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా ట్రెయినర్‌కు గ్రామీణ ఆర్థిక వృద్ధిపై అవగాహన కల్పిస్తామన్నారు. వ్యాపార నిర్వహణలో శిక్షణ, మార్కెటింగ్ కోసం గొలుసు సంబంధాల్ని (చైన్ లింక్‌డ్) ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామన్నారు.



ఆవిష్కరణ

సోషల్ మీడియా ఫర్ సొసైటీ (ఎస్ఎంఎస్) రెండో వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ

దుర్భరస్థితిలో విద్యా విధానం : భరద్వాజ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యా విధానం నేడు దుర్భర స్థితిలో ఉందని సినీ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. సోషల్ మీడియా ఫర్ సొసైటీ (ఎస్ఎంఎస్) రెండో వార్షికోత్సవం సందర్భంగా "నేటి చదువులు" అనే అంశంపై నిర్వహించనున్న షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ పోస్టర్‌ను విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అంశాన్ని ఎంచుకోవడం హర్షదాయకమని, బట్టీపట్టే చదువుల వల్ల సమాజానికి పనికొచ్చేలా విద్యార్థులు తయారవుతారా? అని ప్రతి ఒక్కరూ ప్రశ్నించుకోవాలన్నారు. తమ ఆలోచనల్ని ప్రపంచానికి తెలియజెప్పేందుకు షార్ట్ ఫిల్మ్‌లతో ముందుకు రావాలన్నారు. ఒత్తిడి లేని విద్యావిధానం ఉండాలని, స్వేచ్ఛ కావాలని, చదువును రుద్దడం వల్లే విద్యార్థులు ఆత్మహత్య లకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఎస్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు విజయప్రకాశ్ మాట్లాడుతూ పోటీకి సంబం ధించిన దరఖాస్తులు ఇ-క్షణం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, ఎంట్రీలను మార్చి 30 నుంచి ఏప్రెల్ 30 వరకూ స్వీకరిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9701387080, 9493276001 నంబర్లలో సంప్రదిం చాలన్నారు. ఈ పోటీకి న్యాయ నిర్ణేతలుగా దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ, సునీల్ కుమార్ రెడ్డి, వీఎన్ ఆదిత్య వ్యవహరిస్తారన్నారు. కాకినాడలో నిర్వహించే రెండో వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మే 12న ఎంపిక చేసిన షార్ట్ ఫిల్మ్‌ల ప్రదర్శన ఉంటుందని, ఈ కార్యక్రమానికి నటులు, రచయిత ఎల్‌బి శ్రీరాం హాజరవుతారని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు చొప్పున నగదు బహుమతితో పాటు కేటగిరీల వారీగా ఐదు ప్రత్యేక బహుమతుల్ని కూడా అందిస్తామన్నారు.

పోలవరంపై విచారణకు సిద్ధం : మంత్రి దేవినేని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఎలాంటి విచారణకైనా తాము సిద్ధమేనని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ప్రాణ త్యాగం చేసైనా ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. విజయవాడ జలవనరుల శాఖ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము అధికారంలో కొచ్చాక కేంద్రం నుంచి వచ్చిన నిధులు గానీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుకు వెచ్చించిన నిధులకు సంబంధించిగానీ లెక్కలన్నీ పూర్తిగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై సిబిఐ విచారణ చేయించాలని కొందరు కేంద్రానికి ఫిర్యాదు చేశారన్నారు. ప్రతిపక్ష నేత జగన్మోహనరెడ్డి కేంద్రానికి చేసిన ఫిర్యాదుల కారణంగానే పోలవరం పనుల్లో జాప్యం జరిగిందన్నారు. పోలవరం టెండర్లలో బేరసారాలు కుదరక పోవడం వల్లే వైఎస్ఆర్‌సిపి పుట్టిందని ఆయన విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాద సమయంలోనే కెవిపి రామచంద్రరావు, జగన్ పోలవరం టెండర్లను అప్‌లోడ్ చేశారని ఆరోపించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. 5వ నదీ మహోత్సవాలు ఎక్కడ ప్రారంభమయ్యాయి?
2. విమానయాన అభివృద్ధికి ఏ సంస్థతో భారత్ అంగీకారం కుదుర్చుకుంది?
3. రైల్వేల అధునీకరణకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఎడిబి) నుంచి భారత్ తాజాగా తీసుకున్న రుణ మొత్తం?
4. 2025 లోగా ఏ వాధ్యిని భారత్ నుంచి నిర్మూలించాలని కేంద్రం ప్రణాళిక ప్రారంభించింది?
5. ఒడిషా, చత్తీస్‌గఢ్ మధ్య మహనది జలాల వివాదంపై ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్?

హోదాపై అంతిమ పోరాటం

వెంకయ్య రాజీనామా చేయాలి : సిపిఐ కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో



రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం అంతిమ పోరాటానికి సిద్ధమవుతున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ వెల్లడించారు. ఇందుకనుగుణంగా తమ కార్యాచరణ ఉంటుందని ప్రకటించారు. హైదరాబాద్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడాతూ ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన హామీల అంశాలు పార్లమెంట్‌ను కుదిపేస్తున్నాయని చెప్పారు. హోదా జాతీయ అంశంగా మారిపోయిందని, అవిశ్వాస తీర్మానానికి వివిధ రాజకీయ పక్షాలు మద్దతుగా నిలుస్తున్నాయన్నారు. హోదాకు టిఆర్ఎస్ మద్దతు పలికిన విషయాన్ని గుర్తు చేస్తూ.. అవిశ్వాసంపై పార్లమెంట్‌లో చర్చ జరిగే విధంగా సహకరించాలని తెలంగాణ సిఎం కెసిఆర్‌ను కోరారు. రాష్ట్రానికి అన్ని విధాలుగా అన్యాయం చేసిన బిజెపి, నిధులిస్తామన్నా తీసుకోవడం లేదంటూ అబద్ధాలు చెబుతోందని ఆరోపించారు. చట్ట ప్రకారం ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేస్తే చాలని, అదనంగా ఏమీ ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాజ్యసభ చైర్మన్ హోదాలో ప్రత్యేక హోదాపై కేంద్రానికి రూలింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తన పదవికి రాజీనామా చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న బిజెపి ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ పదవులకు రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయాలని, ఈ ఆరుగురిలో ఏ ఒక్కరు గెలిచినా తాను బిజెపి గురించి మాట్లాడనన్నారు. కన్ఫ్యూజన్‌లో ఉన్న చంద్రబాబు యూటర్న్‌ల మీద యూటర్న్‌లు తీసుకుంటున్నారని, హోదాపై పలుమార్లు మాట మార్చారన్నారు. ఈనాడు తీసుకున్న నిర్ణయాన్ని మూడేళ్ల కింద తీసుకొని ఉంటే, హోదా అప్పుడే వచ్చేదన్నారు. బాబు ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకొని పోయిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల పాల్జేశారని విమర్శించారు. సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కారన్నారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన రాజ్యసభ సభ్యుల్లో అందరూ అగ్రకులాలకు చెందిన వారే ఉన్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వ వ్యవహారంపై ఈ నెల 20న జరిగే పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని ఆయన ప్రకటించారు.

చంద్రబాబు దళారీ నాయకుడు

నాలుగేళ్ళ పాలనలో అన్నీ కష్టాలే
ధరల స్థిరీకరణ ఏమైంది?
రైతు ఆత్మీయ సదస్సులో జగన్

ప్రజాశక్తి - పొన్నూరు (గుంటూరు జిల్లా)

చంద్రబాబు దళారీ నాయకుడనీ, బాబు ఇంటికి మిర్చియార్డు కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉంటే, తానొచ్చి మిర్చి రైతు కోసం ధర్నాలు చేయాల్సి వచ్చిందని ప్రతిపక్ష నేత జగన్ విమర్శించారు. ఈ నాలుగేళ్ల పాలనలో చంద్రబాబుకు తోడుగా వచ్చింది కరువేనని అన్నారు. ఈ నాలుగేళ్లలో పంట దళారుల వద్దకు వెళ్లాకే ధరలు పెరిగాయని, హెరిటేజ్ లాభాల కోసం ఆయనే దళారీ నాయకుడుగా తక్కువ ధరకు కొని మూడింతల ధర పెంచి అమ్ముతున్నారని దుయ్యబట్టారు. బాబు పాలనలో రైతు దగాపడ్డాడని విమర్శించిన జగన్ తాము అధికారంలోకి వస్తే రైతులకిచ్చే రాయితీలు, పథకాలను ప్రకటించారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా శనివారం సాయంత్రం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం, మండల కేంద్రమైన కాకుమాను శివారులో జరిగిన రైతు ఆత్మీయ సదస్సులో మాట్లాడారు. నాగార్జున సాగర్ కుడికాల్వకు 140 టిఎంసిల నికర జలాలున్న ప్రాంతంలో వరికి అవకాశం ఇవ్వలేదన్నారు. ఎడమ కాల్వ ద్వారా నీరందుతున్న ప్రాంతంలో వరి సాగవుతోందని, కెసిఆర్‌కు ఉన్నదేంటి? బాబుకు లేనిదేంటి? అని విమర్శించారు. కృష్ణా, గోదావరి జలాలను ఎగువనున్న వారు తోడేసుకుంటుంటే ఎందుకు అడగరని ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసులో దొరికినందుకు భయమా? అని ఎద్దేవా చేశారు. ధరల స్థిరీకరణ ఏమైందని ప్రశ్నించిన జగన్ ఖరీఫ్‌లో రైతు చెల్లించిన బీమాకు రాష్ట్ర ప్రభుత్వం వంతు ఇప్పటికీ చెల్లించలేదని గుర్తు చేశారు. రుణాలు మాఫీ అవ్వక రైతు ఇంటికి నోటీసులొస్తున్నాయని మండిపడ్డారు. రైతులకు తొమ్మిది గంటల విద్యుత్ అని చెపుతున్నా రాత్రివేళల్లో 7 గంటలే ఇస్తున్నారని విమర్శించారు. రేణిగుంట చిత్తూరు చక్కెర ఫ్యాక్టరీ, కొవ్వూరు చక్కెర ఫ్యాక్టరీ మూతపడ్డాయని, ఒంగోలు డెయిరీ రూ.80 కోట్ల నష్టాలో ఉదన్నారు. తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు మించి డీజల్ రేట్లు మన రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పాదయాత్రలో భాగంగా గుంటూరు జిల్లా కాకుమానులో నిర్వహించిన రైతు సదస్సులో మాట్లాడుతున్న జగన్

అటవీ శాఖ ఆయుధాలకు కేంద్రం మోకాలడ్డు

మూడేళ్లుగా తాత్సారం
ఢిల్లీలో మురిగిపోతున్న ఆయుధాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అటవీ సంపదను ముఖ్యంగా విలువైన ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు అటవీ అధికారులకు ఆయుధాలు అందజేసే విషయంలో తాత్సారం జరుగుతోంది. అటవీ శాఖ సిబ్బందికి ఆయుధాల నిర్వహణపై గతంలో ఒకసారి అటవీ శాఖ తరపున శిక్షణ ఇచ్చారు. పోలీస్ శాఖ నుంచి దాదాపు 150 ఆయుధాల్ని (పంప్ యాక్షన్ గన్స్) తీసుకుని ఎర్ర చందనం ఉండే అటవీ ప్రాంతాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి అందించింది. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు దాదాపు 250 ఆయుధాల్ని (పంప్ యాక్షన్ డబుల్ బ్యారెల్ గన్స్) అమెరికా నుంచి తెప్పించేందుకు ఆర్డర్ చేసింది. అయితే ఆ ఆయుధాలు ఢిల్లీ వరకు చేరాయి తప్ప, రాష్ట్రానికి ఇంకా చేరుకోలేదు. కేంద్ర హోం శాఖ కావాలనే వాటిని రాష్ట్రానికి రాకుండా చేస్తోందని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు పోలీసు అధికారులు, సిబ్బందికి మాత్రమే లైసెన్స్ ఉన్న ఆయుధాలిస్తున్నారు. అయితే కొత్తగా అటవీ శాఖ అధికారులు, సిబ్బందికి ఆయుధాల్ని అప్పగిస్తే శాంతి భద్రతలకు భంగం కలుగుతుందనే అనుమానంతో కేంద్రం అనుమతివ్వడంలేదు. ఏ రాష్ట్రానికీ కూడా ఈ విధంగా అటవీ శాఖకు ఆయుధాలిచ్చేలా అనుమతుల్లేవని, ఏపీకి మాత్రం ఎలా ఇస్తామని కేంద్రం చెబుతోంది. గతంలో కాంగ్రెస్ హయాంలో మధ్యప్రదేశ్‌లో మాత్రమే అటవీ శాఖ ఆయుధాలకు అనుమతిచ్చారని అధికారులు తెలిపారు. ఇక ఏపీ అటవీ శాఖకు ఆయుధాల్ని దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తే మిగిలిన రాష్ట్రాలు కూడా ఈ విధంగానే ఆయుధాల్ని పొందే అవకాశమేర్పడుతుందని కేంద్రం భావిస్తోందన్నారు. అందువల్లే గత మూడేళ్లుగా ఢిల్లీలోనే అటవీ శాఖ ఆయుధాలు మురిగిపోతున్నాయని తెలిపారు.

ఈ ఏడాది జనవరిలో వాటిని ఏపీకి దిగుమతి చేసేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డిజిఎఫ్‌టి) అనుమతులిచ్చింది. అయినప్పటికీ కేంద్ర హోం శాఖ రాష్ట్రానికి ఆ ఆయుధాల్ని అప్పజెప్పేందుకు రకరకాల కొర్రీలు పెడుతూ అనుమతులు ఇవ్వడంలేదు. ఆయుధాలకు లైసెన్స్ ఉన్నప్పటికీ కేంద్రం ఇలా అడ్డుకోవడం తగదని అటవీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే కేంద్రం మాత్రం కేవలం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు మాత్రమే ఆ ఆయుధాల్ని అప్పగించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిందని అధికారులు తెలిపారు. అటవీ శాఖ కోసం ఆయుధాల్ని తెప్పించినా అవి టాస్క్‌ఫోర్స్ పోలీసుల చేతికే అందుతాయంటున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రభుత్వం అటవీ శాఖకు ప్రత్యేక కేటాయింపులు చేసింది. టాస్క్‌ఫోర్స్ బృందంలో పోలీసు సిబ్బందితోపాటు అటవీ శాఖ సిబ్బంది కూడా ఉంటారు. ఎర్రచందనం స్మగ్లర్ల ప్రభావిత ప్రాంతాల్లో ఈ టాస్క్‌ఫోర్స్ బృందం నిరంతరం పహారా కాస్తుంది.

విజయవాడలో రాష్ట్ర వినియోగదారుల కేంద్రం : ప్రత్తిపాటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వినియోగదారుల కేంద్రాన్ని త్వరలో విజయవాడలో ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కులపై తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. వినియోగ దారులంతా సంఘటితంగా సమస్యల్ని పరిష్కరించుకోవాలన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. అవసరమైతే అక్రమ వ్యాపారులపై కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. వ్యాపారులు నిజాయితీగా సేవలందించాలని కోరారు. సరైన అవగాహన లేకుండా ఆన్‌లైన్ లావాదేవీలు చేయవద్దని వినియోగదారులకు సూచించారు. వినియోగదారుల హక్కుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2522 క్లబ్బులున్నాయన్నారు. 1986 వినియోగదారుల పరిరక్షణ చట్టం ప్రకారం వీరి కోసం 8 రకాల హక్కుల్ని కల్పించారన్నారు. హక్కులకు భంగం కలిగితే వినియోగదారుల ఫోరంలో కేసు వేసి న్యాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల రక్షణ టోల్ ఫ్రీ నెంబర్, వినియోగదారుని దీపిక, పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ పుష్పరాజ్, కమిషనర్ రాజశేఖర్, కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనురాధ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అవినీతిని బయట పెట్టండి

కేంద్ర సాయాన్ని ప్రచారం చేయండి
ఏపి బిజెపి నేతలకు అమిత్ షా ఆదేశం
కంభంపాటికి కేంద్రమంత్రి పదవి?

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

చంద్రబాబు ప్రభుత్వం చేసే అవినీతిని బయటపెట్టాలని బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఏపి బిజెపి నేతలకు ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ఏపికి చేసే సహాయంపైన రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై దూకుడుగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. అంతర్గత పోరును తగ్గించుకోవాలని నేతలకు హిత బోధ చేశారు. శనివారం నాడిక్కడ బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బిజెపి నేతలు సమావేశమయ్యారు. ఏపిలో బిజెపి అనుసరించాల్సిన వ్యూహం, టిడిపిని ఎలా ఎదుర్కోవాలి? బిజెపిపై, కేంద్రంపై విమర్శలు చేస్తున్న ఇతర పార్టీలపై ఎలాంటి వైఖరి అనుసరించాలనే దానిపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న హరిబాబును కేంద్ర మంత్రి వర్గంలో తీసుకోవాలని, రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు వేరొకరికి అప్పగించాలని నిర్ణయించినట్లు సమాచారం. హరిబాబు కేంద్ర మంత్రి వర్గంలోకి వెళ్తే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు ఎవరికి అప్పగించాలనే దానిపై కసరత్తు జరిగినట్లు సమాచారం. సోము వీర్రాజు, ఆకుల సత్యనారాయణ, విష్ణుకుమార్ రాజు.. వీరిలో ఒకరికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

పవన్ కల్యాణ్ వైఖరేంటి?

2014లో బిజెపి, టిడిపిలకు మద్దతిచ్చిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గతంలో కాకినాడ సభలో బిజెపిపై విమర్శలు గుప్పించడం, తాజాగా మంగళగిరిలో జరిగిన జనసేన ఆవిర్భావ సభలో టిడిపిపై అవినీతి ఆరోపణలు చేయడంపై బిజెపి నేతలు చర్చించారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ రాజకీయ వైఖరేంటీ, రాష్ట్రంలో ఎలాంటి వ్యూహం అనుసరించాలనే దానిపై చర్చించారు. ఈ సమావేశంలో ఏపి బిజెపి నేతలు రాం మాధవ్, పురందేశ్వరి, కామినేని శ్రీనివాస్, మాణిక్యాల రావు, సతీష్ జీ, విష్ణుకుమార్ రాజు, సోము వీర్రాజు, ఆకుల సత్యనారా యణ, కన్నా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అమిత్ షాతో భేటీ అనం తరం బిజెపి ప్రధాన కార్యదర్శి రాం మాధవ్ మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకూ చంద్రబాబు ప్రశ్నలు వేస్తున్నారని, వాటన్నింటికీ సమాధానం చెబుతామని, అదే విధంగా తాము అడిగే ప్రశ్నలకూ సిఎం చంద్రబాబు సమాధానం చెప్పాల్సి ఉంటుందని అన్నారు.

ఒకే కుటుంబంలో నలుగురు మృతి

అప్పారావు (50), అతని కుమారుడు రాజశేఖర్ (28), కృష్ణ (30), నాగేశ్వరరావు (35) సత్తిబాబులను 108 వాహనంలో స్థానిక 30 పడకల ఆసుపత్రికి తరలించారు. సత్తిబాబు తప్ప మిగిలిన నలుగురు మృత్యువాత పడినట్లు వైద్యులు నిర్ధారించారు. సత్తిబాబు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రమాద ఘటనపై ఆరా

పాయకరావుపేట ఎమ్మెల్యే అనిత, జెసి సృజన, ఆర్‌డిఒ కోరాడ సూర్యారావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త వీసం రామకృష్ణ, డివైఎఫ్‌వై జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ తదితరులు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ప్రమాద ఘటన గురించి ఆరా తీశారు.

రూ.రెండు లక్షల చొప్పున ఎక్‌గ్రేషియా

మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం చెల్లించనున్నట్లు ఎమ్మెల్యే అనిత, జెసి సృజన తెలిపారు. చంద్రన్న బీమా రూ.5 లక్షలు అందుతుందన్నారు. మృతుల కుటుంబాలకు గృహాలు మంజూరు చేసి, ఉపాధి కల్పిస్తామని చెప్పారు.

రూ.10లక్షల చొప్పున చెల్లించాలి : సిపిఎం

మృతులకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాధం, కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు.

గుంటూరు కమిషనర్‌పై బదిలీవేటు

మొదటి పేజీ తరువాయి

మంత్రి నారాయణ అన్నారు

న్యాయ విచారణ చేయాలి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

గుంటూరులో తీవ్ర స్థాయిలో ప్రబలిన డయేరియాపై ప్రభుత్వం వెంటనే ఉన్నత స్థాయి న్యాయ విచారణ చేయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండ్ చేశారు. డయేరియా తీవ్రత వల్ల మరణించిన వారి కుటుంబ సభ్యులను, ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న రోగులను ఆయన పరామర్శించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకూ 25 మంది చనిపోయారని కానీ ప్రభుత్వం మృతుల వివరాలు, వ్యాధి గ్రస్తుల సంఖ్యను తగ్గించి చూపే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులపై వత్తిడి చేసి డయేరియాతో చనిపోయిన వారిని గుండెపోటు, కిడ్నీ సంబంధ సమస్యలతో మృతి చెందినట్లు నమోదు చేయిస్తున్నారనీ తెలిపారు. డయేరియా తీవ్రత వల్ల అస్వస్థతకు గురై కొంత మంది డయాలసిస్, గుండెపోటు సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. డయేరియాపై ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా ఆదివారం గుంటూరులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అన్ని పార్టీల వారితో చర్చించి భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన వివరించారు. 48 గంటల్లోగా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. లేదంటే గుంటూరు బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.కృష్ణయ్య, సిపిఎం తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిపిఎం నగర కార్యదర్శి నళీనీకాంత్ పాల్గొన్నారు.

ప్రత్యేకం

అవినీతి పోలీసులపై కంప్లయింట్ అథారిటీ

రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీలు
విచారణాధికారులుగా రిటైర్డ్ జడ్జీలు
ప్రతిపాదనలకు సిఎస్ ఆమోదముద్ర
స్టేట్ సెక్యూరిటీ కమిషన్‌కు ఆమోదం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో పోలీస్ కంప్లయింట్ అథారిటీని ఏర్పాటుచేసేందుకు కసరత్తు దాదాపుగా పూర్తయ్యింది. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో వేర్వేరుగా ఈ అథారిటీలు ఏర్పాటుకానున్నాయి. దీనికి సంబంధించి హోంశాఖ రూపొందించిన ప్రతిపాదనల్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సిఎస్) దినేష్‌కుమార్ ఆమోదించారు. ముఖ్యమంత్రి అనుమతి లభించిన వెంటనే వచ్చే శాసనసభలో ప్రవేశపెట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

పోలీసు ఉద్యోగులపై వచ్చిన ఆరోపణల్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసేందుకు, పరిష్కార చర్యల్ని చేపట్టేందుకు కంప్లయింట్ అథారిటీలను ఏర్పాటుచేయాలని గతంలోనే అన్ని రాష్ట్రాలనూ సుప్రీం కోర్టు ఆదేశించింది. అలాగే సెక్యూరిటీ కమిషన్‌ను కూడా ఏర్పాటుచేయాలని నిర్దేశించింది. ఈ ఆదేశాల నేపథ్యంలో సెక్యూరిటీ కమిషన్‌ను 2013లోనే ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటుచేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే తాజాగా ఆంధ్రప్రదేశ్ కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తరువాత రాష్ట్రంలో కొత్త కమిషన్ ఏర్పాటుచేయాల్సిన అవసరం నెలకొంది. అందుకే ముందుగా ఈ కమిషన్‌పై విధి విధానాల్ని సిద్ధం చేయగా, దానికి ప్రభుత్వ ఆమోదముద్ర కూడా పడింది. త్వరలోనే దీనిపై ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు హోంశాఖ వర్గాలు చెప్పాయి.



కంప్లయింట్ అథారిటీలకు సంబంధించిన మార్గదర్శకాలు కూడా ఇప్పటికే సిద్ధమయ్యాయి. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అనేక ఫిర్యాదులు పోలీసులపై వస్తున్నాయి. వీటిని ఈ అథారిటీలు విచారించాల్సి ఉంటుంది. ఈ కమిటీలకు పదవీ విరమణ చేసిన హైకోర్టు జడ్జీలు నేతృత్వం వహించాలని కూడా సుప్రీంకోర్టు నిర్దేశించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగానే మార్గదర్శకాల్ని రూపొందించారు. రాష్ట్ర కమిటీలో హైకోర్టు రిటైర్డ్ జడ్జీతో పాటు, రాష్ట్ర డిజిపి, పదవీ విరమణ చేసిన పోలీసు ఉన్నతాధికారులు, న్యాయ నిపుణులు, వివిధ రంగాల ప్రముఖులు ఉంటారు. జిల్లా స్థాయి అథారిటీల్లో రిటైర్డ్ జిల్లా జడ్జీతోపాటు, జిల్లా ఎస్పీ, ఇతర రంగాల నిపుణులు ఉంటారు. రాష్ట్ర స్థాయి అథారిటీలో ఎస్పీ నుంచి పైస్థాయి అధికారులపైనా, జిల్లా అథారిటీల్లో కానిస్టేబుల్ నుంచి డిఎస్పీ స్థాయి అధికారులపైనా విచారణ చేసేందుకు అధికారాలుంటాయి.

తాజా మార్గదార్శకాలు సిద్ధం

సెక్యూరిటీ కమిషన్‌కు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన ఉత్తర్వుల్లోని అంశాలనే పరిగణనలోకి తీసుకుని తాజా మార్గదర్శకాల్ని సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. పోలీసు యంత్రాంగంపై ప్రభుత్వ అనవసర పెత్తనాన్ని తగ్గించేందుకు ఈ చట్టం ఉపయుక్తంగా ఉంటుంది. 2006లోనే ఈ ఆదేశాలు సుప్రీంకోర్టు నుంచి వచ్చినప్పటికీ 2013 వరకు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు. ఈ కమిషన్‌లో ఎక్స్ అఫీషియో చైర్మన్‌గా రాష్ట్ర హోంమంత్రి ఉంటారు. సభ్యులుగా ప్రతిపక్ష నేత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపితోపాటు కొంతమంది స్వతంత్ర ప్రతినిధులుగా కూడా సభ్యులుగా ఉంటారు. ఈ కమిషన్ ముసాయిదాను ప్రభుత్వం ఆమోదించిందని, త్వరలోనే ఉత్తర్వులు జారీ చేస్తామని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.

సంక్షిప్తం

'ఉగాది' వెలుగులు నింపాలి : గవర్నర్

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

తెలుగు ప్రజలకు గవర్నర్ నరసింహన్ శ్రీ విళంబి నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పర్వదినాన్ని ప్రజలంతా ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. శ్రీవిళంబి నామ సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

తూర్పునౌకాదళంలో పర్యటించిన శ్రీలంక నేవీ కమాండర్

శ్రీలంక వైస్ అడ్మిరల్, నేవీ కమాండర్ సిరిమెవాన్ రణసింఘే శనివారం తూర్పునౌకాదళం (ఇఎన్‌సి)లో పర్యటించారు. ఈయనతో పాటు మరో నలుగురు ప్రతినిధి బృందం కూడా పర్యటించారు. వీరు మూడు రోజుల పాటు ఇఎన్‌సిలో పర్యటిస్తారు. వీరికి తూర్పునౌకాదళ వైస్ అడ్మిరల్ కరంబీర్ సింగ్ ఘనస్వాగతం పలికారు. దేశీయంగా నావికాదళంలో కమాండ్ చేపట్టే కార్యకలాపాల గురించి ఇఎన్‌సి అధికారులు వారికి వివరించారు. ఐఎన్ఎస్ సత్పుర, ఐఎన్ఎస్ విశ్వకర్మ (స్వదేశీ స్టెల్త్ యుద్ధ నౌకలు)లను శ్రీలంక బృందానికి చూపించారు. ఈ రెండూ విశాఖ నేవల్ ఆర్కిటెక్ట్స్ నేవల్ డాక్‌యార్డులో నిర్మించబడినవని వివరించారు. నేవీ వైవ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎన్‌డబ్ల్యూడబ్ల్యూఎ, ఈస్టర్న్ రీజియన్)కు చెందిన మీనాపవార్ సంక్షేమ కార్యక్రమాలను రణసింఘేకు వివరించారు.

రాజకీయ ప్రయోజనాలే టిడిపికి ముఖ్యం : బిజెపి

రాష్ట్ర అభివృద్ధి కంటే టిడిపికి రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యాంకిషోర్ అన్నారు. వైసిపి ఉచ్చులో ఇరుక్కున్న టిడిపి రోజుకో నిర్ణయాన్ని ప్రకటిస్తోందన్నారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీయే నుంచి బయటకు వెళ్లాలని టిడిపి నిర్ణయించినట్లు మా పార్టీకి నలభై రోజుల కిందే సమాచారం అందిందన్నారు. హోదా ఉన్న రాష్ట్రాలకు, లేని రాష్ట్రాలకు వ్యత్యాసం ఉన్నప్పటికీ 30 శాతం నిధుల్ని నాబార్డు ద్వారా కేటాయించేందుకు కేంద్రం అంగీకరించినా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు.

విజయనగరంలో తమన్నా సందడి

ప్రజాశక్తి-విజయనగరం కంటోన్మెంట్

మంచి సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తానని మిల్కీబ్యూటీ తమన్నా తెలిపారు. విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన బి-న్యూ మొబైల్ షోరూమ్‌ను ప్రారంభించేందుకు శనివారం ఆమె పట్టణానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం తమిళ, ఇతర భాషా సినిమాల్లో నటిస్తుండడం వల్ల బిజీగా ఉన్నానని, తెలుగు సినిమాల్లో కొంత విరామం వచ్చిందని తెలిపారు. మరిన్ని మంచి చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తానని చెప్పారు. తమన్నాను చూసేందుకు వందలాది అభిమానులు రావడంతో ఆర్‌టిసి కాంప్లెక్స్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో షోరూం చైర్మన్ వైడి బాలాజి పాల్గొన్నారు.



ప్రారంభోత్సవం

విజయనగరంలో శనివారం బి-న్యూ మొబైల్ షోరూమ్‌ను ప్రారభించి మాట్లాడుతున్న సినీనటి తమన్నా

న్యాయ వ్యవస్థలో ఇతరులు జోక్యం చేసుకోకూడదు

సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ

ప్రజాశక్తి-పార్వతీపురం (విజయనగరం జిల్లా)

న్యాయ వ్యవస్థలో ఇతర శక్తులు జోక్యం చేసుకోకూడదని సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ అన్నారు. కోర్టులో జరిగే వాద ప్రతివాదనలు, తీర్పులు మాతభాషలో జరిగితే కక్షిదారులకు అవగాహన పెరిగి న్యాయవ్యవస్థపై నమ్మకం పెరుగుతుందన్నారు.

విజయనగరంజిల్లా పార్వతీపురం పట్టణ కేంద్రంలో రూ. 5 కోట్ల 26 లక్షల వ్యవయంతో నిర్మించిన 3 కోర్టుల భవన సముదాయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగంలో పేర్కొన్న మూడు వ్యవస్థలూ సక్రమంగా పనిచేసి ప్రజల హక్కులను సంరక్షించాల్సిన బాధ్యత ఎక్కువగా ఉందన్నారు. దేశంలో నేటికి అనేక చోట్ల నిరక్ష్యరాస్యత, నిరుద్యోగం వుందని, ఆయా విషయాల్లో ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. సమాజానికి మేధావి వర్గం మార్గదర్శిగా వుండాలన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రజని మాట్లాడుతూ విలువలతో కూడిన న్యాయ వ్యవస్థ కొనసాగాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లాజడ్జి ఎ.గిరిధర్, కలెక్టర్ వివేక్‌యాదవ్, జెసి శ్రీకేశ్‌బి లత్కర్, ఐటిడిఎ పిఒ డాక్టర్ లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు.

దసపల్లా హిల్స్ భూముల్లో అక్రమ నిర్మాణాలు



దసపల్లా భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు

రిజిస్ట్రేషన్లకు యత్నం
తెగబడ్డ కబ్జాదారులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ నగరంలో భూదందాలు, అక్రమ నిర్మాణాల పరంపర కొనసాగుతూనే ఉంది. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పరిశీలన తర్వాత కూడా భూ ఆక్రమణలు, భూములను కైంకర్యం చేసే ప్రక్రియలు ఆగకపోవడం విశేషం. విశాఖ నడిబొడ్డున గల దసపల్లా భూ వివాదం ఏనాటినుంచో నడుస్తోంది. త్వరలో ఇదొక కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. సుమారు 100 ఎకరాల వరకూ సీలింగ్ మిగులు భూములను ప్రయివేటు వ్యక్తులు చేజిక్కించుకుని తాజాగా నిర్మాణాలను చేపట్టారు. దీనిపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం బెంచ్ స్పందిస్తూ.. ఆ భూములకు యజమాని ఎవరో తేల్చాక కట్టడాలకు అనుమతివ్వాలంటూ జివిఎంసి అధికారులకు జారీచేసిన ఆదేశాలను బే ఖాతరు చేసినట్లు వెల్లడవుతోంది.

పలుకుబడితో కబ్జాల పర్వం

గతంలో కోర్టుల్లోనూ, హైదరాబాద్ సిసిఎల్ఎ లోనూ పలుకుబడితో మాయ చేసి అత్యంత ఖరీదైన దసపల్లా భూముల్ని కాజేయడానికి ప్రయత్నించిన వైనానికి చెక్ పడినా బకాసురులు ఆగడం లేదు. ఇదివరకు సుప్రీం కోర్టును ఆశ్రయించిన కబ్జాకోర్లు ఆ తీర్పుని అడ్డుపెట్టుకుని అడ్డదారిలో నేడు నిర్మాణాలు చేపడుతున్నారు. విశాఖ సర్క్యూట్ హౌస్ (గవర్నర్ బంగ్లా)కు ఆనుకుని ఉండే సుమారు 100 ఎకరాల్లో 50కి పైగా ఎకరాలను వీరు కబ్జా చేశారు. ఈ దసపల్లా భూములు సుమారు రూ.3వేల కోట్లుగా ప్రభుత్వం అప్పట్లో గుర్తించింది. గతంలో ఈ భూములపై బ్రోకర్లు యుఎల్‌సి సుబ్బరాజు, కోటేశ్వరరావు సుప్రీంకోర్టులో తప్పుడు రికార్డులను చూపించి తప్పుదోవ పట్టించారన్నది కలెక్టరేట్ రెవెన్యూ ఉన్నతాధికార యంత్రాంగం కూడా బాహాటంగా చెప్పింది. అదే సందర్భంలో కొంతమంది ఐఎఎస్‌లు గతంలో పని చేసిన వారు ఈ బ్రోకర్లకు అండగా నిలబడినందు వల్లనే సుప్రీం కోర్టులో తప్పుడు పత్రాలను చూపి గెలుచుకున్నట్లు స్పష్టమవుతోంది.

తాజాగా రిజిస్ట్రేషన్ల పర్వం

ఈ భూములను రిజిస్ట్రేషన్లు చేసేందుకు కబ్జా కోర్లు ప్రయత్నించారు. సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చిన ప్రకారం అనుమతులు వచ్చేశాయంటూ వీరు సంబరపడ్డారు. కానీ ప్రభుత్వం తరపున తాజాగా అడ్వకేట్ జనరల్ దమ్మలపాటి శ్రీనివాస్ తన వాదనలు వినిపించినట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వ వాదనలు వినకుండా సింగిల్ జడ్జి దసపల్లా భూములపై తీర్పు ఇచ్చినట్లు తెలుస్తోంది. డివిజన్ బెంచ్ జోక్యం చేసుకుని ప్రభుత్వ వాదన లతో ఏకీభవిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తొమ్మిది అనుమతుల్ని రద్దు చేసింది. ప్రభుత్వ వాదనలు విన్నాకనే సింగిల్ జడ్జి దీనిపై తీర్పునివ్వాలని ఆదేశించింది. దీంతో దసపల్లా భూములను కాజేయాలని ప్రయత్నిస్తున్న కబ్జాకోర్లకు అడ్డుపుల్ల పడినట్టయింది.

తెరపైకి రాణీకమలాదేవి

ఈ భూములకు పూర్వపు వారసురాలిగా చెప్పుకునేది రాణీకమలాదేవి (ఈమె నుంచే కొన్నామంటూ కబ్జాకోర్లు పత్రాలు సృష్టించారు). ఈమె వేసిన కేసు విచారణను మాత్రం డివిజన్ బెంచ్ వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. దీంట్లో 2017 నవంబరులో ఈ భూములపై ఉన్న గెజిట్ నోటిఫికేషన్‌ను కోర్టు రద్దు చేసింది. దీన్ని ఆధారం చేసుకునే దసపల్లా భూముల రిజిస్ట్రేషన్ కోసం కోర్టు ఉత్తర్వులను పొందాలని కబ్జాకోర్లు ప్రయత్నిస్తున్నారు. కాగా, రిట్ పిటిషన్ నెంబరు 154/2018లో సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ ఒక్క తీర్పును మాత్రం డివిజన్ బెంచ్ రద్దు చేయలేదు.

బెల్లం సిండి'కేటు'..!

ధరల పతనం
రెండు నెలల్లోనే కిలో రూ.20మేర తగ్గింపు
పట్టని మార్క్‌ఫెడ్
తల్లడిల్లుతున్న అన్నదాతలు



ప్రజాశక్తి-చిత్తూరు ప్రతినిధి

బెల్లం మార్కెట్‌లో వ్యాపారులు రైతులను జలగల్లా పీల్చేస్తున్నారు. సిండికేటుగా మారి వారి కష్టాన్ని దోచుకుంటున్నారు. రెండునెలల్లోనే కిలో రూ.20 మేర ధరలను తగ్గించేశారు. అసలే పెట్టుబడులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగి అల్లాడుతున్న రైతులను మార్కెట్ మాయాజాలం మరింతగా కుంగదీస్తోంది. సహకార చక్కెర కర్మాగారాలు మూతపడడం, మార్క్‌ఫెడ్ అధి కారులు పట్టించుకోకపోవడం వ్యాపారస్తుల దొంగా టకు హద్దూపొద్దూ లేకుండాపోతోంది. చిత్తూరు జిల్లాలో వేరుశనగ తరువాత ఎక్కువ మంది రైతులు చెరకు సాగుచేస్తున్నారు. దాదాపు 54 వేల ఎకరాల్లో సాగవుతోంది. ఇలా సాగవుతున్న దాంట్లో 9.96 లక్షల క్వింటాళ్ల చక్కెరకు, 4.75 లక్షల క్వింటాళ్లు బెల్లం తయారీకి ఉపయోగిస్తున్నారు. జిల్లాలో రెండేళ్ల వరకు ఆరు చక్కెర పరిశ్రమలుండేవి. నష్టాల సాకుతో రెండు ఫ్యాక్టరీలను ప్రభుత్వం మూసేసింది. దీంతో ప్రయివేటు పరిశ్రమలే రైతులకు దిక్క య్యాయి. ప్రైవేటు పరిశ్రమలు టన్నుకు రూ.2,200 మించి ఇవ్వడం లేదు. టన్నుకు రూ.3,500 ఇవ్వా లని రైతులు కోరుతున్నారు.

ఇతర రాష్ట్రాల్లో ఆంక్షలు

జిల్లాకు చెందిన బెల్లం ముద్దలు దేశవ్యాప్తంగా మార్కెట్ ఉంది. తెలంగాణ, అసోం, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహర్, కర్ణాటక, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలకు ఎగుమతయ్యేది. తమ రాష్ట్రాల్లో తయారయ్యే బెల్లానికి మార్కెట్ ఉండాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే బెల్లానికి ఆంక్షలు విధించారు. ఎగుమతుల పరిధి కుచించుకుపోవడంతో చిత్తూరు బెల్లం మార్కెట్‌ను బాగా దెబ్బతీసింది.

ధరల పతనం

ఈ కారణాలను సాకుగా చూపించి జిల్లాలోని బెల్లం వ్యాపారస్తులు సిండికేట్ అయ్యారు. దీంతో బెల్లం ధరలు పతనమయ్యాయి గత ఏడాది మొదటి రకం బెల్లం కిలో 55 రూపాయలు పలికింది. నేడు 33 రూపాయలకు పడిపోయింది. రెండో రకం 45 రూపాయల నుంచి 30 రూపాయలకు దిగజారింది. గత సీజన్‌లో 32 రూపాయలు పలికిన మూడో రకం బెల్లం నేడు 27 రూపాయల వద్ద కొట్టు మిట్టాడుతోంది. ఇక చివరి రకంగా పిలిచే నల్లబెల్లం పోయిన సారి 27 రూపాయలు పలికింది. ఈ సారి 20 రూపాయలకు కూడా అమ్ముడు పోవడం గగనంగా మారింది.

చేతులెత్తేసిన మార్క్‌ఫెడ్

నాలుగేళ్లుగా నల్ల బెల్లాన్ని కొనుగోలు చేసిన మార్క్‌ఫెడ్ ఈ సారి చేతులెత్తేసింది. 2012-13లో 525 టన్నులు, 2013-14లో 406 టన్నులు, 2014-15 732 టన్నులు టన్నలు కొనుగోలు చేసింది. గత ఏడాది 925 టన్నులు కేజీ రూ. 27 లెక్కన కొనుగోలు చేసింది. రంగు బెల్లం ధరలు కూడా పడిపోతున్న తరుణంలో వీటిని కూడా కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

సాగు చేయలేక అల్లాడుతున్నాం

నాకు ఎకరా పొలం ఉంది. కరువుతో నీళు లేక.. అప్పులు పుట్టక ఎలాగో కష్టపడి సాగు చేశాను. ఫ్యాక్టరీ మూతపడటంతో బెల్లం తయారు చేస్తున్నాను.

రామాంజులనాయుడు, బంగారు పాళ్యం బెల్లం రైతు

స్వేచ్ఛను హరించే హక్కు ఎవ్వరికీ లేదు

- న్యాయ వ్యవస్థకు ఎవ్వరూ అతీతులు కారు
- సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరద్ బాబ్డే

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

న్యాయవ్యవస్థ చాలా గొప్పదని, దీనికి ఎవరూ అతీతులు కారని, మతం ప్రజలను విభజిస్తే ధర్మం ఐక్యం చేస్తుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరద్ అరవింద్ బాబ్డే తెలిపారు. బలవంతుడి నుంచి బలహీనుడిని ధర్మం పరిరక్షిస్తుందన్నారు. వేరొకరి స్వేచ్ఛను, జీవనాన్ని హరించే హక్కు ఎవ్వరికీ లేదన్నారు. శనివారం ఎయులోని వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ఎయు అంబేద్కర్ న్యాయ కళాశాల అధ్వర్యాన 'సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ధర్మనిధి ప్రసంగం'లో 'రూల్ ఆఫ్ లా' అనే అంశంపై బాబ్డే కీలకోపన్యాసం చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సర్ సిఆర్ రెడ్డితో ప్రారంభమై, సర్వేపల్లి రాధాకృష్ణన్, సచ్చిదానంద మూర్తి, ఆవుల సాంబశివరావు వంటి మహనీయుల మార్గదర్శకంతో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. జిఎంసి బాలయోగి, ఎర్రన్నాయుడు వంటి పూర్వవిద్యార్థులు వర్సిటీకి ఎంతో పేరుతెచ్చారన్నారు. జస్టిస్ జాస్తి చలమేశ్వర్ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి కావడం ఎంతో గర్వకారణమన్నారు.

మరో ముఖ్య అతిథి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ న్యాయ సూత్రాలు చాలా ప్రాచీనమైనవని, దీనికి సంబంధించిన పలు తీర్పులను ఉటంకించారు. ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే కష్టించి పనిచేసే తత్వం కలిగి ఉండాలనేది జస్టిస్ చలమేశ్వర్ నుంచి నేర్చుకోవాలన్నారు. సమసమాజ పరిరక్షణలో న్యాయసూత్రాలు ఎంతో కీలకమైనవన్నారు. 'జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ధర్మనిధి' ప్రసంగాన్ని ఏర్పాటు చేసిన మాజీ రాజ్యసభ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్‌ను న్యాయమూర్తులు అభినందించారు.

ఎయు వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు మాట్లాడుతూ జస్టిస్ జాస్తి చలమేశ్వర్ తమ విశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థి కావడం గర్వకారణమన్నారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా కీలక తీర్పులను చలమేశ్వర్ ఇచ్చారన్నారు. అనంతరం వర్సిటీ తరపున న్యాయమూర్తులను ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు, డిఎస్ఎన్ఎల్‌యు వీసీ ఆచార్య వి.కేశవరావు, పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరద్ అరవింద్ బాబ్డే

ప్రాజెక్టు పనుల ఉల్లంఘనపై సిబిఐ విచారణ

విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ డిమాండ్

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ, పురుషోత్తపట్నం నిర్మాణ పనుల్లో జరిగిన నిబంధనల ఉల్లంఘనపై సిబిఐ విచారణ చేపట్టాలని విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా, నిర్మాణ పనులకు అవసరమైన అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించిందని తెలిపారు. శనివారం ఉదయం పౌరగ్రంథాలయంలో 'ఏపిలో నీటిపారుదల ప్రాజెక్టులు, అమలు తీరు'పై జన చైతన్య వేదిక నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టాలను ఖాతరు చేయకుండా పోలవరం పనులు చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పరిహారం ఎగ్గొట్టేందుకు ముంపు ప్రాంతాల్లోని గిరిజనులకు అటవీ హక్కుల చట్టం కింద పట్టాలను మంజూరు చేయకపోవడాన్ని ఆక్షేపించారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం విచాకరమన్నారు. కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లింపులో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పద్ధతులను పాటించలేదని విమర్శించారు. నిర్మాణ పనులను ఆలస్యం చేసిన ట్రాన్స్‌ట్రాయ్ ఏజెన్సీపై అపరాధ రుసుం వసూలు చేయకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. స్థానిక నీటివనరుల సామర్థ్యాన్ని పెంచుకోకపోతే విశాఖ నగరానికి నీటి సంక్షోభం తప్పదన్నారు. ఈ సదస్సులో నీటిపారుదల శాఖ విశ్రాంత చీఫ్ ఇంజినీరు యు.నారాయణమూర్తిరాజు, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, నీటిపారుదలశాఖ విశ్రాంత చీఫ్ ఇంజినీరు ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇఎఎస్ శర్మ

వెంకన్న సేవలో ఇస్రో ఛైర్మన్ శివన్ నాడర్

ప్రజాశక్తి-తిరుమల

తిరుమల శ్రీవారిని శనివారం ఇస్రో ఛైర్మన్ శివన్‌నాడార్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయక మండపంలో అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారిని మొదటి సారిగా దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని, ఈనెలాఖరు లోపు జిఎస్ఎల్‌వి నింగిలోకి దూసుకెళ్లడానికి సిద్ధంగా ఉందని, ఈ ప్రయోగం విజయవంతం కావాలని స్వామివారి ఆశీస్సులు పొందడానికి వచ్చినట్లు ఇస్రో ఛైర్మన్ చెప్పారు. అలాగే పిఎస్ఎల్‌విజి షాట్ లెవన్ అనే అతి పెద్ద శాటిలైట్‌ను లాంచ్ చేయడానికి అన్నివిధాలా ఏర్పాట్లు చేస్తున్నామని శివన్ తెలిపారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లే వారికోసం ఒక కొత్త యాప్‌ను సిద్ధం చేశామని, త్వరలోనే ఈ సిస్టమ్‌ను వాడుకలోకి తేనున్నామని తెలిపారు.

పశ్చిమలో తెలంగాణ ఎసిబి దాడులు

ప్రజాశక్తి - కొవ్వూరు

పశ్చిమగోదావరి జిల్లాలో తెలంగాణ ఎసిబి అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి లేబర్ బోర్డు జడ్జి ఎం.గాంధీ ఇంటిపై ఎసిబి అధికారులు దాడులు చేశారు. ఈ దాడిలో అక్రమ ఆస్తులు బయట పడ్డాయి. ఈ కేసులో తెలంగాణ ఎసిబి డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు మెదక్ రేంజ్ డిఎస్‌పి బి.ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యాన జిల్లాలో దాడులు నిర్వహించారు. కొవ్వూరులోని గాంధీ తోడల్లుడు, న్యాయవాది ఎన్.పుల్లారావు ఇంట్లోనూ, దేవరపల్లి మండలం కురుకూరులో గాంధీ అన్నయ్య ఇంట్లోనూ, గోపాలపురం మండలం వెదుళ్లకుంటలో గాంధీ మావయ్య ఇంటిలోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహించామని ఎసిబి అధికారులు తెలిపారు. పుల్లారావుకు సంబంధించిన బ్యాంకు ఖాతా వివరాలు, ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్ వివరాలు, వివిధ దస్తావేజులు పరిశీలించారు. సోదాల్లో జిల్లాకు సంబంధించి ఎసిబి సిఐ కె.శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. దేవరపల్లి మండలం కురుకూరులో గాంధీ సోదరుడు మల్లంపాటి కామేశ్వరరావు ఇంటిపై నిర్వహించిన దాడుల్లో ఎటువంటి ఆస్తులు దొరకలేదని ఎసిబి ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు.

ఉయ్యూరులో తెలుగు తమ్ముళ్ల తగాదా

ఉగాది ఫ్లెక్సీల వివాదం

ప్రజాశక్తి-పెనమలూరు(కృష్ణా) :

జిల్లాలోని పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరులో తెలుగు తమ్ముళ్ల తగాదా పడ్డారు. ఉగాది ఫ్లెక్సీ ఏర్పాటు కోసం టిడిపిలోని రెండు వర్గాలు సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకున్నాయి. వారంతా ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ అనుచరులు కావటం గమనార్హం. ఉయ్యూరు ప్రధాన సెంటర్‌లోని ప్రకాశ్ యాడ్స్ బోర్డ్‌పై కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్సీ వైవిబి కి శుభాకాంక్షలు చెపుతూ రాజులపాటి ఫణికుమార్ నేతత్వంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇదే బ్యానర్‌పై తెలుగు యువత మండల అధ్యక్షుడు దండమూడి చౌదరి ఉగాది శుభాకాంక్షలు ఫ్లెక్సీ ఏర్పాటుకు ప్రయత్నించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఫణియూత్ అక్కడకు చేరుకొని చౌదరి ఫ్లెక్సీని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాలు బాహాబాహి దిగాయి. చొక్కాలు పట్టుకొని సవాళ్లు, ప్రతిసవాళ్లు చేసుకున్నారు. ఇరువర్గాల వారు భారీగా చేరుకోవటంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సమాచారం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు అక్కడకి వెళ్ళటంతో గమనించిన ఆ నేతలు ఎవరికి వారే అక్కడనుండి జారుకున్నారు.

ఏ పార్టీ పిలిస్తే ఆ పార్టీకి పనిచేస్తా

ప్రముఖ నిర్మాత, సీనియర్ నటుడు కాదంబరి కిరణ్

ప్రజాశక్తి-విజయనగరం :

వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ పిలిస్తే ఆ పార్టీకి కార్యకర్తగా పనిచేస్తానని ప్రముఖ నిర్మాత, సీనియర్ నటుడు కాదంబరి కిరణ్ అన్నారు. శనివారం విజయనగరం వచ్చిన ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఆంధ్రాకు ప్రత్యేక హోదా ఇవాల్సిందేనని స్పష్టం చేశారు. హోదా కోసం జరిగే పోరాటాల్లో పాల్గొంటానని పేర్కొన్నారు. పేదలు సంక్షేమం కోసం పనిచేసే పార్టీలకే మనుగడ ఉంటుందన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిలిస్తే ఆ పార్టీలో క్రియాశీలకంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికలో తమిళనాడు ముఖచిత్రం మారబోతుందన్నారు. అది కమల్‌హాసన్, రజనీకాంత్ వల్లే సాధ్యమన్నారు. వారిద్దరు కలిసి పనిచేస్తే తిరుగుండదని అభిప్రాయపడ్డారు. సినిమా రంగంలో అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలని, అందరూ చెడ్డవారు కాదని, ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అంతకుముందు ఆయనను రోటరీ క్లబ్ సభ్యులు సన్మానించారు.

ప్రత్యేకం

రిటైర్డ్ ఉద్యోగులకు బయోకష్టాలు..!

చేతికందని పెన్షన్
ఇబ్బందుల్లో వృద్ధులు



ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

రిటైర్డ్ ఉద్యోగులకు 'ఆధారం' అందడం లేదు. పెన్షన్‌కు ఆధార్ లింకుపెట్టడం, బయోమెట్రిక్ అమలు చేయడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు బయోమెట్రిక్ ద్వారా ఇబ్బందులొచ్చి పడుతున్నాయి. వేలిముద్రలు పడకపోవడంతో పెన్షన్ అందడం లేదు. వేళ్లు అరిగిపోవడంతో ఆధార్‌కు లింక్ కావడం లేదు. బయోమెట్రిక్‌లో దీంతో పెన్షన్ నిలిచిపోతోంది. ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలివ్వక పోవడంతో ట్రెజరీ అధికారులు పెన్షన్ ఇవ్వడానికి ఇబ్బందులు పెడుతున్నారని పెన్షన్ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆధార్ సర్వ సమస్యలకు కారణమవుతోంది. ప్రతి దానికీ ఆధార్ లింక్ చేస్తున్నారు. ఓవైపు అత్యున్నత న్యాయస్థానం అన్నింటికీ ఆధార్ అవసరం లేదని చెబుతున్నా కింద స్థాయిలో ఆధార్ లేకపోతే ఏ పనీ కావడం లేదు. ప్రతేడాది తాను జీవించి ఉన్నానని తెలిపే లైఫ్ సర్టిఫికెట్ ట్రెజరీల్లో అందజేయాల్సి ఉంది. జిల్లాలో సుమారు 40 వేల మంది వరకు పెన్షన్‌దారులున్నారు. ప్రతినెలా సుమారు రూ.70 కోట్ల వరకు పెన్షన్ చెల్లిస్తారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఆధార్ అనుసంధానం ప్రక్రియ ద్వారా వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. 65 సంవత్సరాలు దాటిన తర్వాత కొందరికి వేళ్లు అరిగిపోతాయి. వేలి ముద్రలు చెదిరిపోతాయి. ఇప్పుడు ఇదే రిటైర్డ్ ఉద్యోగులకు శాపంగా మారింది. కొడవలూరు మండలం దామేగుంటకు చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు పి. రంగయ్య జీతం కోసం కోవూరు ట్రెజరీ ఆఫీసు వెళితే ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ వయస్సుల్లో వేలిముద్రలను వెతుకుంటూ మీ-సేవ, ఆధార్ సెంటర్లు చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇదే ఒక్క రంగయ్య పరిస్థితే కాదు. అనేక మంది రిటైర్డ్ ఉద్యోగులు వేలిముద్రలు పడక, జీతాలందక నానా ఇబ్బందులు పడుతున్నారు. చివరి మజిలిలో పెన్షన్‌పై ఆధారపడి జీవిస్తున్న వీరిని ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది. జిల్లాలో అనేక మంది ఇలాంటి సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం వితంతువులు, వికలాంగులు, వృద్ధులకు ఇస్తున్న పింఛన్లలో ఇలాంటి సమస్యలే ఉన్నాయి. ప్రభుత్వం వృద్ధుల విషయంలో ప్రత్యేక జిఒ తీసుకురావాల్సి ఉంది. లేదంటే పెన్షన్ అందక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

వేలిముద్రలు పడడం లేదు
రిటైర్డ్ హెచ్‌ఎం పి. రంగయ్య, దామేగుంట

నేను రిటైర్డ్ హెచ్ ఎం పెన్షన్ కోసం వెళితే బయోమెట్రిక్ అడిగారు. ఆధార్‌తో బయోమెట్రిక్ అనుసంధానం కావడంలేదు.వయస్సు పెరగడంతో వేలిముద్రలు చెదిరిపోయాయి. ఇప్పుడు బయోమెట్రిక్ పడడం లేదు. ట్రెజరీకి వెళితే మాకు రూల్స్ అలా ఉన్నాయని చెబుతున్నారు. ఏం చేయాలో తెలియడం లేదు. ప్రభుత్వం ఈ విధానాన్ని సరిచేయాల్సి ఉంది. వృద్ధులను ఈ వయస్సులో ఇబ్బందులు పెట్టడం సరికాదు.

సంక్షిప్తం

1045 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-టంగుటూరు (ప్రకాశం)

రూ.7.85లక్షల విలువ గల 1045 బస్తాల రేషన్ బియ్యాన్ని స్థానిక టోల్‌ప్లాజా వద్ద ప్రకాశం జిల్లా విజిలెన్స్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సిఐ వి.భూషణం తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి విజిలెన్స్ పోలీసులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. రీజనల్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి టి.శంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు రంగంలోకి దిగారు. ఈపురుపాలెం శ్రీలక్ష్మీ రైస్ మిల్లు నుండి అక్రమగా రేషన్ బియ్యం క్రిష్ణపట్నం పోర్టుకు తరలుతున్నట్లు గుర్తించారు. టోల్‌ప్లాజా వద్ద కాపుగాసి పోలీసులు ఆ లారీని ఆపారు. అందులో 261 క్వింటాళ్ళ (1045 టిక్కీలు) బియ్యం ఉన్నాయి. వీటి విలువ రూ.7.80లక్షలు ఉంటుంది. వాటిని స్వాధీనం చేసుకున్నారు. లారీని స్థానిక ఎమ్మెల్సీ పాయింట్‌కు తరలించారు. అనంతరం శ్రీలక్ష్మీ రైస్‌మిల్లుపై దాడి చేశారు. రైస్‌మిల్లును సీజ్ చేశారు.

అదుపుతప్పి లారీ బోల్తా

90 గొర్రెలు మృతి

ప్రజాశక్తి-భీమడోలు

లారీ అదుపుతప్పి బోల్తాపడటంతో 90 గొర్రెలు మృతి చెందిన సంఘటన పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు మండలం కురెళ్లగూడెం వద్ద జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కడపకు చెందిన డి.నరసింహారెడ్డి సంతల్లో గొర్రెలను విక్రయిస్తుంటారు. హైదరాబాదులో 200 గొర్రెలను కొనుగోలు చేసి వాటిని సంతల్లో విక్రయించేందుకు లారీలో అమలాపురం తరలిస్తున్నారు. లారీ కురెళ్లగూడెం వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 90 గొర్రెలు మతి చెందాయి. లారీ క్యాబిన్‌లో ఉన్న ఆరుగురు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం

వికారికి స్వాగతం

'ఉగాది యన్న బిన్నపెద్ద లున్నలేనివారికిన్/ మొగాల సంబరంబు నింపి నూత్నసోభనిచ్చియా/ యుగాని కాదినుండి వచ్చు నుత్తమాత్మబంధువై/ దిగంతకీర్తికేతనంబు తెల్గునాట నిల్పుతన్' అని ఓ కవి చెప్పినట్లుగా... వసంత కాలాన విరబూసే చైత్ర మాస సోయగం మనసుని పలకరించే మలయ మారుతం, తెలుగింటి లోగిళ్ళలో తొలకరి జల్లు, కష్టసుఖాలు.. ఆత్మీయానురాగాలు కలగలిపిన మాధుర్యం, షడ్రుచుల సుగంధ సౌందర్య సమ్మేళనం, సంస్కృతి సాంప్రదాయాల సంగమం, ఆమని సొగసుల హరిత వర్ణ శోభితం, వసంత వేళ వచ్చే మావి చిగుళ్లను పసందుగా భుజించి కూజితములు పలికే మత్త కోయిలల సంగీతాలాపనం, మామిడి పిందెలు, వేపపువ్వు, చెరుకుబెల్లం, కొత్త చింతపండు, ఉప్పు, కారం కలిపి చేసిన పచ్చడి సేవనం... ఉగాది. 'కుహూ కుహూ తేనెలతో/ బహుపుల్లని పులుపులతో/ కటికి ఒగరు మావి గలిపి/ కటువు మీర ఘాటు నింపి/ వేపపూత చేదు కూర్చి/ పూపపాటి ఉప్పు జేర్చి/ ఆరు రుచుల ఊరుబిండి/ ఊరించెనె విళంబి' అని ఓ కవి రసరమ్యంగా పద్యాన్ని చెబుతాడు. విళంబి నామ సంవత్సరం విజయ పరంపరతో ప్రారంభం... ఆరు రుచులతో ఆరంభం. అందరి మనసుల్లో నింపుతుంది తరగని సంతోషం. ఇది జీవితానికి సంకేతం. వీటిని సేవించడం అంటే జీవితంలోని కష్టసుఖాలను సమంగా స్వీకరించే నిబ్బరం మనిషికి వుండాలని చెప్పటం. 'ఇది యుగాని చిగిర్చిన ఇగురుమోవి/ తళుకుగెంపుల సూనస్మితముల దరులు/ ప్రకృతి వదనమ్ములోని శోభల ఘటించు/ సిగ్ధమాదమ్ము మానవ చేతములకు' అని ఉగాది పండుగ రోజుల్లో కొన్ని చెట్లు చిగిరించడం ప్రకృతి మోమున శోభలు వెల్లివిరియడంగా ప్రస్తావిస్తూ, ఇవి మనుషులకు సంతోషాన్నిచ్చేవిగా ఉంటాయి అంటాడు ఓ పద్యకవి.

ఉత్తరాయణం ప్రారంభమయ్యే తొలి రోజున జరుపుకునే పర్వదినం... క్రమంగా ఉగాదిగా మారిందని చరిత్రకారులు చెబుతారు. తెలుగువారి పండుగలలో మొట్టమొదటిది ఉగాది. తెలుగువారు చాంద్రమానం పాటిస్తారు గనుక ఛైత్రశుక్ల పాఢ్యమినాడు ఈ ఉగాది తెలుగు వారి కొత్త సంవత్సరంగా మొదలవుతుంది. యుగాది అంటే ఒక యుగ కాలానికి మొదలు అన్నమాట. వసంత రుతువులో వచ్చే పండుగ ఉగాది. వసంత రుతువును ఆహ్వానిస్తూ వచ్చే పండుగలు తెలుగు వారికే కాదు అన్ని సమాజాల్లోనూ ఉన్నాయి. ప్రపంచ మంతటా ఉన్నాయి.

సాధారణంగా కవిత్వంలో ఉగాది పచ్చడిని వర్ణిస్తూ చేదు, తీపి, పులుపుల కలయికలను, రుతువులను చెప్పడం జరుగుతుంది. కానీ తెలుగు వారి జీవితాల్లో మాత్రం ఇప్పుడు తీపి లేదు చేదు మాత్రమే కనిపిస్తోంది. 'ఎలాగుంది ఉగాది పచ్చడి అని అంటారా/ ఓ భేషుగ్గా ఉంది/ పత్రిక పొట్లంలోని పాత సాహిత్యం కన్నా బాగానే ఉంది/ కొంచెం తియ్యగా ఉంది/ చాలా చేదుగా ఉంది/ మొత్తం మీద మన జీవితాల్లాగా ఉంది' అని శ్రీశ్రీ పేర్కొన్నట్లు కేంద్ర రాష్ట్రాల్లోని మన ప్రభుత్వాలు ప్రజల జీవితాలను చేదుతో నింపేశాయి. కేంద్రప్రభుత్వం నోట్లరద్దు, జిఎస్టీ పేరుతో కొట్టిన దెబ్బ పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా తగిలింది. దేశ ప్రజల్లో అసంతృప్తి హాలాహలపు మేఘాలై పరుగులెడుతున్నాయి. విభజన హామీలు నెరవేరక, హోదా కోసం ఆంధ్రుల పోరాటం రాజకీయ వ్యూహప్రతివ్యూహాల మధ్య కొత్త పుంతలు తొక్కుతోంది. రుణమాఫీ హామీ నెరవేరక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదులకు బానిసలైన ఈ ప్రభుత్వాలు ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నాయి. పుట్టెడు సమస్యలతో ప్రజలు విళంబికి స్వాగతం పలుకుతున్నారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి ... 'నా కుగాదులు లేవు/ నా కుషస్సులు లేవు/ నేను హేమంత కష్టానంత శర్వరిని/ నాకు కాల మ్మొక్క/టే కారు రూపు, నా / శోకమ్మువలెనె, నా/ బ్రతుకువలె' అంటాడు. మరో పద్యకవి ఉల్లి రామసుబ్బయ్య మాత్రం... 'ప్రకృతి కినుక జూప ప్రభుతయు మోసంపు/ పుట్టగాగ క్రుంగిపోయె రైతు/ రమ్ము వాని నాదు కొమ్ము చిరాన ఈ/ ఆత్మహత్యలెల్ల నాగిపోవ' అంటూ... ప్రకృతి, ప్రభుత్వం రెండూ రైతుల్ని మోసం చేసే పుట్టలు అవగా, రైతులు కంగిపోయారనీ, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారనీ వీటన్నింటినీ బాగుచేయడానికి, సరిదిద్దడానికి నువ్వైనా రమ్మని ఉగాదిని ఆహ్వానిస్తాడు.

స్వార్థం, సంకుచితత్వం, వంచన, అవినీతి వంటి రుగ్మతలతో నవ్యాంధ్రను పాలకులు పట్టి పీడిస్తున్న ఈ సమయంలో... కోటి ఆశలను మోసుకొని వస్తోన్న ఈ ఉగాది ప్రజల జీవితాల్లో నూతనాధ్యాయం ప్రారంభించాలి. 'తెలుగువాడి తెలుగు 'వాడి'/ దీపించాలి/ తెలుగునాట తెలుగుపాట/ వ్యాపించాలి/ తమ గమ్యం/ చేరాలంతే/ ఈ ఉగాది వేళ నేను కోరేదింతే' అంటూ ఉగాది పండుగపై సామాన్యుడి ఆశలకు అద్దం పడతాడు శ్రీశ్రీ. అంతేకాదు... 'ఎన్ని ఉగాదులు రాలేదు ఇం/ కెన్ని ఉగాదులు పోలేదు/ ఎక్కడి దొంగలు అక్కడే/ ఎక్కడి గొంగళి అక్కడే' అంటూ కపట రాజకీయాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూనే... 'ఈ ఉగాది మహోదయ వేళ/ ఈ వసంత నవోదయ వేళ/ విప్లవ శంఖం పూరించుదాం/ విజయ దుందుభి మ్రోగించుదాం' అని చెప్పినట్టుగా... మన గుండెల్లో ఆనంద క్షణాలను నింపే నవోదయం కోసం విళంబికి స్వాగతం పలుకుదాం.

ఇది విషయం




మోసాలూ ద్రోహాలూ
కమలానికి కూసు విద్య...
దేశ ప్రజల కోసం
మోడీ చేసింది మిథ్య!

ఓటు వేసినందుకేనా
రాష్ట్రానికి దొంగ దెబ్బ...
చీల్చకుందురా జనం
హస్తిన కీచకుల జబ్బ!

- కొల్లూరు వెంకట్

ప్రత్యేక హోదా ప్రకంపనాల్లో దేశం

విశ్లేషణ



తెలకపల్లి రవి

తెలుగు సంవత్సరాది సందర్భంలో ఇక్కడి ప్రజా పోరాటం అఖిల భారత స్థాయిలో వేడి పెంచడం ఆసక్తికరమైన పరిణామం. ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక హోదా నిరాకరణ జాతీయ స్థాయిలో రాజకీయ మధనం మరింత తీవ్రం కావడానికి దారి తీసింది. మోడీ ప్రభుత్వ వినాశక విధానాలు, విశ్వసనీయతా లోపంతోనూ కోరితెచ్చుకున్న ప్రతికూలత ఇది. ఎన్‌డిఎ ప్రభుత్వంలో రెండవ పెద్ద భాగస్వామిగా వుండి – ఎపి పాలనలో మొదటిసారి బిజెపికి చోటు కల్పించిన తెలుగుదేశం ఈ అవిశ్వాస తీర్మాన పర్వంలో ప్రవేశించడం మరో మలుపు. ఇటీవల కేంద్రం దగ్గర తెలుగుదేశం కన్నా ఎక్కువ పరపతి పొందారని చెప్పబడుతున్న వైఎస్‌ఆర్‌సిపి ఇంకా ముందే అవిశ్వాసం ఇచ్చింది. జాతీయంగా బిజెపిని రాజకీయంగా వ్యతిరేకించేవారు టిడిపి నిష్క్రమణకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. అయితే జాతీయ మీడియా మొత్తం టిడిపి కేవలం రాజకీయ అనివార్యత కారణంగానే అవిశ్వాసం తెస్తున్నట్టు వ్యాఖ్యానించింది. సమాజ్‌వాది, తృణమూల్, వామపక్షాలు, బిఎస్‌పి, ఎన్‌సిపి లాంటి పార్టీలు కూడా మద్దతు నిస్తున్నాయి గనక కేవలం ప్రత్యేక హోదాకు సంబంధించిన పరిమిత చర్చగా గాక మోడీ సర్కారును ఎండగట్టే మహాభిశంసనగా రూపొందే అవకాశముంది.


జాతీయ నేపథ్యం, అవిశ్వాసం

బిజెపి వరుసగా ఉప ఎన్నికల పరాజయాలు ఎదుర్కొంటున్న నేపథ్యం అవిశ్వాసాన్ని మరింత నాటకీయం చేసింది. 80 లోక్‌సభ స్థానాల్లో 73 బిజెపికి ఇవ్వడమే గాక ఏడాది కిందట అనూహ్యమైన సంఖ్యాబలంతో యోగి ఆదిత్యనాథ్‌ను అధికారంలోకి తెచ్చిన ఉత్తర ప్రదేశ్‌లోనే రెండు స్థానాలు కోల్పోవడం, అవి ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి స్థానాలు కావడం బిజెపికి పెద్ద పరాభవమే. యుపిలో ఎస్‌పి, బిఎస్‌పిలు కలిశాయనుకుంటే... జెడియు, బిజెపి కలిసి వున్న బీహార్‌లోనూ ఓటమి తప్పలేదు. జైలు శిక్ష అనుభవిస్తున్న లాలూ యాదవ్ ఆర్జేడీ వంటరిగా లోక్‌సభ శాసనసభ ఉప ఎన్నికల విజయం సాధించింది. ఎంపిలోనూ రాజస్థాన్‌లోనూ కాంగ్రెస్ అలాగే వరుస విజయాలు నమోదు చేసింది. ఈశాన్యాన విచ్ఛిన్నకర శక్తులతో చేతులు కలిపి త్రిపురలోనూ బలం లేకున్నా గద్దెక్కి నాగా మిజోరాం లోనూ ప్రభుత్వాలలోకి వచ్చిన బిజెపి దేశమంతటా జైత్రయాత్ర చేస్తుందని గొప్పలు చెప్పుకుంటుండగానే ఉత్తరాది ఉప ఫలితాలు ఎదురుకొట్టడం 2014 ఎన్నికల తీర్పు పునరావృతంపై చీకట్లు పరచింది. పైగా ఉప ఎన్నికల్లో పది స్థానాలు కోల్పోయిన బిజెపి బలం ఈ సభలోనే బొటాబొటి మెజార్టీ 272కు క్షీణించింది. ఇక ఒక్కటి తగ్గినా మిత్రులపై ఆధారపడ వలసిందే. ఇలాంటి సమయంలో శివసేన అలుక బూనడం, ఇప్పుడు టిడిపి నిష్క్రమించడం పెద్ద కుదుపులే. చిన్న చిన్న పార్టీలు కొనసాగుతున్నాయి గనక, అస్తవ్యస్తపు అన్నా డిఎంకె అనివార్యంగా బలపరుస్తుంది గనక మోడీ మనుగడకు ఇప్పటికి ప్రమాదం రాకపోవచ్చు గాని బలహీన పడటం అనివార్యం. 300 స్థానాలకు అటూ ఇటూ తెచ్చుకుని బతికి బట్టకడతారని అంచనాలు వేస్తున్నా. అసలు అవిశ్వాసం అనుమతిస్తారా లేక అల్లరిని సాకుగా చూపి చర్చకు తీసుకోకుండా నెట్టేస్తారా సందేహంగానే వుంది. శుక్రవారం నాడే వంద మందికి పైగా సభ్యులు అవిశ్వాసానికి మద్దతు చెప్పినా సభ సజావుగా లేదనే సాకుతో స్పీకర్ పరిగణనలోకి తీసుకోలేదు. ఇక్కడ సాంకేతికత కన్నా రాజకీయ వ్యూహమే ముఖ్యం. చర్చ జరిగితే ప్రత్యేక హోదాతో పాటు ఇతర విమర్శలూ రావడం బిజెపికి ఇరకాటంగా వుంటుంది. రాజకీయంగా ఎదురు దాడి చేసి తీర్మానాన్ని ఓడించి పరువు నిలబెట్టుకోవాలనుకుంటే అదో విధంగా వుంటుంది. చర్చ చేయాలనుకుంటే సభ గడువు పొడగించవచ్చు. అయితే ఇప్పటి వరకూ సంకేతాలు ఎక్కువగా అవిశ్వాసం రాకుండా పోయే అవకాశాన్ని సూచిస్తున్నాయి. బిజెపి కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయం తెస్తామని ప్రకటించి ప్రత్యేక హోదాను కూడా బలపర్చిన టిఆర్‌ఎస్ అవిశ్వాసంపై స్పష్టత ఇవ్వలేదు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కూడా ప్రత్యేక హోదా నినాదం ముందుకు తేవడంలోనూ వారి హస్తం వుంది. వీరంతా కేకలు వేస్తుంటే స్పీకర్ వాతావరణం అనుకూలంగా లేదని అనుమతించకపోవచ్చు. ఒక సమావేశంలో ఇచ్చిన అవిశ్వాసం నోటీసు అప్పుడు చర్చకు రాకుంటే మురిగిపోయినట్టే.

విజయమా? వైఫల్యమా?

సంక్షోభాలను కూడా అవకాశాలుగా మార్చుకోవడం గురించి చంద్రబాబు ఎప్పుడూ చెబుతుంటారు. బిజెపిని నమ్మి రాష్ట్రానికి నష్టం తెచ్చిపెట్టిన వైఫల్యాన్ని వ్యూహాత్మక విజయంగా చూపించేందుకు ఆయన అవిశ్వాసం తెచ్చారు. ప్రజలు ప్రత్యేక హోదాపై పట్టుదలగా వున్నారని తెలిశాకే ప్యాకేజీ పల్లవి ఆపేశారు. ఇప్పుడు ఆయన పలుకుబడి కొత్త కూటమి గురించి అప్పుడే అనుకూల వర్గాలు ఆకాశానికెత్తి చెబుతున్నాయి. వాస్తవం ఏమంటే గతంలో వామపక్ష దిగ్గజం హరికిషన్ సింగ్ సూర్జిత్ వంటి వారి ఆశీర్వాదాలు వున్నప్పుడే ఆయన లౌకిక శిబిరంలో ముఖ్య పాత్ర వహించగలిగారు. బిజెపితో కలిసినప్పుడు అంతటి గౌరవం పొందింది లేదు. గుజరాత్ మత మారణహోమంపై మోడీ ముఖ్యమంత్రిగా వైదొలగాలని అప్పటి ప్రధాని వాజ్‌పేయి అనడంతో చంద్రబాబు కూడా అన్నారు. అద్వానీ–మోడీ శిబిరం ఆధిక్యత సాధించాక వాజ్‌పేయి–చంద్రబాబు కూడా గప్‌చిప్‌గానే వుండిపోయారు. కాబట్టి మోడీ ఎపికి హోదా నిరాకరించడానికి అదే కారణమన్నట్టు, వ్యతిరేకించే యోధుడు చంద్రబాబే నన్నట్టు చిత్రించడం చారిత్రిక వాస్తవాలకు విరుద్ధం. ఇక జగన్ ప్రత్యేక హోదా ఇచ్చేవారికి మద్దతునిస్తాం అని చెప్పడం తప్ప విధానపరంగా మతతత్వంపై ఎన్నడూ గట్టిగా మాట్లాడింది లేదు. టిడిపి దూరమైతే వైసీపీ మాతో వస్తుందని బిజెపి నేతలు బాహాటంగానే చెబుతూనే వున్నారు. తెలుగుదేశం ప్రచారం అలా వుంచితే వైసీపీ నాయకులు కేంద్ర నాయకులను ఎందుకు ఎన్నిసార్లు కలుస్తున్నారో బయిటకు రాదు. అవిశ్వాసం తీసుకురావాలన్న సూచన మొదట చేసింది జనసేన అధినేత పవన్ కళ్యాణ్. జగన్, పవన్ ఇద్దరూ బిజెపి చేతిలో వున్నారని చంద్రబాబు దాడి చేస్తుంటారు. మరి తానెందుకు మొన్నటి వరకూ వున్నారో చెప్పరు. తను ఎర్ర తివాచీ పరచి ఆహ్వానించిన పవన్ తన కుమారుడిపై ఆరోపణలు చేయగానే కుట్ర అంటారు. తాను మోడీపై పోరాడుతున్నాను గనక అందరూ తనను నిలబెట్టేందుకు సహకరించాలి తప్ప నిలదీయకూడదని నీతులు చెబుతారు. జగన్‌పై కేసులు వీగిపోవడం గురించి చంద్రబాబు ప్రస్తావిస్తుంటే తమ కేంద్ర నేత కొన్ని నిర్దిష్టమైన ఆధారాలు చూపించినందునే టిడిపి అభద్రతకు గురైందని బిజెపి నేతలు అంటున్నారు. టిడిపి నిష్క్రమణ వల్ల తామేదో బలపడిపోతున్నట్టు చూపించుకోవడం కోసం హడావుడిగా ఎపి నాయకులను ఓడిపోయిన యుపి నాయకులతో పాటు ఢిల్లీ రప్పించారు. తెలంగాణలో తమ వారిని టిఆర్‌ఎస్ పట్ల మెతగ్గా వెళ్లవలసిందిగా అధిష్టానం ఆదేశాలు పంపింది.





2014లో వలె కేవలం మోడీ చుట్టూ తిరిగే పరిస్థితి వుండదని మాత్రం ఇప్పటికే తేలిపోయింది. అవిశ్వాసం దాన్ని మరింత స్పష్టపరుస్తుంది. మనుగడ కోసం బిజెపిని నమ్మిన ప్రాంతీయ పార్టీల దురవస్థనూ మరికొందరు ప్రాంతీయ నేతల పగటి కలల పర్యవసానాలను కూడా తేటతెల్లం చేస్తుంది.

కెసిఆర్ చెప్పే కూటమి పరోక్షంగా బిజెపికి మేలు చేస్తుందని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. ఏతావాతా మహా రాజకీయమేదో జరుగుతున్న మాట నిజం. ఇందులో అనేక వైరుధ్యాలు పని చేస్తున్నాయి. అవిశ్వాస పర్వం తర్వాత అవి ఊపందుకుంటాయి.

కాంగ్రెస్ కదలికలు, ప్రాంతీయ పార్టీలు

ఈ పూర్వ రంగంలో రాహుల్‌గాంధీ అధ్యక్షతన మొదటి ఎఐసిసి సమావేశాలు ఆ పార్టీ వ్యూహాలకు పదును పెట్టుకునే ప్రయత్నాలు చెబుతున్నారు గాని గజిబిజి కొనసాగుతూనే వుంది. బిజెపి విద్వేషంతో విడగొడుతుంది. మేము సద్భావంతో కలుపుతామని రాహుల్ అధ్యక్షోపన్యాసంలో చెప్పారు. అంతకు ముందు ఇండియా టుడే సదస్సులో సోనియా గాంధీ తమ పార్టీ ముస్లిములకు అనుకూలమనే భావన తొలగించడానికే రాహుల్ ఎక్కువగా గుళ్లూ గోపురాలు తిరుగుతుండొచ్చని జవాబివ్వడం ఆశ్చర్యం కలిగించింది. ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ధరావత్తులు పోగొట్టుకోవడం, బీహార్‌లోనూ ప్రభావం లేకపోవడం, ఈశాన్యంలో దాదాపు ఉనికిని కోల్పోవడం, కాంగ్రెస్ పరిమితులు చెబుతున్నాయి. ఈ ఏడాది జరిగే కర్ణాటక ఎన్నికలు, 2019 ప్రారంభంలో గాని కాస్త ముందుగా గాని జరిగే ఎంపి, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ ఎన్నికలు కాంగ్రెస్ నిజమైన అస్తిత్వాన్ని నిర్ణయిస్తాయి. 2019 లోక్‌సభ ఎన్నికలు ఆ పార్టీకి, దేశానికి కూడా అసలైన పరీక్ష అవుతాయి. అవి 2014లో వలె కేవలం మోడీ చుట్టూ తిరిగే పరిస్థితి వుండదని మాత్రం ఇప్పటికే తేలిపోయింది. అవిశ్వాసం దాన్ని మరింత స్పష్టపరుస్తుంది. మనుగడ కోసం బిజెపిని నమ్మిన ప్రాంతీయ పార్టీల దురవస్థనూ మరికొందరు ప్రాంతీయ నేతల పగటి కలల పర్యవసానాలను కూడా తేటతెల్లం చేస్తుంది.

1979లో జనతా హయాంలో గాని, 1990లో విపిసింగ్ కూల్చివేత గాని, 1998లో వాజ్‌పేయి ప్రభుత్వ పతనంలో గాని అవిశ్వాసాలు జాతీయ ప్రాంతీయ పార్టీల అనూహ్య ఎత్తుగడల ఫలితంగానే జరిగాయి. ప్రత్యేక హోదా నిరాకరణ విభజన హామీల అమలుపైనే చర్చ కేంద్రీకరించాలని పార్టీలు తమలో తాము దూషించుకుంటూ బిజెపి పబ్బం గడుపుకొనే అవకాశం ఇవ్వకూడదని మాత్రం తెలుగు ప్రజలు కోరుకుంటారు. అది అర్థమైంది గనకే రాహుల్ గాంధీ ప్రత్యేక హోదాకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. అవిశ్వాసాన్నీ బలపరుస్తున్నారు. మోడీ ప్రభుత్వం కూలకపోయినా రాజకీయ నాటకీయతలు ఈసారి ఏం వస్తాయో వేచి చూడాలి.

సమాచారం

ఎవరు?

✦ గాంధీని చంపిన వాడి తరపు లాయర్ ఎవరో తెలుసా ?
రామ్ జర్మలాని (బిజెపి నాయకుడు)

✦ రాజీవ్ గాంధీని చంపిన వాళ్ళ తరపున లాయర్ ఎవరో తెలుసా ?
రామ్ జెర్మలాని

✦ రేప్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆశారాం బాబా లాయర్ ఎవరో తెలుసా ?
బిజెపి ఎంపి సుబ్రమణ్య స్వామి



✦ వోడా ఫోన్ టాక్స్ స్కాం కేసులో వోడా ఫోన్ సంస్థ తరపున లాయర్ ఎవరో తెలుసా?
కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

✦ గుజరాత్ రూ.500 కోట్ల బ్యాంకు స్కాం అపరాధి లాయర్ ఎవరో తెలుసా ?
కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

✦ భోపాల్ గ్యాస్ దుర్ఘటనలో 25 వేల మంది మరణానికి, లక్షలాది మంది క్షతగాత్రులు కావటానికి కారణం అయిన అండర్సన్ తరపు న్యాయవాది ఎవరో తెలుసా ?
కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

✦ క్రీడల కుంభ కోణం చేసిన లలిత్ మోడీ లాయర్ ఎవరో తెలుసా ?
కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ భర్త, కుమార్తె

✦ సహారా స్కామ్ సుబ్రతా రాయ్ లాయర్ ఎవరో తెలుసా ?
బిజెపి మంత్రి రవి శంకర్ ప్రసాద్

జన వాక్యం

జీవో నెం 27 రద్దు కోరుతున్నాం

వైద్య ఆరోగ్య శాఖలో 2001 నుంచి నేటికి అంటే 17 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో డాక్టర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్ట్‌లు, స్టాఫ్ నర్సులు పని చేస్తున్నారు. వీరందరూ శాశ్వత స్వభావం కలిగిన స్థానాల్లో టైమ్ స్కేల్ ప్రకారం బేసిక్ పే డిఎ, హెచ్‌ఆర్‌ఎతో వంద శాతం గ్రాస్ శాలరీ పొందుతున్నారు. వీరికి 1999, 2005, 2010 పిఆర్‌సి ప్రకారం జీతాలు చెల్లిస్తున్నారు. అయితే వీటన్నింటికీ భిన్నంగా జీవో నెం 27 ప్రకారం జీతంలో బేసిక్ పే డిఎ, హెచ్‌ఆర్‌ఎ తొలగిస్తూ 'ముద్దజీతం' ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వం పేర్కొంది. దీంతో ఇది వరకు ప్రభుత్వాలు ఇచ్చిన ఆనవాయితీని, హక్కును ఈ ప్రభుత్వం కాలరాసింది. అధికారంలోకి రాక ముందు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, ఇది ఉద్యోగుల ప్రభుత్వమని మాటలు చెప్పిన ప్రభుత్వం చేసిన హామీని నెరవేర్చకపోగా, వున్న ఉద్యోగుల సంక్షేమానికి కోత పెట్టే పనులు చేస్తోంది. ఈ రంగంలో వున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు పదవ పిఆర్‌సి అమలు చేయడానికి మీనమేషాలు లెక్కిస్తోంది. పైగా పదిహేడేళ్ల అనుభవం వున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడానికి కూడా ఆలోచిస్తోంది. వంద శాతం గ్రాస్ శాలరీ పొందే హక్కును సైతం తొలగిస్తోంది. ఈ విషయమై ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించాలి. ఉద్యోగుల సంక్షేమం గురించి ఆలోచించాలి. లేనిచో డాక్టర్ల నుంచి పారామెడికల్ సిబ్బంది వరకు తమ హక్కుల సాధన కోసం పోరాడక తప్పదు.

ఎన్ సత్యారావు, డి పద్మావతి, ఎం వేణు,
కాంట్రాక్టు ఉద్యోగుల జెఎసి.

అన్నదాతకు జేజేలు

మీ కాళ్లకు బొబ్బలు వచ్చి రక్తం కారుతోందని బాధ పడకండి. మీరు చిందించిన రక్తం అనేక మందికి స్ఫూర్తిని ఇచ్చింది. ఇస్తూనే ఉంటుంది. ఈ దేశానికి రైతే వెన్నెముక అని చాటి చెప్పిన మిమ్మల్ని కొంతమంది మూర్ఖులు హేళన చేసి మాట్లాడారు. కానీ మీరు ఎత్తిన పిడికెళ్లను చూసి నివ్వెర పోయిన ఈ నాయకులు కిందికి దిగి రాక తప్పలేదు. విజయం సాధించిన రైతులారా! మీకు లాల్ సలాం.

- దినేష్, ఈమెయిల్ ద్వారా.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

సందర్భం

ఆదర్శ కమ్యూనిస్టు మానికొండ సుబ్బారావు

యు రామకృష్ణ

సాధారణ విజ్ఞానం కలిగి, సాధారణ స్థానాల్లోనే వుండి బాధ్యత వహించి పని చేసిన విప్లవకారుడు మానికొండ సుబ్బారావు. ఆయన 1918లో కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా నందమూరులో జన్మించారు. బాల్యంలోనే తండ్రిని కోల్పోయారు. తల్లి బుల్లెమ్మ కొద్దిపాటి చదువు సంధ్యలే వున్నా పెద్ద సంస్కారవతి. మానికొండ చదువులో ఆలస్యంగా ప్రవేశించాడు. బందరు హిందూ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులయ్యాక బిఎస్‌సి కోర్సులో ప్రవేశించాడు. ఒకటి రెండేళ్లు చదివి అక్కడ జరిగే అన్యాయాలకు, అక్రమాలకు వ్యతిరేకంగా చదువుకు స్వస్తి చెప్పి స్వగ్రామం చేరాడు.

మానికొండకు 19వ ఏట వివాహం అయ్యింది. అంత చిన్న వయసులోనూ వివాహ సందర్భంగా మానికొండ నూతన ప్రమాణాలు నెలకొల్పారు. కట్నం మీద పెద్దలు మక్కువ చూపగా, 'నేను చేసుకునేది పిల్లనా, డబ్బునా?' అంటూ తన ఇష్ట ప్రకారమే కట్న కానుకలు లేకుండా సూర్యావతిని వివాహం చేసుకున్నారు. 1938–39లో నాటి కమ్యూనిస్టు ప్రముఖుడు అన్నాప్రగడ కామేశ్వరరావు గుంటూరు జిల్లా మంతెనవారిపాలెంలో 'విద్యా వనం' అనే ఆదర్శ పాఠశాల ప్రారంభించారు. తుమ్మల వెంకట సుబ్బయ్య మొదలైన మిత్రులతో కలిసి సేవాదృష్టితో మానికొండ ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా ప్రవేశించారు. అక్కడ పని చేస్తున్న రోజుల్లోనే కమ్యూనిస్టు సాహిత్యం అధ్యయనం చేస్తుండేవారు. ఆయనలోని స్వచ్ఛమైన దేశభక్తి, ప్రజలందరికీ శాంతి సౌఖ్యాలతో కూడిన జీవితం అందుబాటు కావాలనే మానవతా దృష్టి, కమ్యూనిస్టు సాహిత్య అధ్యయనం ద్వారా ఏర్పడిన దృక్పథం, దాని వల్ల కలిగిన చైతన్యం, కొంతమంది కమ్యూనిస్టుల ఆచరణను ప్రత్యక్షంగా చూడగలగటం, ఇవన్నీ పెనవేసుకొనే ఆయన కమ్యూనిస్టు పార్టీలో చేరడానికీ, కార్యాచరణకూ ప్రేరేపించాయి.

పార్టీకి అతి క్లిష్ట సమయం అది. నందమూరులో మానికొండ ఇల్లు పార్టీ కార్యకర్తల రహస్య సమావేశాలకు స్థావరంగా, రక్షణ దుర్గంగా తయారయింది. కృష్ణాజిల్లా కమ్యూనిస్టు కమిటీ ఆ రహస్య కాలంలో జయప్రదంగా నడవడానికి మానికొండ ప్రధాన పాత్ర వహించారు. ఒక ఏడాదిపాటు మానికొండ విప్లవ కార్యాచరణను ప్రత్యక్షంగా చూసిన జిల్లా, రాష్ట్ర నాయకత్వం ఆయనను పార్టీ గన్నవరం తాలూకా ఆర్గనైజర్‌గా నియమించింది. అది 1941వ సంవత్సరం. చిత్తశుద్ధితో, అవిరామంగా పని చేసి గన్నవరం తాలూకాలో బలమైన కమ్యూనిస్టు పార్టీని నిర్మించారు. ప్రజల పట్ల, పార్టీ కార్యకర్తల పట్ల, ఆయన తీసుకునే వైఖరి, వారితో చర్చించే పద్ధతి, వారిని ఒప్పించి పని అప్పగించి ప్రోత్సహించి పంపించే విధానం ఆదర్శప్రాయంగా, ప్రయోజనాత్మకంగా వుండేవి. పార్టీ శాఖలు, కమిటీలు అవి ఎదుర్కొనే రాజకీయ నిర్మాణ ప్రజా సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో ఆయన నేర్పేవారు. ప్రతి సమస్యనూ రాజకీయ దృక్పథంతో విశ్లేషించి పరిష్కారం చూపేవారు. రెండేళ్లలో పార్టీ నిర్మాణానికీ ప్రజా ఉద్యమానికీ చేసిన కృషికి గుర్తింపుగా ఆయనను కృష్ణాజిల్లా నాయకత్వానికి ప్రమోట్ చేసింది.

పార్టీ కృష్ణాజిల్లా నాయకత్వం స్వీకరించిన తరువాత అనేక వ్యతిరేక శక్తులను ఎదుర్కొంటూ పార్టీ విధానాలను ప్రజలకు ఓపికతో, సమర్థతతో వివరిస్తూ ప్రజల నిత్య జీవిత సమస్యలపై నిర్మాణాత్మకంగా పని చేస్తూ పార్టీ పట్ల ప్రజల్లో అనుకూల ధోరణి, మార్పు తీసుకు రావడంలో ఆయన ప్రధాన పాత్ర నిర్వహించారు.



1945–46 నాటికే మానికొండ కుటుంబం ఆదర్శ విప్లవ కుటుంబంగా పేరొందింది. మానికొండ తాను కమ్యూనిస్టుగా ఉద్యమంలోకి దిగడంతోనే ఆగిపోకుండా భార్య సూర్యావతిని విప్లవనారిగా తయారు చేశారు. తల్లి బుల్లెమ్మను విప్లవ మాతగా తీర్చిదిద్దారు. సాధారణంగా తల్లులు తమ బిడ్డలు పెద్ద ఉద్యోగాలు సంపాదించి ఆర్జనాపరులై ప్రయోజకులు కావాలని ఆశిస్తారు. కానీ ఆవిడ తన ఒక్కగానొక్క కుమారుడు కష్టభూయిష్టమైన కమ్యూనిస్టు కార్యకర్త జీవితాన్ని ఎంచుకున్నందుకు చింతించలేదు. గోర్కీ నవల 'అమ్మ'లోని నిలోవ్నాను తలపింపచేసింది. పార్టీ రహస్య జీవితంలో మానికొండ ఇంటికెందరెందరో వచ్చి పోతుండేవారు. వారినందరినీ తన బిడ్డల్లాగా ఆదరించింది. తరువాత 1945 నుంచి ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ, ప్రజాశక్తి కార్యాలయాల్లో ఆమె 'కమ్యూన్' నిర్వహించారు. పార్టీ కోసం సభ్యులు, కార్యకర్తలు తమ ఆస్తిపాస్తులను సమర్పించాలని పిలుపు ఇచ్చినప్పుడు మానికొండ దంపతులు తమ ఆస్తి యావత్తూ పార్టీకి సమర్పించారు. తన కొడుకూ కోడలూ వాళ్ల వంతు ఆస్తిని పార్టీ కోసం త్యాగం చేసినప్పుడు బుల్లెమ్మగారు హృదయపూర్వకంగా వారిని ఆశీర్వదించింది. పైపెచ్చు తన డబ్బు నుంచి వెయ్యిన్నూట పదహార్లు పార్టీకి సమర్పించింది.

ప్రాథమిక పాఠశాల చదువుకే పరిమితమైన భార్యను ఆయన తన కృషి ద్వారా విద్యా విజ్ఞానం, చైతన్య వికాసం కల్పించి ఆంధ్రప్రదేశ్ మహిళా ఉద్యమానికే నాయకత్వం వహించే స్థాయికి తీసుకురాగలిగారు. ఆమె సర్పంచ్‌గా, ఎంపిపిగా, శాసనమండలి సభ్యురాలుగా పని చేశారు. నాటి భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పిసి జోషి మానికొండను ప్రజాస్వామిక భర్త అనీ, ఆదర్శ కమ్యూనిస్టు రివల్యూషనరీ భర్త అనీ అభివర్ణించారు.

1955లో జరిగిన శాసనసభ మధ్యంతర ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ ఓటమి పాలయింది. దీంతో పార్టీ రాజకీయంగా, ఆర్థికంగా గట్టి దెబ్బ తింది. పార్టీ అప్పులు తీర్చడం మాట అలా వుంచి కార్యకర్తలను పోషించడమే కష్టమైపోయింది. మరోవైపు ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ విజయగర్వంతో పార్టీ కార్యకర్తలపైనా, ఓటు వేసిన ప్రజలపైనా దౌర్జన్యకాండ ప్రారంభించింది. ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీ తన శిబిరాన్ని నిలబెట్టుకోవడం, ఆర్థిక స్థితి నుంచి బయటపడి పార్టీ నిర్మాణాన్ని కాపాడుకోవడం ప్రధాన కర్తవ్యాలయ్యాయి. మానికొండ ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ధైర్యంగా, చైతన్యంతో ప్రజలపై సంపూర్ణ విశ్వాసంగల విప్లవకారుడిగా నిలబడ్డారు. కానీ రాష్ట్ర, జిల్లా కమిటీల్లో ఓటమి తత్వపు ప్రాబల్యం పైచేయి అయింది. పార్టీ కోసం సర్వస్వం అంకితం చేసిన ప్రొఫెషనల్ రివల్యూషనరీలను పెద్ద సంఖ్యలో పార్టీ నుంచి (నిర్మాణ రంగంలో) తప్పించి ఎవరికివారు వారివారి బతుకుదెరువు చూసుకోవాలనే ధోరణి మెజారిటీ ధోరణిగా తయారయింది. జిల్లా కార్యదర్శిగా వున్న మానికొండ ఈ ధోరణిని ప్రతిఘటించారు. చివరికి ఆ ధోరణే నెగ్గి పార్టీ నిర్ణయం జరిగాక ఆయన సుశిక్షిత సైనికుడివలె తాను పార్టీ పూర్తికాలం కార్యకర్తగా తప్పుకున్నారు. మానికొండ వంటి కమ్యూనిస్టు విప్లవకారుడు జీవనోపాధిని వెతుక్కుంటూ ఎక్కడుం డగలరు? ఆయన తల్లి బుల్లెమ్మగారు తన దగ్గరున్న కొద్దిపాటి సాధన సంపత్తితో ఆ దంపతులకు ధైర్యాన్నిస్తూ అండగా నిలబడ్డారు. పార్టీని బలపరిచే ఎందరో పెద్దలు చాలా బాధపడ్డారు. వారాయనను కలుసుకొని పార్టీ పనిని మానుకోవాల్సిన అవసరం లేదనీ తాము ఆర్థిక తోడ్పాటు ఇస్తామని ప్రోత్సహించారు. కానీ మానికొండ వ్యక్తిగత సహాయాన్ని నిరాకరిస్తూ వారు ఆర్థిక సాయం చేద్దామనుకున్న మొత్తాన్ని పార్టీకి జమ కడితే పార్టీయే సముచిత నిర్ణయం తీసుకోగలదని నచ్చజెప్పారు. ఆయన ఎంతో కష్టదశలో వున్నా ఉన్నత కమ్యూనిస్టు నైతిక ప్రమాణాలను వీడలేదు.

1964లో కమ్యూనిస్టు పార్టీలో చీలిక అనివార్యమైంది. దీనికి ముందు జరిగిన రాజకీయ సిద్ధాంత నిర్మాణ పోరాటంలో మార్క్సిస్టులుగా మానికొండ దంపతులు రివిజనిజాన్ని ప్రతిఘటించి నిలిచారు. కృష్ణాజిల్లా కమిటీ కార్యదర్శిగా మానికొండ పార్టీ పునర్నిర్మాణ బాధ్యతలను చేపట్టారు. 1964 నుంచి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యులుగా, 1968 నుంచి 1975 వరకూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా పనిచేశారు. 1975 జనవరి 27వ తేదీన కృష్ణాజిల్లా కాటూరులో పార్టీ నిధి వసూళ్ల కార్యక్రమంలో వుండగా ఆయన గుండెపోటుకు గురయ్యారు. ఆ మరునాడు ఆయన హృదయం ఆగిపోయింది. వాణి మూగబోయింది. సొంత లాభం సొంతం మానుకొని ప్రజల కోసం అహర్నిశలూ పని చేసిన ఆదర్శమూర్తి మానికొండ.

(19వ తేదీన ఉయ్యూరులో మానికొండ శత జయంతి సభ జరుగుతున్న సందర్భంగా)



అనాదిగా పండగలన్నీ.. సమాజానికి ఏదో ఒక సందేశాన్ని మోసుకొొచ్చేవే. కానీ మారుతున్న జీవనశైలిలో పండగల రూపురేఖలూ మారుతున్నాయి. కానీ, వెదికిచూస్తే.. ఒక్కో పండగలో అంతర్లీనమైన కథేదో దాగి ఉంటుంది. అలాంటి పండగల్లో ఉగాదీ ఒకటి. పండగ అంటే.. సామూహిక సంబరం. కలివిడిగా, కలగలుపుగా, మేలు కలయికగా, కుటుంబంగా, సామాజికంగా సంతోషాలను పంచుకునే సందర్భం. అయితే ఇలాంటి సందర్భంలోనే కొన్నింటితో కాసేపైనా సావాసం చేయాలి. దగ్గరగా వెళ్ళాలి. వాటిని తాకాలి. ప్రేమించాలి. ఆ మురిపెంలో పరవశించాలి. అలా పరవశించాలంటే మనం పచ్చగా ఉండాలి. అలా పచ్చగా.. లేలేతని చిగురవ్వాలి. మనకు మనంగా ప్రకృతిలో మమేకం కావాలి. చెట్టు, పిట్ట సమేతంగా.. పలుకు తేనెల పండగగా మారాలి. అవన్నీ ఉగాది పండగలో పుష్కలంగా ఉన్నాయి. వెదికి పట్టుకోవడంలోనే ఉంది అసలైన పండగ.

చెట్టు, పిట్టను పలకరిద్దాం!!



ముందే అనుకున్నట్టు.. పండగ అంటే కేవలం సంతోషాలను మోసుకొొచ్చే సందర్భమే కాదు. మనలోకి మనం తొంగి చూసుకుంటూ.. నిన్నటితరాన్ని తలచుకుంటూ.. రేపటికోసం ఎంతో కొంత సందేశాన్ని పంచడమూ అనేది ప్రకృతి ప్రేమికుల అభిప్రాయం.

నిజం చేదుగా ఉంటుంది.. కానీ

అసలు మానవుడి మనుగడే ప్రకృతితో ముడిపడి ఉంది. కాలంతో పాటు నడిచే దారిలో ప్రకృతి చెప్పే కమ్మని కబుర్లు వినాలి. అనివార్యంగానైనా ప్రకృతితో మమేకమవ్వాలి. ప్రకృతితో మమేకం అవ్వడమంటే.. ప్రకృతిని దగ్గరగా చూడ్డం. మనం ఉంటున్న అట్టపెట్టెల్లాంటి మేడలు, మిద్దెల్లోంచి బయటకొచ్చి.. కాసేపు.. నేలపై నడవాలి. నడిచే దారిలో ఎదురొచ్చే చెట్టు, పుట్ట, గట్టును పలకరించాలి. అలా పలకరించే క్రమంలో వేపచెట్టుతో చెట్టాపట్టాలేసుకుని కాసేపు తనివితీరా ముచ్చటించి, రావాలి. ఇలాంటి పలకరింతల్లోనే పండగ ఉందంటే?! విడ్డూరంగా ఉంటుందేమోగానీ, నిజానికి ఇది నిజం. పచ్చినిజం. పచ్చని నిజం.

చెట్టంత మనుషులం

ఉగాది అంటేనే.. ముందుగా గుర్తొచ్చేది.. వేపపూత సోయగం. ఇంటిపెరట్లోనే. వాకిట్లోనే.. పచ్చగా రాజసం ఒలకబోస్తూ.. చల్లటిగాలి వీస్తూ.. ముప్పొద్దులా మనల్ని స్వచ్ఛమైన గాలిలో ఊయలలూపే వేపచెట్టుతో మన బంధం మరచిపోలేనిది. మరి ఇప్పుడు ఊరూ వాడల్లో వేపచెట్టును వెదికి పట్టుకోవడం అంటే.. ఓ తపస్సు. ఒకప్పుడు ఇంటి పరిసరాల్లో వేపచెట్టును పెంచడం సర్వసాధారణ విషయం. కానీ, ఇప్పుడు ఇంటికి అడ్డొచ్చే ఎలాంటి చెట్టునైనా అడ్డంగా నరికేయడం సర్వ సాధారణం.

వేపచెట్టు పూతలా నిజాలు చేదుగానే ఉంటాయి. కానీ ఇది నిజం. ప్రకృతి బంధాలను గుర్తు చేసుకునే ఈ సందర్భంలో జనావాసాల్లో మొలకెత్తే వేపచెట్ల మనుగడనూ మనం గుర్తు చేసుకోవాల్సిన సమయమిది. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిలో వేప చేదుకున్న విలువనూ గుర్తించాలి. ఒక్క వేపచెట్టే కాదు; ఆ చెట్టుమీద ఉన్న పిట్ట గురించీ ఆలోచించాలి. ఇక్కడ పిట్ట అంటే ఎవరో కాదు.. మన కోకిలమ్మే. లేలేత ఆకుపచ్చని కొమ్మలమాటున.. కుహూ.. కుహూ అంటూ.. ఊలలేసే.. కోకిలమ్మలకూ ఆవాసాలు కావాలంటే.. మనచుట్టూ పచ్చని చెట్లుండాలి. చెట్టుమీద వాలే పిట్టలూ ఉండాలి. 'చిరుగాలి వీచేనే..' అని పాడుకునేలా మనం వనమాలిలా మారాలి. తప్పదు. సైన్స్ ఇదే చెప్తుంది.

కొంచెం తీపి.. కొంచె కారం

ఉగాది అచ్చ తెలుగు పండగ. తెలుగు క్యాలెండర్ ప్రకారం కొత్త సంవత్సరానికి నాంది పలికే పండగ. కాలాన్ని గుర్తు చేసే పండగ. అయితే, కాలాన్ని లెక్కించే క్రమంలో మనం భూభ్రమణం, భూపరిభ్రమణాలను లెక్కిస్తాం. ఇదంతా సైన్స్. ఈ కూడికలు.. తీసివేతల్లోనూ సైన్సే ఉంది. కాలంతో పరుగెట్టడం అంటే.. శాస్త్రంతో కలిసి ప్రయాణించడమే. అలా ప్రయాణించే క్రమంలో భూమిని భూమిగా ఉండనివ్వాలి. భూమి అంతరపొరల్లోని అంతరాలను, సంఘర్షణలను పసిగట్టాలి. భూమికి అలంకారాలైన చెట్టూపుట్ట, జలచరాలు, జీవనదులన్నింటితో.. సహజీవనం చేయాలి. అంతేకాదు..; అప్పుడప్పుడు ఆకాశం వైపూ చూడాలి. ఆ విశ్వపు వినువీధుల్లో తిరుగాడే నక్షత్రాల రహస్యాలను తెలుసుకోవడానికి, వీలైతే స్టీఫెన్‌హకింగ్‌లా అన్వేషించడానికి ప్రయత్నం చేయాలి. ఓజోన్‌పొర గాయపడకుండా చేతులు అడ్డుపెట్టి కాపాడుకోవాలి. అవును.. ఇదంతా పర్యావరణ హితంగా సాగాల్సిన ప్రయాణం. అలా సాగాలనే ఉగాది పండగ చెప్తోంది.

ఇలా చెప్పేదంతా వేపంత చేదుగానో, మామిడి ముక్కంత పులుపుగానో, కాస్తంత వగరుగానో ఉండొచ్చు. ఇదే.. నిజం అని చెప్తే.. గుంటూరు కారంలానూ అనిపించవచ్చు. కానీ తెరచిచూస్తే ఉగాది పండగలో ఇలాంటి శాస్త్రీయ దృక్కోణం ఎంతో ఉంది. జాతకాలకు, జాతకఫలాలకు అతీతంగా మనం చూడాల్సింది ఇదే. ఆధునిక జీవనశైలిలో ప్రకృతిని దర్శించుకోవడం.. ఆచరించడం కొందరికి కొంచెం కారంగా.. భారంగానే అనిపించవచ్చు. కానీ మనకోసం మనం.. ప్రకృతితో ఏకం కావడం.. చెరుకు రసమంత తీపిగానూ ఉంటుంది. అందుకే.. ఉగాది సందేశంలో కారంగా అనిపించే చేదు నిజాలను అర్థంచేసుకావాలి. ప్రకృతి ఉనికి కాపాడుకోవాలి అన్నది పర్యావరణ శాస్త్రజ్ఞుల మాట.

తేనెలూరు పలుకు

నిజానికి మానవ సంబంధాలు బలపడటానికి భాష, యాస అనేవీ ముఖ్యమైన వారధులు. మాతృభాషలోని వ్యక్తీకరణకు మించిన భావప్రకటన మరొకటి ఉండదంటారు. అలాంటి తరుణంలో స్వీయ, మాతృభాష గురించి మాట్లాడుకోవడానికీ ఓ చక్కని సందర్భం ఉగాది. వేలాది సంవత్సరాల చరిత్ర ఉన్న తెలుగు భాషలోని ఔన్నత్యాన్ని వర్తమానంలోకి తీసుకురాకపోయినా.. తెలుగుభాషలోని తీయదనాన్ని, పరిమళాన్ని కవిత్వంగానో, పద్యంగానో, గేయంగానో, కళారూపంగానో చూసుకుని పరవశించే సమయమూ ఉగాదే. పల్లెపట్టు పంచెలు కట్టి, పట్టుపరికిణీల సింగారంతో.. అచ్చమైన తెలుగు నుడికారపు శోభతో పెద్దలు, పిల్లాపాపలు, మహిళలు.. వికసించే సందర్భమూ ఉగాదే. అంతరించిపోతున్న భాషా సంప్రదాయాలను తలుచుకుంటూ.. స్వీయభాషలోని అందాన్ని, చందాన్ని, ఛందస్సుని, ప్రాసను, యాసను నిండారా కౌగిలించుకుని, నెమరు వేసుకోవడానికి ఇదే చక్కని అవకాశం. మావిచిగురు, కోయిల పాట, తేనెలొలికే పదాల సమేతంగా పలికే కవితా సుగంధాలు, తీపి, చేదు, వగరు, పులుపు, కారం, ఉప్పు సమపాళ్లలో కలిసి.. అనిర్వచనీయమైన రుచిగా మారే షడ్రుచుల ఉగాది పచ్చడి.. తనివితీరా ఆస్వాదించడం ఓ వెలకట్టలేని అనుభవం.

ప్రకృతి సమేతమే మానవుని జీవితం, జీవనం. అలాంటి ప్రకృతిని తలపించే ఉగాది అర్థవంతంగా, విజ్ఞానదాయకంగా ఉండాలి. పండగంటే.. పరివర్తనం. పండగ అంటే భవిష్యత్తు ప్రకాశం. అందులో పచ్చని చెట్టూ ఉండాలి. తీయని గీతాల పిట్టా ఉండాలి. తేనెల చిలకరింత గల భాషాపలుకూ ఉండాలి.. అందులో మనమూ ఉండాలి. ఉంటే ఉగాది సంతోషాల పండగే!

- గంగాధర్ వీర్ల



ఉగాది పచ్చడి చేద్దాం, ఇలా ...

తెలుగు సంవత్సరాది ఉగాది. ఇదొక ప్రత్యేకమైన సందడి. ఒక్కో పండక్కి ఒక్కో ప్రత్యేక వంటకం ఉంటుంది. ఉగాదికి మాత్రమే పచ్చడి ప్రత్యేకం. నిజానికి ఇది వంటకం కాదు. ఆరు రచుల దినుసులతో అదొక ప్రత్యేక తయారీ. ఉగాది పచ్చడి తింటే ఆరోగ్యానికి మంచిది. జీవితంలో కష్టసుఖాలకు అదొక ప్రతీక అని కూడా చెబుతారు. ఉప్పు, పులుపు, కారం, తీపి, చేదు, వగరు అనేవి ఈ ఆరు రుచులు. మరి ఈ పచ్చడి తయారీకి ఏం కావాలి? ఎలా తయారు చేయాలి? తెలుసుకుందాం.

కావాల్సిన దినుసులు : స్పూన్ వేపపువ్వు, చిన్న చెరకు ముక్క, చిన్న కొబ్బరిముక్క, ఆరు అరటిపళ్లు, నిమ్మకాయంత చింతపండు, చిన్న మామిడికాయ, 100 గ్రాముల బెల్లం, ఒక పచ్చి మిరపకాయ, చిటికెడు ఉప్పు, కొంచెం నీరు.

తయారు చేసే విధానం : ముందుగా చెరకు , కొబ్బరి, బెల్లం, మిరపకాయ, మామిడికాయలను చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని ఒక పక్కన పెట్టుకోవాలి. వేపపువ్వును శుభ్రపరచుకోవాలి. చింతపండును బాగా పిసికి గిన్నెలోకి వడగట్టాలి. అందులో బెల్లం పొడి వేసి, బాగా కలియబెట్టాలి. ఆ తర్వాత అరటిపళ్లను బాగా ముద్ద చేసి, ఆ నీళ్లల్లో కలపాలి. ఎక్కడా అరటిపండు ముక్కలుగా ఉండకూడదు. అందులో చిటికెడు ఉప్పు, చెరకు, కొబ్బరి, మిరపకాయ, మామిడికాయ ముక్కల్ని వేసి బాగా కలపాలి. అంతే.. ఉగాది పచ్చడి తయారు! ఇక సేవించండి. ఆరురుచులను ఒకేసారి ఆస్వాదించండి. ★







బాలీలో భలే ఉగాది!

చైత్రమాసంలో వచ్చే ఉగాదిని మన తెలుగు ప్రాంతంలోనేకాక భారతదేశంలో వివిధ రాష్ట్రాల్లో జరుపుకుంటారు. మహారాష్ట్రలో 'గుడి పడ్వా' అనీ, సింధీలు 'చెతి చాంద్' అనే పేర్లతో పిలిచే ఈ కొత్త సంవత్సర ప్రారంభాన్ని కర్నాటక, తమిళనాడు, కేరళ, గోవా రాష్ట్రాల్లోనూ పండగగా చేసుకుంటారు. అంతేకాదు ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లోనూ 'సజిబు నొంగ్మా పన్బా' అనే పేరుతో కొత్త ఏడాదికి ఆహ్వానం పలుకుతారు. మనం చేసుకున్నట్లే ఈ ప్రాంతాల్లోనూ కుటుంబమంతా కలిసి ప్రత్యేకమైన పిండి వంటలతో విందు ఆరగిస్తారు. ఇంటి ముందు మురిపాల ముగ్గులేసి, అతిథుల్ని ఆహ్వానిస్తారు. ఇదంతా ఒక ఎత్తయితే మన ఉగాది రోజునే ఇండోనేషియా, బాలి దేశాల్లో 'నైపి' అనే పేరుతో హిందూ కొత్త సంవత్సరాన్ని జరుపుకుంటారు. బాలిలో జరుపుకునే ఈ సంబరం ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకునే విధంగా ఉంటుంది. ఇక్కడ నిర్వహించే ఆచారవ్యవహారాలు చాలా కచ్చితంగా ఉంటాయి.

బాలి క్యాలెండర్ ప్రకారం మార్చి 18న కొత్త సంవత్సరంగా పబ్లిక్ హాలిడే ఉంటుంది. అయితే బాలిలో ఈ రోజుకు ముందురోజు అంటే 17వ తారీఖుకు మరో ప్రత్యేకతా ఉంది. 'నైపి' ముందు రోజును మౌనం, ఉపవాసం, ధ్యానం రోజుగా పరిగణిస్తారు. దక్షిణ బాలిలో 'ఒమెద్-ఒమెదాన్' అనే పేరుతో 'ముద్దుల ఆచారం' అనే ఒక తంతు నిర్వహిస్తారు. ఉదయం 6 గంటల నుంచి సరిగ్గా 24 గంటల అంటే మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకూ స్వీయ దర్శనం', అంటే తమని తాము తెలుసుకునే సమయంగా పాటిస్తారు.

'నైపి'కి ముందు కచ్చితంగా పాటించవలసినవి కొన్నున్నాయి. ముఖ్యంగా 17వ తారీఖున ఎలాంటి టపాసులూ మోగించకూడదు. ఇంట్లోగానీ, వీధుల్లోగానీ దీపాలు తక్కువ కాంతితో ఉండాలి. పనులు పక్కనపెట్టాలి. ఆ రోజు ఎలాంటి ఉత్సవాలుగానీ, సంతోషాలుగానీ జరుపుకోకూడదు. ప్రయాణాలు చేయకూడదు. కొందరైతే ఎవ్వరితోనూ మాట్లాడరూ, ఏ పదార్థమూ తినరు. అందుకే ఈ రోజు బాలిలో రోడ్లన్నీ ఖాళీగా ఉంటాయి. టీవీ, రేడియో శబ్దాలు కూడా ఉండవంటే అర్థంచేసుకోవచ్చు.. వారెంత కచ్చితంగా ఈ ఆచారాలను పాటిస్తారో.

ఇక కొత్త ఏడాది రోజు అంటే 'నైపి' దినాన్ని వీళ్ళ 'నెంబక్ గెని' అంటే 'నిప్పుని తిరిగి వెలిగించే' దినంగా భావిస్తారు. రోజువారీ పనులన్నీ వెంటనే మొదలవుతాయి. కుటుంబసభ్యులు, స్నేహితులు ఒకర్నొకరు అంతకు ముందు చేసిన పొరపాట్లకు క్షమాపణలు అడుగుతారు. ఇంట్లో పొయ్యి వెలిగించి, రుచికరమైన వంటల్ని తయారుచేస్తారు. తర్వాత అంతా కలిసి సముద్రతీరానికి వెళ్లి, స్నానాలు చేసి, ధర్మశాంతి అనే ఆచారాన్ని అందరూ కలిసి నిర్వర్తిస్తారు.

ప్రపంచంలో చాలా పండగలు ఉంటాయిగానీ, ప్రాంతీయంగా వివిధ ప్రాంతాల్లో వైవిధ్యంగా ఒకేరోజు జరుపుకునే కొత్త సంవత్సర వేడుకలు, వ్యవహారాల్లో సామాజిక కోణం ఆసక్తి కలిగిస్తుంది. మనం మనం అనుకునే సొంతతనాన్ని కలిగిస్తుంది. మనుషులంతా ఒక్కటే అనిపిస్తుంది. ★



విద్యార్థినులకు అవాన్స్ రుణాలు

ముంబయి : డిహెచ్ఎఫ్ఎల్‌కు చెందిన అసోసియేట్ సంస్థ అవాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థినులకోసం ప్రత్యేక రుణ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పథకం కింద 25 శాతం ప్రాసెసింగ్ ఫీజు రాయితీతోపాటు ఒక్క శాతం చొప్పున వడ్డీరేటును తగ్గించి ఇవ్వనున్నామని ఆ సంస్థ సిఇఒ అమిత్ గుయిడా పేర్కొన్నారు. వీటి కాలపరిమితి 12 సంవత్సరాలు. మహిళా దినోత్సవం సందర్భంగా అందుబాటులోకి తెచ్చిన ఈ ఆఫర్ మార్చి 31 వరకు అందుబాటులో ఉంటుందన్నారు.



▌ఉమెన్ సర్కస్ సమ్మిట్..

దేశంలోని మహిళా ఆప్తమాలజిస్టులందరికీ సాధికారత కల్పించేందుకు హైదరాబాద్‌లో ఉమెన్ సర్కస్ సమ్మిట్ 2018ను ఏర్పాటు చేశారు. అల్కాన్ సహకారంతో శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన దీనికి 150 మందికి పైగా హాజరయ్యారు. దీనికి డాక్టర్లు శ్రీలక్ష్మి నిమ్మగడ్డ, మోహిత శర్మ, నివేదిత నారాయణన్, నమ్రత శర్మ, సుజాతా మోహన్, నీతా షా తదితరులు పాల్గొన్నారు.



▌ఎఫ్ఎల్ఓ మీట్..

ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'మీడియా ఇన్ న్యూస్ ఇంటరాక్టివ్ సెషన్‌కు ప్రముఖ టివి యాంకర్ రాజీవ్ దేశాయ్ హాజరయ్యారు. ఎఫ్ఎల్ఓ హైదరాబాద్ చాప్టర్ కామిని సరఫ్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించిన ఈ సెషన్‌కు 500 పైగా మంది పాల్గొన్నారు. రెండున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో దేశాయ్ పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

ఎల్ఐసి పెట్టుబడులపై ప్రభావం

ఎన్‌సిఎల్‌టిలో పలు కంపెనీల కేసులు



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) పలు కంపెనీల్లో పెట్టిన పెట్టుబడులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆయా కంపెనీలు చేసిన అప్పులు తిరిగి చెల్లించలేక దివాలా చట్టాన్ని ఆసరాగా చేసుకుంటున్నాయి. దీంతో ఆయా కంపెనీల్లో ఎల్ఐసి ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడులు ప్రమాదంలో పడిపోయాయి. ఈ బీమా కంపెనీ పెట్టుబడులు కలిగిన పలు కంపెనీలు బ్యాంకు దివాలా చట్టం క్రింద నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి)ను సంప్రదిస్తున్నాయని ఇటీ ఒక కథనం వెల్లడించింది. ఇప్పటికే పలు కేసులు నమోదు అయ్యాయని ఇందులో పేర్కొంది. అలోక్ ఇండస్ట్రీస్, ఎబిజి షిప్‌యార్డ్, ఆమ్టెక్ ఆటో, మందన్న ఇండస్ట్రీస్, జెపి ఇన్‌ఫ్రాటెక్, జ్యోతి స్ట్రక్చర్స్, రెయిన్‌బో పేపర్స్, ఆర్చిడ్ ఫార్మా తదితర కంపెనీల కేసులు ఎన్‌సిఎల్‌టిలో ఉన్నాయి.

గత మూడేళ్లలో తాము ఏకాగ్రత నిర్ణయాలతో బిఎస్ఇ 200 కంపెనీల్లో పెట్టుబడులు పెడుతున్నామని ఎల్ఐసి మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ భార్గవా పేర్కొన్నారు. గీతాంజలి జెమ్స్, వక్రాంగీ, వీడియోకాన్ లాంటి పరిశ్రమల్లో ఈ ప్రభుత్వ రంగ బీమా కంపెనీ అతిపెద్ద వాటాదారుగా ఉంది. కాని ఆ కంపెనీల్లో పేలవమైన గవర్నెన్స్, పారదర్శకత లేమి చోటు చేసుకుంటుందన్న వార్తలు వస్తున్నాయి. అదే విధంగా రిలయన్స్ కమ్యూనికేషన్స్, జిటిఎల్ ఇన్‌ఫ్రా, ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్స్, అప్టో సర్క్యూట్స్, జిలోగ్ సిస్టమ్స్, రోల్టా ఇండియా, అబన్ ఆఫ్‌షోర్, శ్రీ రేణుక సుగర్స్, మన్పెట్ ఇండస్ట్రీస్‌లో ఎల్ఐసి వాటాలు కలిగి ఉంది. గత కొన్ని ఏళ్లుగా ఈ కంపెనీలు భారీగా విలువను కోల్పోతూ, అప్పుల భారిన పడ్డాయి.

వక్రాంగీలో 6.58 శాతం, వీడియోకాన్ ఇండస్ట్రీస్ 4.56శాతం, గీతాంజలి జెమ్స్ 3.79 శాతం, ఆమ్టెక్ ఆటో 3.39 శాతం, లోక్ ఇండస్ట్రీస్ 2.55 శాతం, ఎంధన ఇండస్ట్రీస్ 1.99 శాతం, జ్యోతి స్ట్రక్చర్స్ 1.94 శాతం, అప్టో సర్క్యూట్స్ 1.16 శాతం, ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్స్ 1.06 శాతం, ఎబిజి షిప్‌యార్డ్ 1 శాతం చొప్పున ఆయా కంపెనీల్లో వాటాలు కలిగి ఉంది. డిసెంబర్ 2017 ముగింపు నాటికి ఎల్ఐసి 378 కంపెనీల్లో ఒక్క శాతం పైగా వాటా కలిగి ఉంది. ఇందులో 68 కంపెనీల్లో ప్రతి ఐదు కంపెనీల్లో ఒక్క కంపెనీ మార్కెట్ విలువ రూ.100 కోట్లకు తక్కువగానే ఉంది. పెద్ద బ్లూచిప్ కంపెనీల్లో మాత్రమే ఎల్ఐసి పెట్టుబడులు పెడుతుందన్న విమర్శలు ఉన్నాయి.

బ్యాంకులను కొల్లగొడుతున్నాయి

- రుణాల్లో 40% మొండి బాకీలే..
- బడా పరిశ్రమల గుదిబండ
- విత్త సంస్థల విలవిల
- రుణాల పునరుద్ధరణతో మరింత భారం



న్యూఢిల్లీ : బడా పారిశ్రామికవేత్తలకు ఇచ్చే అప్పులు సగం వరకూ రికవరీ కావడం లేదు. బ్యాంకులు పెద్ద పరిశ్రమలకు ఇస్తున్న రుణాల్లో దాదాపుగా 40 శాతం వరకు మొండి బాకీలుగా మారుతున్నాయి. దీంతో బ్యాంకుల ఆదాయం, లాభదాయకతపై తీవ్ర ప్రభావం పడటంతో విత్త సంస్థలు విలవిలమంటున్నాయి. పరిశ్రమల ఏర్పాటు, విస్తరణ పేరుతో వివిధ కంపెనీలు బ్యాంకుల వద్ద భారీగా అప్పులు తీసుకుంటున్నాయి. కాని తిరిగి చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బ్యాంకుల్లోని ప్రజా ధనాన్ని కొల్లగొడుతున్నాయి. ఈ విధంగా బడా పారిశ్రామికవేత్తలు బ్యాంకింగ్ రంగాన్ని ఒక విధంగా అస్థిరపర్చుతున్నారు. ఇందుకు నిదర్శనం దేశంలోని ఐదు బ్యాంకులు బడా పరిశ్రమలకు ఇచ్చిన అప్పుల్లో 40 శాతం స్థూల మొండి బాకీలుగా మారాడమే. పెద్ద పరిశ్రమలు బ్యాంకులకు భారీగా నిరర్థక ఆస్తులను మిగిల్చుతున్నాయని శుక్రవారం పార్లమెంట్‌కు ఆర్థిక మంత్రిత్వ శాఖ స్వయంగా తెలిపింది. ప్రయివేటు రంగ సంస్థ కథలిక్ సిరియన్ బ్యాంకు అత్యధికంగా 50 శాతం మొండి బాకీలను ఎదుర్కొంటుంది. బ్యాంకింగ్ పరిశ్రమలోని మరో ఆరు బ్యాంకులు ఈ విభాగంలో 30 శాతం పారు బకాయిలను చవి చూస్తున్నాయి.

సామాన్యుడు తీసుకున్న రుణ చెల్లింపులు కాస్త ఆలస్యమైనా జరిమానాలతో విరుచుకుపడే బ్యాంకర్లు.. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ వంటి కార్పొరేట్లు అప్పనంగా వేల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయినా కేసుల పేరుతో కాలక్షేపం చేయడం గమనార్హం. ఇందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక వర్గాల పక్షపాతి వైఖరి కూడా ప్రధాన కారణం.

పదే పదే విఫలం..

పలు పరిశ్రమలు రుణాలు చెల్లించడంలో పదే పదే విఫలం అవుతున్నప్పటికీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి బ్యాంకులు మళ్లీ వాటికి రుణాలు ఇవ్వాల్సిన దుస్థితి చోటు చేసుకుంటుందని బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి. స్టీల్, ఆటో ఉత్పత్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కలిగిన డజన్ వరకు బడా కంపెనీలు బ్యాంకు దివాలా చట్టం కేసులను ఎదుర్కొంటున్నాయి. ఈ కంపెనీలు బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు చెల్లించడంలో పదే పదే విఫలం అవుతున్నాయి. కన్స్యూమర్ గూడ్స్ రంగంలోని 40 వరకు కంపెనీలు రుణాలను సరిగ్గా చెల్లించడం లేదు. చాలా వరకు విద్యుత్ ఉత్పత్తి కంపెనీలు తీవ్ర అనిశ్చితిని ఎదుర్కొంటున్నాయి. బ్యాంకులకు మొండి భారాలు భారీగా పెరిగి పోతున్నప్పటికీ రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వం బ్యాంకు చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయనే విమర్శలు పెరుగుతున్నాయి.

మూడేళ్లలో నాలుగు రెట్లు..

కేంద్రంలో నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక వర్గాల మొండి బాకీలు మరింత జడలు విప్పాయి. నోట్ల రద్దు చర్య వివిధ కంపెనీల ప్రగతిని దెబ్బతీశాయి. ఈ ప్రభావమూ రుణాల చెల్లింపుపై పడింది. 2015 మార్చి ముగింపు నాటికి భారీ పరిశ్రమల స్థూల మొండి బాకీలు రూ.1.2 లక్షల కోట్లుగా ఉన్నాయి. 2017 డిసెంబర్ ముగింపు నాటికి ఈ నిరర్థక ఆస్తులు రూ.5.3 లక్షల కోట్లకు చేరాయి. కేవలం 33 నెలల్లో నాలుగున్నర రెట్లు ఎగిశాయి. మొత్తం ఆడ్వాన్సుల్లో మూడింట్లో రెండో వంతు మొండి బాకీలుగా మారుతున్నాయి. నిరర్థక ఆస్తుల్లో అత్యధికంగా మౌలిక వసతులు, కీలక రంగాల ప్రాజెక్టులవేనని రిజర్వు బ్యాంకు పేర్కొంటుంది. పలు కంపెనీలు తమ రుణాలను పునరుద్ధరించుకుంటూ బ్యాంకులకు భారంగా పరిణమించాయి. ముఖ్యంగా అత్యధికంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు ఈ భారాన్ని మోస్తున్నాయి. అలాగని వాటికి మాత్రమే పరిమితం కాలేదు. డచ్ బ్యాంకు, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకులు కూడా భారీ పరిశ్రమల నుంచి 30 శాతం మొండి బాకీలను ఎదుర్కొంటున్నాయి.

12 పద్దులు .. 25% వాటా

ప్రభుత్వరంగ బ్యాంకుల మొత్తం స్థూల నిరర్థక ఆస్తులు (జిఎన్‌పిఎ) రూ.8.50 లక్షల కోట్లకుపైగా ఉన్నాయని ఆర్‌బిఐ గణంకాలు పేర్కొంటున్నాయి. ఒక్క ఎస్‌బిఐ మొండి బకాయిల విలువే రూ.2 లక్షల కోట్లుగా ఉన్నాయి. వాస్తవానికి మొత్తం భారతీయ బ్యాంకింగ్ రంగ నిరర్థక ఆస్తుల విలువ రూ.10 లక్షల కోట్లుగా ఉన్నట్లు అంచనా. మొత్తం నిరర్థక ఆస్తుల్లో 77 శాతం వాటా కార్పొరేట్ కంపెనీలదే. ఇందులోనూ 12 కంపెనీల నిరర్థక ఆస్తుల వాటా 25 శాతంగా ఉండటంతో ఆ రంగాలకు బ్యాంకులు ఇచ్చిన అప్పులు ఏ స్థాయిలో ఉన్నాయో స్పష్టమవుతోంది.

బడా భారం

బ్యాంకులు పెద్ద పరిశ్రమలకు ఇచ్చిన రుణాల్లో మొండి బాకీలుగా మారిన వాటా (జిఎన్‌పిఎ శాతంలో)

ఎస్‌బిఐ	25
జెఅండ్‌కె బ్యాంకు	28
ఆంధ్రా బ్యాంకు, బిఒఐ	29
డచ్ బ్యాంకు	30
స్టాన్‌చార్ట్	33
సెంట్రల్ బ్యాంకు	35
అలహాబాద్, బిఒఎం	37
ఒబిసి	39
యూకో బ్యాంకు	40
యునైటెడ్ బ్యాంకు	41
ఐడిబిఐ బ్యాంకు	43
ఐఒబి	44
కాతలిక్ సిరియన్	49

ఇక మొబైల్ బిల్లులు తగ్గవు...!

కౌంటర్ పాయింట్ రీసెర్చ్ అంచనా

ముంబయి : భవిష్యత్‌లో ఫోన్ బిల్లులు మరింత తగ్గే అవకాశాలు కన్పించడం లేదని కౌంటర్‌పాయింట్ టెక్నాలజీ మార్కెట్ రీసర్చ్ విశ్లేషించింది. రిలయన్స్ జియో రాక తర్వాత ముఖ్యంగా గత ఆరునెలల్లో సగటు నెలవారీ మొబైల్ బిల్లుల్లో 30నుంచి 40శాతం తగ్గుదల చోటు చేసుకుందని పేర్కొంది. కాగా భవిష్యత్తులో కూడా ఇదే ధోరణి ఉండకపోవచ్చని కౌంటర్ పాయింట్ పేర్కొంది. మొబైల్ వినియోగదారులు ఆశించిన ధరల క్షీణతను పొందలేరని పేర్కొంది. టెలికాం కంపెనీల ఆదాయం, మార్జిన్ల అధిక ఒత్తిళ్ల భారం వినియోగదారులపై పడనుందని తెలిపింది. జియో ప్రవేశం తర్వాత ఎయిర్‌టెల్, ఐడియా సహా పలు టెలికాం సంస్థలు టారిఫ్‌లను తగ్గించాయి. దీంతో సామాన్య వినియోగదారుడికి ధరలు అందుబాటులోకి వచ్చాయి. వినియోగదారులను ఆకట్టుకునేందుకు టెలికాం సంస్థలు తక్కువ ధరలోనే డేటా ఆఫర్లను అందిస్తున్నాయి. ఇక కొన్ని టెలికాం సంస్థలైతే మొబైల్ తయారీ సంస్థలతో పొత్తు పెట్టుకుని క్యాష్‌బ్యాక్ ఆఫర్లను కూడా ప్రకటించాయి. దీని వల్ల టెలికాం సంస్థల ఆదాయానికి భారీగా గండిపడినట్లు ఆ సంస్థల నివేదికలు పలు మార్లు పేర్కొన్నాయి. 2016 జూన్ నుంచి 2017 డిసెంబరు మధ్య టెలికాం కంపెనీలు దాదాపు 9.5 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోయాయని ఇటీవల ఓ నివేదికలో వెల్లడయ్యింది. వివిధ ప్యాకేజీల మధ్య వ్యత్యాసం రూ. 100లకు బదులుగా 50రూపాయల కంటే తక్కువుంటే కస్టమర్లపై భారం యథాతథంగా అంచనా వేయవచ్చని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ హెడ్ తరుణ్ పథక్ సిన్హా పేర్కొన్నారు. అయితే కస్టమర్ల సౌలభ్యం కోసం ఉన్న టారిఫ్‌లలోనే ఎక్కువ డేటా, మరిన్ని ఉచిత సదుపాయాలను అందించే అవకాశాలున్నాయన్నారు.

తెలుగు

S.S.C. MODEL PAPER

ENGLISH PAPER-II

(ప్రాక్టీస్ బిట్ పేపర్లు)

Part – B

Time: 1 Hour Marks:15

Instructions :

1. Answer the questions in 'Part-B' on the paper itself.
2. This part of the question paper should be attached to the Main Answer Book of the student.

6. Read the paragraph and write the synonyms of the underlined words choosing from the words given in the box. 4 × ½= 2

self-satisfied, dress, ill-shaped, fat, opens, welcomes

Victoria ushers (a) in Ben and Mrs. Jordan.The latter is a stout (b) complacent (c) woman with an irritating air of being always right. She is wearing an outfit(d) of new mourning.

Answers :

A) ....
B) ....
C) ....
D) ....

7. Read the paragraph and write the antonyms of the under lined words. 4 × ½=2M

When the curtain raises Mrs. Slater is seen laying the table. She is a vigorous (a) plump (b) red-faced (c) vulgar (d) woman prepared to do any amount of straight talking to get her own way.

Answers :

A) ....
B) ....
C) ....
D) ....

8. Fill in the blanks with the right from of the words given in brackets. 4 × ½=2M

Father was used to ....(a) (carry/ carrying) luggage anyway. He was stronger and more skilled than me in these matters. I had never got used to physical labour having stayed in hostels right from my .... (b) (child/ childhood). So, in spite of my............(c) (young / youth) and strength , I was ....(d) (physical / physically) useless.

Answers :

A) ....
B) ....
C) ....
D) ....

9. Complete the spelling of the words with 'ea', 'io', 'ou', 'ae'. 1 × 1 = 1M

These trees are very nice, they grow tall and they grow very fast, but as they grow they destroy all the local (a) b - - logical diverity. All the flora and (b) f - -na disappeared.

10. Complete the words with correct suffixes given in brackets. 2 × ½= 1M

a) I wondered whether she had observed any differ_______(ence/ance) in the way I ate rice, drank water or cleaned the floor after the meal.

b) I asked my father for permi_______(ssion/sion) to leave Rameswaram and study at the district headquarters of Ramanadhapuram.

11. Find the wrongly spelt word and write its correct spelling. 2 × ½= 1M

A) innocent, incident, conviction, iminent

Ans :

B) occassion, permission, impression, submission.

Ans :

12. Arrange the following words under correct heading. 2 × 1/4= 2M

(prophet, forester, colony, reservoir, environmentalist, landscape, contractor, terrain

Persons	Places
1.	1. ....
2.	2. ....
3.	3. ....
4.	4. ....

13. Use the following expresions in sentences of your own. 4 × 1/2= 2M

a) Pharasal Verb: come across

Ans :

....

b) Idiomatic Expression: right way

Ans :

....

c) Binomial Expression: odds and ends

Ans :

....

d) Foreign Expression : status quo

Ans :

....

14. Match the following one word substitutes with their meanings. 4 × 1/2= 2M

1) inimitable	[ ]	A) a person who abstains from taking alcohol.
2) theist	[ ]	B) a position for which no salary is paid.
3) spendthrift	[ ]	C) a life history written by onself
4) teetotaller	[ ]	D) one who spends too much
		E) one who believes in god
		F) that which can not be imitated.

Part -B (Answers)

6. a) welcomes	b) fat
c) self- satisfied	d) dress
7. a) lethargic	b) lean
c) calm	d) decent
8. a) carrying	b) childhood
c) youth	d) physically
9. a) biological	b) fauna
10. a) diffrence	b) permission
11. a) imminent	b) occasion
12. Persons	Places
1. prophet	1. colony
2. forester	2. reservoir
3. enviromentalist	3. landscape
4. contractor	4. terrain

13. a) I was going to park, I came across an old friend.

b) I congratulated my friend over the phone right away as I heard of his success.

c) The main goods were shifted first. Then the odds and ends were taken later.

d) He is content with the status quo and does not like change.

14. 1) F 2) E 3) D 4) A

ప్రవేశాలు



నిట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2018-19

దేశవ్యాప్తంగా 30కి పైగా ఎన్ఐటీలు ఉండగా 11 మాత్రమే ఎంసీఏ కోర్సును అందిస్తున్నాయి. ఐటీ రంగంలో స్థిరపడాలనుకుంటున్న వారికి ఎన్ఐటీల్లో ఎంసీఏ కోర్సు చేస్తే బంగారు భవిష్యత్తు సొంతమవుతుంది. ఇందుకు విద్యార్థులు రాయాల్సిన ప్రవేశ పరీక్ష.. నిమ్‌సెట్ (నిట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్). 2018-19 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే నిమ్‌సెట్‌కు ఎన్ఐటీ సూరత్‌కల్ (కర్ణాటక) ప్రకటన విడుదల చేసింది.

నిమ్‌సెట్‌తో ప్రయోజనాలు..

నిమ్‌సెట్‌తో 11 నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీల్లో ఎంసీఏ (మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్) ప్రవేశం లభిస్తుంది. వీటిలో నిట్-వరంగల్ ఒకటి. సాఫ్ట్‌వేర్ నిపుణుడిగా స్థిరపడాలనుకునే వారికి మంచి ప్రత్యామ్నాయం ఎంసీఏ.

ఎన్ఐటీల్లో ఎంసీఏ పూర్తిచేసిన వారు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది.

అర్హత: మ్యాథ్స్ లేదా స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా 60 శాతం మార్కులతో బీఎస్సీ/ బీసీఏ/ బీఎస్సీ ఆనర్స్/ బీసీఏ/ బీటెక్ లేదా బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల సంఖ్య: 805

ఎంసీఏ కోర్సు అందిస్తున్న 11 ఎన్ఐటీల్లో మొత్తం 805 సీట్లు అందుబాటులో ఉన్నాయి. సీట్లన్నీ రాత పరీక్షలో చూపిన ప్రతిభ, రిజర్వేషన్ల ప్రాతిపదికన అఖిల భారత స్థాయిలో భర్తీ చేస్తారు. రాష్ట్ర కోటాలో ప్రత్యేకంగా ఎలాంటి సీట్లు ఉండవు. ఎన్ఐటీ వరంగల్‌లో 46 సీట్లు, అగర్తలా-40, అలహాబాద్-93, భోపాల్-92, కాలికట్-46, దుర్గాపూర్-30, జంషెడ్‌పూర్-92, కురుక్షేత్ర-60, రాయ్‌పూర్-92, సూరత్కల్-92, తిరుచిరాపల్లి-92, కురుక్షేత్ర-30 (సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోర్సులు) సీట్లు ఉన్నాయి.

పరీక్ష విధానం: మల్టిపుల్ చాయిస్ విధానంలో రాత పరీక్ష ఉంటుంది. ప్రశ్నపత్రం ఇంగ్లీష్‌లో మాత్రమే ఉంటుంది. ప్రవేశ పరీక్షలో కనబర్చే ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు ర్యాంకులు కేటాయిస్తారు.

పరీక్షలో నాలుగు విభాగాల్లో మొత్తం 120 ప్రశ్నలు ఉంటాయి. గణితం-50, అనలిటికల్ ఎబిలిటీ-లాజికల్ రీజనింగ్-40, కంప్యూటర్ అవేర్‌నెస్-10, జనరల్ ఇంగ్లీష్- 20 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు.

నెగిటివ్ మార్కింగ్


ప్రతి సరైన సమాధానానికి నాలుగు మార్కులు. నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. ప్రతి తప్పు ప్రశ్నకు 1 మార్కు కోత ఉంటుంది.

ప్రిపరేషన్ :

మ్యాథమేటిక్స్: సెట్ థియరీ, ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్, ఆల్జీబ్రా, కో-ఆర్డినేట్‌జామెట్రీ, కాలిక్యులస్, వెక్టార్స్, ట్రిగ్నోమెట్రీ వంటి అంశాలను సిలబస్‌లో పొందుపరిచారు. ఈ సిలబస్ అంతా ఇంటర్‌లో ఉన్నదే కాబట్టి విద్యార్థులు ఇంటర్ పుస్తకాలను క్షుణ్ణంగా చదవాలి. ఇక ఐఐ జాతీయ స్థాయి పరీక్ష, అప్లికేషన్ ఓరియెంటెడ్‌గా ప్రశ్నలు ఉంటాయి. ప్రాక్టీస్ బాగా చేస్తే మంచి మార్కులు పొందవచ్చు. అకాడమీ పుస్తకాలు చదివితే సన్నద్ధత లభిస్తుంది.

అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్: డేటా అనాలిసిస్, కోడింగ్-డీకోడింగ్, సీక్వెన్సెస్ అండ్ సిరీస్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఈ సెక్షన్ పూర్తిగా అభ్యర్థుల విశ్లేషణ నైపుణ్యాన్ని పరీక్షిస్తాయి.

జనరల్ ఇంగ్లీష్: కాంప్రెహెన్షన్, బేసిక్ గ్రామర్, వొకాబ్యులరీపై ప్రశ్నలు అడుగుతారు. వర్డ్ పవర్, సినానిమ్స్, యాంటోనిమ్స్, టెక్నికల్ రైటింగ్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.



కంప్యూటర్ అవేర్‌నెస్: బేసిక్స్ నాలెడ్జ్‌ను పరీక్షించేలా ప్రశ్నలు వస్తాయి. కంప్యూటర్ బేసిక్స్‌తోపాటు డేటా రిప్రజెంటేషన్ అంశాలపై దృష్టిసారించాలి. ఇంటీజర్స్, ఫ్రాక్షన్స్, బైనరీ- అర్థమెటిక్ ఆపరేషన్స్ కూడా ముఖ్యమైనవే.

ముఖ్య తేదీలు..

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 31 మార్చి, 2018

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2200, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు రూ.1100.

హాల్‌టికెట్ డౌన్‌లోడ్: మే 14 నుంచి మే 25 వరకు.

పరీక్ష తేదీ: 27 మే, 2018 (ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు).

ఫలితాల వెల్లడి: 6 జూన్, 2018

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం: వరంగల్

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: www.nimcet.in

వృద్ధ దంపతుల దారుణ హత్య

ప్రజాశక్తి-గుడివాడ

కృష్ణాజిల్లా గుడివాడలో వృద్ధ దంపతులు దారుణ హత్యకు గురయ్యారు. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇది దోపిడీ దొంగల పనా లేక తెలిసిన వారే ఈ హత్యలు చేశారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రత్యక్ష సాక్షులు కథనం ప్రకారం గుడివాడ రాజేంద్రనగర్ 4వ లైన్‌లో బొప్పన సాయి చౌదరి(72), నాగమణి (67) దంపతులు ఒంటరిగా ఉంటున్నారు. సాయి చౌదరి స్థానికంగా రైస్ మిల్లు నడుపుతున్నారు. అర్ధరాత్రి సమయంలో వారి ఇంటిలోకి కొందరు చొరబడి భార్యభర్తలను అతి దారుణంగా కొట్టి చంపారు. అంతేగాక ఇంటిలో ఉన్న డబ్బులు, నగలతో పాటు ఇంటి ముందు ఉన్న కారు నంబర్ ప్లేటు తొలగించి తీసుకొని వెళ్లారు. ఎస్‌పి సర్వశ్రేష్ఠ త్రిపాఠి, డిఎస్‌పి పి. మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



ప్రత్యేక హోదా ఆందోళనల సమాచారం (విశాఖ రూరల్) ప్రత్యేక హోదా కోసంవిశాఖ జిల్లా అనకాపల్లి పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వికలాంగుల హక్కుల జాతీయ వేదిక, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు.

'సేవ్ పబ్లిక్ సెక్టార్' పుస్తకం వెంకటేష్‌కు అంకితం

ఆవిష్కరించిన సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'సేవ్ పబ్లిక్ సెక్టార్... సేవ్ ఇండియా' పేరిట సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు రచించిన పుస్తకాన్ని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) ప్రయివేటీకరణను నిరసిస్తూ ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ఎం.వెంకటేష్‌కు అంకితం చేశారు. ఈ మేరకు విజయనగరం జిల్లా కేంద్రంలో శనివారం ఆ పుస్తకాన్ని ఆవిష్కరించి వెంకటేష్ తండ్రి నారాయణమూర్తికి నర్సింగరావు అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపకపోవడంతో రూ.6వేల కోట్ల ఆస్తులతో రూ.250కోట్ల పన్ను చెల్లిస్తున్న డిసిఐని కేవలం రూ.28కోట్లకు కేంద్ర మంత్రి గట్కారీ కుమారుడికి కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యాన స్థానిక ఉద్యోగులు, కార్మికులు ఇటీవల 45రోజులపాటు నిరవధిక నిరాహారదీక్షలు చేపట్టారని గుర్తుచేశారు. ఇటువంటి నిరసన, ఆందోళన కార్యాక్రమాల్లో చురుకైన పాత్రపోషించిన వెంకటేష్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గతేడాది డిసెంబర్ 4న ఆత్మహత్య రూపంలో ప్రాణత్యాగం చేశాడన్నారు. అయినా ప్రభుత్వం వెనక్కి తగ్గకపోవడంతో ఏప్రిల్ 5న స్టీల్‌ప్లాంట్ నుంచి సేవ్ పబ్లిక్ సెక్టార్ అనే నినాదంతో వేలాది మందితో లాంగ్‌మార్చ్ నిర్వహించేందుకు సిఐటియు నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో వెంకటేష్ త్యాగానికి చిహ్నంగా ఆయన విగ్రహాన్ని విశాఖలోగల డిసిఐ వద్ద ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

హిందీ ప్రశ్నాపత్రం లీక్ కలకలం

ప్రజాశక్తి - నగరి/పశ్చిమగోదావరి

చిత్తూరు జిల్లా నగరిలో పదో తరగతి హిందీ ప్రశ్నాపత్రం లీక్ అయినట్లుగా సోషల్ మీడియాలో హల్‌చల్ చోటు చేసుకుంది. అయితే జిల్లా డిఇఒ పాండురంగారావు ఈ విషయాన్ని కొట్టేశారు. జిల్లాలో ఎక్కడా ప్రశ్నాపత్రం లీక్ కాలేదని, లెక్కకు సరిపడా ఉన్నాయని వివరణ ఇచ్చారు. నగరిలో లీకయినట్లు పుకర్లు రావడంతో జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు విచారణకు ఆదేశించారు. విచారణచేపట్టి పుకార్లేనని తేల్చారు. పశ్చిమగోదావరిజిల్లా నరసాపురం మండలంలో ఇద్దరు విద్యార్థులపై అధికారులు మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశారు. ఎల్‌బి చర్ల పరీక్షా కేంద్రంలో శనివారం నిర్వహించిన పదో తరగతి హిందీ పరీక్షలో ఇద్దరు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు ఎంఇఒ పి.పుష్పరాజ్యం తెలిపారు. ఏలూరు నుంచి వచ్చిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వీరిపై కేసులు నమోదు చేశారని ఎంఇఒ చెప్పారు.

ముఖ్యమంత్రి హామీతో న్యాయవాదుల దీక్షలు విరమణ

ప్రజాశక్తి - కర్నూలు లీగల్/కడప

రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సుముఖంగా ఉన్నామని, ఇందుకు సంబంధించి కేంద్రానికి, సుప్రీం కోర్టుకు లేఖలు రాసి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం శాసనమండలిలో చెప్పారు. దీంతో కర్నూలు న్యాయవాదులు శనివారం దీక్షలను విరమించారు. రాయలసీమ న్యాయవాదుల జెఎసి పిలుపు మేరకు 56 రోజుల నుంచి రిలే నిరహార దీక్షలకు స్పందించి సీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించడంతో న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేష్, కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి దీక్షల్లో కూర్చున న్యాయవాదులకు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల దీక్షలు న్యాయ బద్ధమైనవని అసెంబ్లీలో కూడా మాట్లాడామన్నారు. మంత్రి కాల్వశ్రీనివాసులు సహకారంతో సిఎంను శాసన మండలిలో ప్రకటన వచ్చే విధంగా కృషి చేశామని చెప్పారు. టిజి వెంకటేష్ మాట్లాడుతూ.. కర్నూలులో బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు.

కడపలో 53వ రోజుకు చేరిన దీక్షలు

రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 53వ రోజుకు చేస్తున్నారు. దీక్షలకు మద్దుతుగా న్యాయవాదుల గుమస్తాలు 20 మంది రిలే దీక్షలకు కూర్చున్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. ఈ నెల 16న బంద్రభన్‌లో (మహారాష్ట్ర)
2. ఇంటర్‌నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఎటిఎ)
3. 120 మిలియన్ డాలర్లు
4. టిబి
5. ఎ ఎం ఖన్విల్కార్

వెనుకబడిన ప్రాంతాల

అభివృద్ధి, హోదాలపై బాబు నాటకాలు

- తెలుగు ప్రజల ఆత్మగౌరవ పోరాటాన్ని అన్ని పార్టీలతో కలిసి చేస్తాం
- సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్ల, ప్రత్యేక హోదా పట్ల టిడిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని, నిజాయితీ లేదని, సిఎం చంద్రబాబు నాయుడు చర్యలన్నీ నాటకాలేనని సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి శ్రీనివాసరావు విమర్శించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవ పోరాటాన్ని అన్ని పార్టీలతో కలిసి చేపడతామని ఆయన అన్నారు. శనివారం సుందరయ్య భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్టానికి ప్రత్యేక హోదా కోసం కేంద్రంతో పోరాడుతుంటే ఇతర పార్టీలు అడ్డంకులు కల్పిస్తున్నాయని చెబుతున్న చంద్రబాబు మొదటి నుండి హోదా, ప్రకాశం జిల్లా వెనుకబాటుపై పోరాడుతున్న సిపిఎం నాయకులను జైల్లో ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. దీనిలో మీ నిజాయితీ ఏమిటన్నారు. బాబుకు నిజాయితీ ఉంటే అన్ని పార్టీలను కలుపుకొని ఢిల్లీపై ఉద్యమించాలన్నారు. ఉద్యమిస్తున్న వారికి మద్దతివ్వాలన్నారు. దీనికి బదులు పోరాడుతున్న వారిని జైలుకు పంపుతున్నారని దుయ్యబట్టారు. కేంద్రంపై హోదా విషయంలో ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. కేంద్రంపై పోరాడటానికి రాష్ట్ర ప్రజలను కూడగట్టడానికి అఖిలపక్ష సమావేశం ఎందుకు ఏర్పాటు చేయడంలేదని ప్రశ్నించారు. కేంద్రంపై రాబోయే కాలంలో అన్ని పార్టీలతో కలిసి తెలుగు ప్రజల ఆత్మగౌరవ పోరాటాన్ని తాము చేపడ తామని, ఆ పోరాటంలో అంతర్భాగంగానే ప్రకాశం జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ కోసం పోరాటం చేస్తామన్నారు. శాసనసభలో ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా తీర్మానం చేయాలని ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన జిల్లాగా ప్రకటించి రూ.10వేల కోట్లు ప్యాకేజీ ఇవ్వాలని కలెక్టర్‌ను కలిసి ప్రభుత్వం ద్వారా తీర్మానించు కునేందుకు వెళ్ళిన నాయకులను జైలుకు పంపడం దుర్మార్గమన్నారు.



ఉద్యమకారులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

జైలు నుంచి ఉద్యమకారుల విడుదల

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్: సబ్‌జైలులో రిమాండ్‌లో ఉండి బెయిల్ పై బయటికి వచ్చిన 50 మంది సిపిఎం నేతలకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. సబ్‌జైలు నుండి బయటికి వచ్చిన 50 మంది సిపిఎం నేతలకు సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి శ్రీనివాసరావు, ఇతర నాయకులు పూలమాలలు వేసి స్వాగతం పలికారు. సబ్‌జైలు నుండి భారీ ప్రదర్శనగా చర్చిసెంటర్, ట్రంక్‌రోడ్డు, మస్తాన్‌దర్గా సెంటర్, అద్దంకి బస్టాండ్ , కర్నూల్‌రోడ్డు , సాగర్‌హోటల్ సెంటర్ రోడ్డు మీదగా సుందరయ్య భవన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. నాయకులపై అక్రమ అరెస్టులను నిరసిస్తూ నినాదాలు చేశారు. జిల్లా అభివృద్ధి చేయాలని నినదించారు. సుందరయ్య భవన్‌లో రిమాండ్‌కు వెళ్ళిన 50 మంది పోరాట యోధులను పరిచయం చేశారు. జిల్లా ప్రజల ఆకాంక్షను తెలియజేయడానికి ప్రయత్నిస్తే అరెస్ట్ చేస్తారా అని సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి శ్రీనివాసరావు ప్రశ్నించారు. ప్రజాసమస్యలపై పోరాడి జైలుకెళ్లిన ప్రజా ఉద్యమకారులే అసలైన హీరోలని ఆయన అన్నారు. జిల్లా కార్యదర్శి పి. ఆంజనేయులు మాట్లాడారు.

తాత్కాలికంగా జూడాల సమ్మె విరమణ

గడువులోగా హామీలు నెరవేర్చకపోతే మళ్లీ సమ్మె

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో గడువు కోరినందున ప్రజల ఆరోగ్యం దృష్ట్యా తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నట్లు జూనియర్ వైద్యులు ప్రకటించారు. శనివారం జూనియర్ డాక్టర్లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి, హెల్త్ సెక్రెటరీ, డిఎంఇల సమక్షంలో తమ న్యాయమైన డిమాండ్ల గురించి చర్చలు జరిగాయన్నారు. డిమాండ్లు నెరవేర్చేందుకు గడువు కోరడంతో ప్రజారోగ్యం, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు దృష్ట్యా తాత్కాలికంగా సమ్మె విరమించాలని నిర్ణయించామన్నారు. ఎంబిబిఎస్, పిజి పూర్తయిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని, సర్వీసును వాలంటరీ చేయాలనే డిమాండ్లను మార్చి 31లోపు తీరుస్తామని హామీ ఇచ్చారన్నారు. 2018 పెంపుదలను మాత్రం ఏప్రిల్ 30 కంతా ఫైనల్ చేస్తామని మాటిచ్చారన్నారు. గడువు ప్రకారం మా ప్రధాన డిమాండ్లు నెరవేరే వరకు వేచి చూస్తామన్నారు. లేని పక్షంలో మళ్లీ సమ్మెలోకి దిగుతామని జూడాలు హెచ్చరించారు.

ప్రజలను మభ్యపెడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి - మద్దిలపాలెం, విశాఖ/గుంటూరు

రాష్టానికి ప్రత్యేక హోదాపై బిజెపి మాట తప్పగా రాష్ట్రంలోని టిడిపి పొంతనలేని మాటలతో మభ్యపెట్టి ప్రజల ఉసురు పోసుకున్నాయని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు విమర్శించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. హోదా వద్దు, ప్యాకేజీ ముద్దు అని, హోదా కోసం యువత ఉద్యమిస్తే జైలుకే అని చెప్పిన సిఎం చంద్రబాబు నేడు బిజెపి మోసం చేసిందని మాట్లాడ్డం విడ్డూరంగా ఉందన్నారు. ఏ పార్టీల మద్దతుతో టిడిపి అధికారంలోకి వచ్చిందో వారే ఇప్పుడు చంద్రబాబు నైజాన్ని ప్రశ్నిస్తూ దూరమయ్యారని ఎద్దేవా చేశారు. రాష్టానికి ప్రత్యేక హోదా కోసం జగన్ తొలి నుండీ డిమాండ్ చేస్తున్నారని, ఆయన చేపట్టిన సంగ్రామం నేడు మహాసంగ్రామంగా మారి చంద్రబాబును కదిలించిందని అన్నారు.

ఉద్యమాలను నీరుగార్చే ప్రయత్నం చేస్తోంది : బొత్స

ఇంత వరకు బిజెపికి మిత్ర పక్షంగా వ్యవహరించిన టిడిపి ఉద్యమాలను నీరుగార్చే ప్రయత్నాలు చేసిందని ఆ పార్టీ నాయకుడు బొత్స విమర్శించారు. శనివారం నగర వైఎస్‌ఆర్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవహారం ద్వారా ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షను తెలియజేయడానికి అన్ని రాజకీయ, ప్రజాసంఘాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు.

పోస్టులు భర్తీ చేయాలని వెటర్నరీ విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి - గాంధీనగర్ (విజయవాడ)

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఎపి వెటర్నరీ స్టూడెంట్స్ అండ్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన విజయవాడ ధర్నా చౌక్ వద్ద శనివారం ధర్నా చేపట్టారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెవివి ప్రసాద్, కృష్ణా జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి యలమర్ధనరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జరీ అసోసియేషన్ అధ్యక్షుడు వసంతరాయులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖను బలోపేతం చేస్తామని చెబుతున్న ప్రభుత్వం దానికనుగుణంగా రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్లను (ఆర్‌ఎల్‌యు) అప్‌గ్రేడ్ చేసి వెటర్నరీ వైద్యులను యుద్ధప్రాతిపదికన నియమించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 250 ఆర్‌ఎల్‌యులున్నాయని వాటిలో పశువైద్యులు లేకపోవడంతో సీజనల్ వ్యాధులు సంక్రమించి సకాలంలో వైద్యం అందక మూగ జీవాలు మృతిచెందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు మహేంద్రబాబు, యశ్వంత్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న విద్యార్థులు

మేమే హీరోలం

పవన్ వ్యాఖ్యలపై బాలకృష్ణ స్పందన

ప్రజాశక్తి-హిందూపురం టౌన్

ఎవరెవరో, ఏవేవో విమర్శలు చేస్తుంటారని.. వాటిని తాము పట్టించుకుని పవన్‌కళ్యాణ్‌పై తానేదో మాట్లాడి ఆయన్ను హీరోను చేయడం ఇష్టంలేదన్నారు. ఇప్పటికీ, ఎప్పటికీ తామే హీరోలమని నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్ భారీగా అవినీతికి పాల్పడ్డారన్న పవన్ వ్యాఖ్యలపై టిడిపి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శనివారం అనంతపురం జిల్లా హిందూపురంలో స్పందించారు. హిందూపురం నియోజకవర్గంలో మూడురోజుల పర్యటనలో భాగంగా ఎంజిఎం మైదానంలో రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణ ఆయన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి అభివృద్ధి ఒక్కటే అజెండా అన్నారు. తొలుత పట్టణంలో ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు బాలాజీ కొత్తగా నిర్మించిన బాలాజీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. ఎంజిఎం క్రీడా మైదానంలో ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బాలకృష్ణ నివాసం వద్ద లబ్ధిదారులకు రూ.5.30 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధిని అందించారు. ఈ కార్యక్రమాలలో పాల్గొన్న బాలయ్య అభివృద్ధి, సంక్షేమం అజెండాగా చేసుకొని పట్టణాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మి, కమిషనర్ భాగ్యలక్ష్మి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జెఇ వెంకటస్వామి, వైస్ ఛైర్మన్ జెపికెరాము, నంబూరి సతీష్, అంబికా లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణ కోసం ఉద్యమం

దేశంలో భావప్రకటన స్వేచ్ఛపై దాడి : ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

తెలుగుభాష పరిరక్షణ విషయంలో తెలుగు వారంతా ఐక్యతా స్ఫూర్తితో ఉద్యమించాలని ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ ఎంవిఎస్ శర్మ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని కొరటాల మీటింగ్ హాల్‌లో ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఉగాది ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభ ఎడిషన్ మేనేజర్ జి శివరామకృష్ణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. కోసూరి రవికుమార్ 'వాళ్ల నడుస్తున్నారు' కవితకు ప్రథమ బహుమతి, ఈతకోట సుబ్బారావు 'ఇంకా ఉగాది పచ్చడెందుకని?' కవితకు, ప్రొఫెసర్ ఇ శ్రీనివాసరెడ్డి 'మహాభినిష్క్రమణ'కవితకు ద్వితీయ బహుమతి, శకుంతల కొండపర్వ 'మట్టి తనువులు' కవితకు, ఎస్ఎం సుభాని 'సహజీవన సౌధం' కవితకు తృతీయ బహుమతులను అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ ఈ దేశంలో దేశభక్తిని ప్రతిక్షణం రుజువు చేసుకోవాల్సిన దారుణమైన పరిస్థితులున్నాయని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛాజీవనాన్ని నియంత్రించడం మంచి పరిమాణం కాదన్నారు. ప్రజల అభిప్రాయాన్ని వ్యక్తంచేసే హక్కు మీద దాడి జరుగుతోందని, భావప్రకటన స్వేచ్ఛను హరించివేస్తున్నారని తెలిపారు. ఆఫ్రికా, అమెరికాలలో వివక్షతను పోరాటాల ద్వారా అడ్డుకున్నారని, కానీ ఈ దేశంలో స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా కులవివక్షపోలేదన్నారు. కవులు, రచయితలు కులవివక్షకు వ్యతిరేకంగా రచనలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీ రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ వై అచ్యుతరావు, సిపిఎం తూర్పు, పశ్చిమ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, గద్దె చలమయ్య, కవులు, రచయితలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మొదటి బహుమతి గ్రహీతను సన్మానిస్తున్న ఎంవిఎస్ శర్మ

నూకాంబిక అమ్మవారికి పట్టు వస్త్రాలు

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్

విశాఖజిల్లాలో అనకాపల్లి నూకాంబిక అమ్మవారికి శనివారం రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రశేఖర్, చింతకాయల అయ్యన్నపాత్రుడు పట్టువస్త్రాలు సమర్పించారు. వీరికి అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.10 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కొత్త అమావాస్య జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఆకట్టుకుంటున్న నంది నాటకాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. కాకినాడ దంటు కళాక్షేత్రంలో శనివారం ప్రదర్శించిన కన్యాశుల్కం నాటకం ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. ది యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్‌లో నంది నాటకోత్సవాలు ఏడు రోజులుగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం ఆంధ్ర సాహిత్య నత్య నాటక అకాడమీ సమర్పణలో గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం సాంఘిక నాటకం రాజేంద్రప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించారు. నటరాజ ఆర్ట్స్ సమర్పణలో గోపి, సత్య ప్రకాష్ రచించిన సిరి గంధం సాంఘిక నాటకం అందరి మన్ననలూ పొందారు. చైతన్య కళా స్రవంతి సమర్పణలో స్నిగ్ధ రచించిన ఈ సూర్యుడు సాంఘిక నాటకం పి.బాలాజీ నాయక్ దర్శకత్వంలో ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించారు. రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. శనివారం తొలి ప్రదర్శనగా పి.చిరంజీవులు రచించిన, కె.రాజు దర్శకత్వంలో కళాంజలి భిలాయ్ వారి ఆధ్వర్యాన విజన్ 420 సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. మధ్యాహ్నం 2 గంటలకు బండారు దేవరాజ్ రచన, దర్శకత్వంలో చైతన్య కళాభారతి కరీంనగర్ వారి ఆధ్వర్యాన మా ప్రేమకు న్యాయం కావాలి సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు.

విగ్రహాల కూల్చివేతకు నిరసనగా 24న ప్రదర్శన

దళిత, గిరిజన, ప్రజాసంఘాల ఐక్య వేదిక పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంబేద్కర్, పెరియార్, లెనిన్ విగ్రహాల కూల్చివేతకు నిరసనగా ఈనెల 24న విజయవాడలో ప్రదర్శన నిర్వహించనున్నట్లు దళిత, గిరిజన, ప్రజాసంఘాల ఐక్య వేదిక వెల్లడించింది. శనివారం ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దనున్న అంబేద్కర్ విగ్రహం నుంచి లెనిన్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన జరుగుతుందని, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వర్గ సామాజిక తత్వవేత్తలు, ప్రపంచ మేధావులైన లెనిన్,అంబేద్కర్, పెరియార్‌ల విగ్రహాల్ని ధ్వంసం చేయడం అమానుషమన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదంతో రెచ్చిపోతున్నాయని, ఇవి అభివృద్ధి నిరోధక శక్తులని పేర్కొన్నారు. అశాంతిని రేపుతూ, ప్రజల మధ్య కలహాల్ని సృష్టిస్తూ దేశాన్ని అల్లకల్లోలం చేస్తున్నాయని, ఈ దుర్మార్గాల్ని ఖండిస్తున్నామన్నారు. వీటిని అరికట్టాలని, దుర్మార్గాలకు పాల్పడుతున్న మనువాద, మతోన్మాద శక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గొట్టిపాడు దళితులపై దాడిచేసిన ప్రధాన ముద్దాయిల్ని తక్షణమే అరెస్టు చేయాలని, ఈ కేసును సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేదిక కన్వీనర్లు ఆంద్రమాల్యాద్రి, కరవది సుబ్బారావు, మేళం భాగ్యారావు, సిరిపురపు గ్రిటన్, ఆది శేషారావు, అంకయ్య, బుట్టి రాయప్ప, సిహెచ్ విజయ్ సమావేశంలో పాల్గొన్నారు.

జెఎన్‌టియుకె రిజిస్ట్రార్ ఛాంబర్ ఎదుట మాజీ ఉద్యోగిని మౌనదీక్ష

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జెఎన్‌టియుకె) రిజిస్ట్రార్ ఛాంబర్ ఎదుట ఉద్వాసనకు గురైన కాంట్రాక్టు ఉద్యోగిని శనివారం మౌనదీక్ష చేపట్టారు. 2012లో అప్పటి రిజిస్ట్రార్ ప్రసాద్ పరీక్షల అధికారి రవీంద్ర ఇచ్చిన నివేదిక అధారంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో 18 మంది ఎక్కువగా ఉన్నారని తొలగించారు. తొలగించిన వారిలో కొంతమంది కోర్టును ఆశ్రయించారు. కొత్త ఉద్యోగాలు ఇచ్చేముందు తొలగించిన వారికి ప్రాధాన్యతనివ్వాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలు అమలు కావడంలేదని విజయకుమారి శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తొలగించిన వారిలో ఒకరిద్దరికి ఉద్యోగం ఇచ్చి తనకు మాత్రం రేపు, ఎల్లుండి ఉద్యోగం ఇప్పిస్తానంటూ రిజిస్ట్రార్ వివి సుబ్బారావు ఆరు నెలలుగా తిప్పించుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దళితతేజం పేరిట వాడవాడలా పర్యటనలు నిర్వహిస్తుంటే, జెఎన్‌టియులో దళిత మహిళకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. తనకు ఉద్యోగం ఇచ్చేవరకూ న్యాయపోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. అనంతరం అధికారులు సర్ధిచెప్పడంతో ఆందోళన విరమించారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం ఆరువేలివ్వాలి

ప్రజాశక్తి - నెల్లూరు

పదేళ్లుగా గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, పసిపిల్లల సంరక్షణ కోసం ఆశా వర్కర్లు కృషి చేస్తున్నారని, వారికి కనీస వేతనం రూ.6వేలు ఇవ్వాలని శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ దుగ్గిరాల అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. నెల్లూరు సిఐటియు కార్యాలయంలో శనివారం ఆశా వర్కర్ల సదస్సు జరిగింది. దీనికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆశా వర్కర్లు ఆస్పత్రిలో కాన్పులు జరిగేలా చూడడం, కుటుంబ నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత వంటి పనులు చేస్తున్నారన్నారు. మలేరియా, క్షయ, ఎయిడ్స్ వంటి రోగులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని తెలిపారు. కేరళ, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, హర్యానా, త్రిపుర రాష్టాల్లో కేంద్ర పారితోషికంతో పాటు రాష్ట్ర పారితోషికం కూడా అందిస్తున్నారన్నారు. వారికి ఇపిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు, యూనిఫాం, అలవెన్స్‌లను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎఎన్ఎం శిక్షణ పొందిన వారిని రెండో ఎఎన్ఎంగా తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.లక్ష్మీ, కె.విజయలక్ష్మీ, వసుంధర, నిర్మల, భాగ్యరేఖ, ఆనందమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

వరికి మద్దతు ధరకై ఐక్యవేదిక డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

వరికి మద్దతు ధరను నిర్ణయించాలని నెల్లూరు జిల్లా రైతాంగ ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. మద్దతు ధరపై శనివారం నెల్లూరు సిఐటియు కార్యాలయంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులిగండ్ల శ్రీరాములు మాట్లాడుతూ.. బహిరంగ మార్కెట్లో గిట్టుబాటు ధర లేని సందర్భంలో ప్రభుత్వమే కనీస మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బిపిటి, మసూరి వరి రకాన్ని, సూపర్‌ఫైన్ రకంగా గుర్తించి క్వింటాల్ ధాన్యానికి రూ.300 ధర చొప్పున బోనస్ ఇచ్చిపుట్టి ధాన్యాన్ని రూ.16వేలకు కొనుగోలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులివ్వాలని డిమాండ్ చేశారు. తెలుగురైతు జిల్లా మాజీ అధ్యక్షులు సుందర రామిరెడ్డి మాట్లాడుతూ ధాన్యానికి గిట్టుబాటుధర లేకపోవటం దురదుష్టకరమన్నారు. రైతుసంఘం నాయకులు సిహెచ్ కోటిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది ప్రారంభంలోనే ధాన్యం ధరలు తక్కువతో ప్రారంభమైయ్యాయన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ భూసేకరణ పేరుతో 3పంటలు పండే భూములు సైతం బలవంతంగా తక్కువ నష్ట పరిహారంతో ప్రభుత్వం లాక్కోవడం అన్యాయం అన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు నడుం బిగించండి : కారెం శివాజీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించి ముందుకు సాగాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో బిఎస్ఎన్ఎల్ ఎస్‌సి, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఐదో మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దేశంలో కుల వివక్ష రూపుమాపటానికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఈనాడు మహిళలు అన్ని రంగాలలో రాణించటానికి కారణం అంబేద్కర్ అని, మహిళలకు ఓటు హక్కు కల్పించాలని కోరిన తొలి వ్యక్తి ఆయనేనని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించి భూసమస్యలు కాని, దాడులు కేసులు తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఒంగోలు ఎన్ఎస్‌పి అతిథి గృహంలో ఎస్‌సి, ఎస్‌టిల నుండి సమస్యలపై అర్జీలను స్వీకరించారు.

సెక్యూరిటీగార్డుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-శ్రీకాకుళం సిటీ

పాలకులు, ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం వీడి, సమ్మెలో కొనసాగుతున్న రిమ్స్ సెక్యూరిటీగార్డుల సమస్యలను పరిష్కరించాలని పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని రిమ్స్ ఆవరణలో రిమ్స్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు డి.గణేష్ అధ్యక్షతన శనివారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు మాట్లాడుతూ సెక్యూరిటీగార్డులకు బకాయి పడిన, కోత విధించిన వేతనాలను చెల్లించి పిఎఫ్, ఇఎస్ఐ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.నర్సింహులు మాట్లాడుతూ వేతనాలు చెల్లించని జై బాలాజీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసు మాట్లాడారు.

బ్యాంకులు నిబంధనలు ఉల్లంఘించాయి

విజయమాల్యా కేసులో లండన్ కోర్టు

లండన్ : లిక్కర్ దిగ్గజం విజయమాల్యాకు రుణాల ఇచ్చే విషయంలో భారతీయ బ్యాంకులు నిబంధన లను ఉల్లంఘించాయని లండన్ కోర్టు న్యాయమూర్తి చెప్పారు. లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ మెజిస్ట్రేట్ కోర్టు విజయమాల్యా కేసుపై విచారణ జరుపుతున్నది. న్యాయమూర్తి ఎమ్మా అర్బుథ్నాట్ ఈ కేసుపై వ్యాఖ్యానిస్తూ, తొలుత పజిల్‌లా కనిపించిన ఈ కేసులో వివిధ సాక్ష్యాలను సమన్వయం చేసి చూడగా స్పష్టత వచ్చిందని అన్నారు. కొన్ని నెలల క్రితం కన్నా ఇప్పుడు కేసుపై మరింత స్పష్టత వచ్చిందన్నారు. కొన్ని రుణాలను మంజూరు చేయడంలో బ్యాంకులు తాము రూపొందించుకున్న మార్గదర్శకాలను ఉల్లంఘించాయని ఆమె పేర్కొన్నారు.

ప్రమాదం

బీహార్‌లో సీతారామర్హి జిల్లాలో శనివారం జరిగిన బస్సు ప్రమాదంలో 12 మంది మృతి చెందగా, 40 మంది గాయపడ్డారు. భనస్పత్తి గ్రామంలో అదుపు తప్పిన బస్సు కాలవలో పడిపోయింది.



కర్నాటకలో నకిలీ కరెన్సీ జోరు

- బంగ్లా సరిహద్దు నుంచి ఎగుమతి
- ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి ప్రతినిధి-బెంగళూరు

కర్నాటకలో ప్రత్యేకించి దక్షిణ భారతదేశంలో నకిలీ కరెన్సీ హల్‌చల్‌చేస్తోంది. రూ.2000, రూ.100 కొత్తగా ప్రవేశపెట్టిన రూ.200 నకిలీ నోట్లు మార్కెట్‌లో జోరుగా చెలామణి అవుతున్నాయి. నకిలీ కరెన్సీని మార్కెట్‌లోకి పంపిణీ చేస్తున్న ముగ్గురిని కర్ణాటక పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. అయితే నకిలీ నోట్ల చెలామణికి పూర్తిగా కళ్ళెం వేసేందుకు కర్ణాటక పోలీసులు ప్రయత్నిస్తున్నారు. జాతీయ అంతర్గత భద్రత సంస్థ ఆదేశాల మేరకు ముంబయి పోలీసులు కూడా కర్ణాటక పోలీసులకు తమ సహకారాన్ని అందిస్తున్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగేందుకు ఇంకా ఎంతో సమయం లేనందున నకిలీ నోట్లకు బాగా డిమాండ్ పెరిగింది. కాగా పోలీసులు అరెస్టు చేసిన వారిలో దాల్మియా ఇస్లామ్ మాట్లాడుతూ కోల్‌కతా నుంచి నకిలీ నోట్లు తెచ్చినట్లు అంగీకరించాడు. బంగ్లా సరిహద్దు నుంచి నోట్లను ఎగుమతి చేస్తున్నట్లు తెలిపాడు. అంతకుముందు పంజాబ్, రాజస్థాన్ సరిహదుల నుంచి నకిలీనోట్లు భారత్‌లకి ప్రవేశించేవి. ఇప్పుడు బంగ్లా సరిహద్దు నుంచి భారత్‌లోకి ప్రవేశిస్తున్నాయి. భారత్-పాకిస్తాన్ సరిహద్దును పూర్తిగా మూసివేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రముఖ రాజకీయ నేతలున్న కర్ణాటకలోని అన్ని జిల్లాల్లోనూ నకిలీ నోట్లు ఇప్పటికే ప్రవేశించాయని పోలీసు ఇంటెలిజెన్స్ విభాగం తెలిపింది. నకిలీ నోట్లను మార్చేందుకు కొంతమంది ఏజెంట్లు కూడా సిద్ధమయ్యారని పేర్కొంది.

నీరవ్‌కు 'మహా' షాక్..

250 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్న రైతులు



ముంబయి: పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)కు దాదాపు రూ.12 వేల కోట్ల రుణాలు ఎగ్గొట్టిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీకి ఊహించని షాక్ తగిలింది. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాలో ఆయన కంపెనీ పేరిట ఉన్న 250 ఎకరాల భూమిని రైతులు స్వాధీనం చేసుకున్నారు. తమను బెదిరించి అతి తక్కువ ధరకే ఈ భూమిని నీరవ్ సొంతం చేసుకున్నాడని వారు ఈ సందర్భంగా తెలిపారు. దాదాపు 200 మంది రైతులు ఎడ్ల బండ్లపై అహ్మద్‌నగర్‌లోని ఖండాలా ప్రాంతానికి శనివారం చేరుకున్నారు. అక్కడ నీరవ్ పేరిట ఉన్న భూమిని ట్రాక్టర్‌తో దున్నారు. ఈ భూమినంతా సాగు చేయనున్నట్లు రైతులు తెలిపారు. ఎకరా రూ.20 లక్షలు ధర పలికే భూమిని నీరవ్ కేవలం రూ.15 వేలకే సొంతం చేసుకున్నాడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. పీఎన్‌బీ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్ చేసిన ఆస్తుల్లో ఈ భూమి కూడా ఉండటం గమనార్హం.

సమాజ్‌వాది లో 'యోగి' మంత్రి అల్లుడు

లక్నో: ఇటీవలి ఉప ఎన్నికల్లో పరాజయాలతో తల బొప్పికట్టించుకున్న యుపి అధికార పార్టీ బిజెపికి తాజాగా మరో ఎదురు దెబ్బ తగిలింది. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంలో మంత్రిగా వున్న స్వామి ప్రసాద్ మౌర్య అల్లుడు నావల్ కిషోర్ శనివారం నాడు సమాజ్‌వాది పార్టీలో చేరారు. పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, మరో అగ్రనేత అజంఖాన్‌ల సమక్షంలో ఆయన సమాజ్‌వాది తీర్థం పుచ్చుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గతంలో బిఎస్పీలో ఒబిసి నేతగా ఎదిగిన స్వామి ప్రసాద్ మౌర్య 2016 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిజెపిలో చేరి ఘన విజయం సాధించారు. ప్రస్తుతం ఆయన యోగి మంత్రివర్గంలో కార్మిక, సర్వీస్ ప్లానింగ్, పట్టణ ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలన శాఖలను నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక ప్యాకేజి ఇవ్వండి

ప్రధానిని కోరనున్న త్రిపుర సిఎం

అగర్తలా : త్రిపుర ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్ త్వరలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజ్‌ను కోరనున్నారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకుని నిలబడేందుకు ప్రత్యేక ప్యాకేజ్ కావాలని మోడీని కోరనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రణజిత్ సింగ్ రాయ్ ఇక్కడ విలేకరులకు తెలిపారు. మోడీతో పాటు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కూడా కలిసి ఇదే ప్రతిపాదనలు చేయనున్నారని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శుక్రవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో విస్తృత చర్చ జరిగిందని రాయ్ చెప్పారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నదన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,588.19 కోట్ల ఆర్థిక లోటును రాష్ట్రం ఎదుర్కొంటున్నదని ఆయన చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మూడు రోజుల్లో సమగ్ర నివేదికను అందచేయాలని ఆర్థిక శాఖ అధికారులను కోరినట్లు చెప్పారు.

పంజాబ్ ఆప్‌లో తీవ్రమైన సంక్షోభం

- కేజ్రీవాల్ క్షమాపణలపై ఎమ్మెల్యేల అసంతృప్తి

చండీగఢ్ : పంజాబ్ ఆమ్ ఆద్మి పార్టీ (ఆప్)లో సంక్షోభం తీవ్రతరమైంది. పంజాబ్ రాష్ట్ర ఆప్ అధ్యక్షుడు భగవంత్ మన్, కో ప్రెసిడెంట్ అమన్ అరోరాలు తమ పదవులకు రాజీనామా చేశారు. పంజాబ్‌లో ఆప్‌కు మిత్ర పక్షమైన లోక్ ఇన్సాఫ్ పార్టీ (ఎల్‌ఐపి) సంబంధాలు తెంచుకోవాలని నిర్ణయించింది. పంజాబ్ మాజీ మంత్రి, శిరోమణి అకాలీదళ్ నేత విక్రమ్ సింగ్ మజీథియాకు ఆప్ అధ్యక్షుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ క్షమాపణ చెప్పిన మరుసటి రోజు నుంచి పంజాబ్ ఆప్‌లో వరుస పరిణామాలు చోటు చేసుకున్నాయి. మజీథియా మాదక ద్రవ్యాల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడంటూ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తడంతో ఆయన క్షమాపణ చెప్పారు. మజీథియాకు కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పడం ఆయన మానసిక బలహీనతను, లొంగు బాటును వెల్లడిస్తోందని పంజాబ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, ఆప్ ఎమ్మెల్యే సుఖపాల్ సింగ్ ఖైరా శుక్రవారం వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పడాన్ని పార్టీ ఎమ్మెల్యేలు తీవ్రంగా ఖండించారు. కేజ్రీవాల్ క్షమాపణ చెప్పకుండా ఉండాల్సిందని తాము భావిస్తున్నామన్నారు. సీనియర్ పార్టీ సభ్యులతో శుక్రవారం సమావేశమైన తరువాత పార్టీ నేత కన్వర్ సంధు మాట్లాడుతూ కేజ్రీవాల్ క్షమాపణలు చెప్పడంతో తలెత్తిన పరిస్థితులపై చర్చించినట్లు చెప్పారు.

భారత్-పాక్ మధ్య ముదురుతున్న

దౌత్య 'వేధింపుల' వివాదం

- హైకమిషనర్ ఉపసంహరణపై పాక్ మీడియా కథనాలు
- డబ్ల్యుటిఓ భేటీ బహిష్కరణ



సొహైల్ మెహ్మూద్

న్యూఢిల్లీ/ఇస్లామాబాద్: భారత్-పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న దౌత్యవేత్తల వేధింపుల వివాదం క్రమంగా ముదురుతోంది. భారత్‌లో తమ హైకమిషనర్‌ను ఉపసంహరించుకోవాలని పాక్ ప్రభుత్వం నిర్ణయించినట్లు పాక్ మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించింది. ప్రస్తుతం స్వదేశంలోనే వున్న భారత్‌లో పాక్ హైకమిషనర్ సొహైల్ మెహ్మూద్‌ను తిరిగి భారత్ పంపేందుకు పాక్ వ్యతిరేకిస్తున్నదని ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ పత్రిక తన వార్తా కథనంలో పేర్కొంది. రెండు దేశాల మధ్య పరిస్థితి చక్కబడే వరకూ మెహ్మూద్ స్వదేశంలోనే వుంటారని ఈ పత్రిక తెలిపింది. భారత్‌లో తమ దౌత్య వేత్తలను వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఈ అంశంపై చర్చించేందుకు రెండు రోజుల క్రితం పాకిస్తాన్ ప్రభుత్వం ఢిల్లీలోని తమ హైకమిషనర్‌ను వెనక్కి పిలిపించుకున్న విషయం తెలిసిందే. కాగా భారత విదేశాంగశాఖ మాత్రం ఈ వివాదాన్ని కొట్టిపారేస్తూ ఇది చాలా చిన్న విషయమని, దీని కోసం హైకమిషనర్‌ను ఉపసంహరించుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పాక్‌లోని భారత హైకమిషనర్ యధావిధిగా కొనసాగుతారని విదేశాంగశాఖలోని సీనియర్ అధికారి ఒకరు మీడియాకు చెప్పారు. పాక్ హైకమిషనర్ మెహ్మూద్ శుక్రవారం నాడు న్యూఢిల్లీ నుండి తమ దేశానికి చేరుకున్నారు. సమీప భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య సంబంధాలు చక్కబడకపోతే పాకిస్తాన్ తమ దౌత్య సిబ్బందిని, వారి కుటుంబాలనూ ఉపసంహరించుకునే అవకాశం వుందని పాక్ దౌత్య వర్గాలు తెలిపాయి.

డబ్ల్యుటిఓ భేటీ బహిష్కరణ

ఇరుదేశాల మధ్య కొనసాగుతున్న దౌత్య వివాదం నేపథ్యంలో ఇక్కడ జరుగనున్న డబ్ల్యుటిఓ సభ్యదేశాల సమావేశం నుండి పాకిస్తాన్ శనివారం నాడు వైదొలగింది. ఈ సమావేశానికి రావల్సిందిగా పాక్ వాణిజ్య మంత్రి పర్వేజ్ మాలిక్‌ను గత నెలలోనే భారత్ ఆహ్వానించింది. ఆయన తాను హాజరవుతానని కూడా ప్రకటించారు. కాగా ఇప్పుడు ఆయన ఈ సమావేశానికి హాజరు కాబోరని పాక్ ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇరుదేశాల మధ్య ప్రస్తుతం కొనసాగుతున్న వివాదాస్పద పరిస్థితుల నేపథ్యంలో డబ్ల్యుటివో మంత్రుల భేటీ నుండి వైదొలగాలని పాక్ నిర్ణయించుకున్నట్లు ఆ దేశ దౌత్యవర్గాలు వివరించాయి. ఈ నెల 19-20 తేదీల్లో డబ్ల్యుటిఓ భేటీ న్యూఢిల్లీలో జరుగనున్న విషయం తెలిసిందే. పాక్ ప్రభుత్వం చివరి నిముషంలో తీసుకున్న ఈ నిర్ణయంపై తాము స్పందించబోమని భారత అధికారులు చెప్పారు.

వీడియో సాక్ష్యాన్ని ప్రవేశపెట్టలేదు

- మంగళూరు పబ్ దాడి కేసులో కోర్టు తీర్పు

న్యూఢిల్లీ : మంగళూరులోని 'అమ్నేషియా-ద లాంజ్' పబ్‌లో 2009 జనవరిలో శ్రీరామ్ సేన్ కార్యకర్తలు యువతులపై దాడిచేసిన ఘటనలో, దాదాపు 9 ఏళ్ళ తరువాత 30 మంది నిందితులకు గాను 26 మందిని ఈ నెల 12న కోర్టు విడుదల చేసింది. అందులో శ్రీరామ్ సేన్ అధ్యక్షుడు ప్రమోద్ ముతాలిక్ కూడా ఉన్నారు. తగిన సాక్ష్యంలేని కారణంగా వారిని విడుదల చేసినట్లు కోర్టు పేర్కొంది. "ప్రాసిక్యూషన్ కోర్టుకు సమర్పించిన సాక్ష్యం నిందితుల నేరాన్ని నిర్ధారించడం లేదు. నిందితులపై ఆపాదించిన అభియోగాలను సమర్థించేలా సాక్ష్యాలు లేవు. ఇటువంటి పరిస్థితుల్లో నేరాన్ని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందన్న స్పష్టమైన అభిప్రాయానికి వస్తున్నాం." అని కోర్టు ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ తీర్పు పలువురిని దిగ్భ్రాంతికి గురి చేసింది. నిందితుల దుశ్చర్యకు సంబం ధించిన దృశ్యాలను మీడియా, స్థానికులు కెమెరాలలో బంధించారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమంలో కూడా వైరల్ అయ్యాయి. అయితే కోర్టులో వాటిని సాక్ష్యాలుగా ప్రవేశ పెట్టలేదని పేర్కొన్నారు. "నిందితుల ప్రమేయాన్ని రుజువు చేసేందుకు ఆ వీడియోలు, ఫొటోలు ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ఈ కేసులో ఫొటోలు వాస్తవ సాక్ష్యాలు. వీటిని ప్రవేశపెట్టక పోవడం ఈ కేసును నిర్వీర్యం చేసింది "అని 30 పేజీల కోర్టు తీర్పు పేర్కొంది. ఈ తీర్పు వెలువడిన తరువాత ప్రమోద్ ముతాలిక్ మాట్లాడుతూ తమని దోషులుగా పేర్కొన్న వారికి ఈ తీర్పు గుణపాఠం లాంటిదని పేర్కొనగా, కాని విశ్లేషకులు మాత్రం 'న్యాయానికి కళ్ళు లేవని' వ్యాఖ్యానించారు.

బిజెడిలోకి రఘునాథ్ మొహంతి

భువనేశ్వర్ : వరకట్నం ఆరోపణలపై అరెస్టయిన కారణంగా పార్టీ నుంచి బహిష్కరించబడిన మాజీ మంత్రి రఘునాథ్ మొహంతి తిరిగి బిజూ జనతాదళ్ (బిజెడి)లోకి చేరారు. అతన్ని పార్టీ ఉపాధ్యక్షుడిగానూ, ధెనకనల్ జిల్లా పరిశీలకుడిగానూ నియమించారు. రఘునాథ్ మొహంతి, అతని భార్య 2013లో వరకట్న వేధింపుల కేసులో అరెస్టు చేయబడ్డారు. తరువాత బెయిల్‌పై విడుదలయ్యారు. అప్పట్ని నుంచి వారి కుటుంబం కోర్టుల చుట్టూ తిరిగింది. మొహంతి కుమారుడు- అతని కోడలు ఒక ఒప్పందానికి రావడంతో ఈ కేసు ఇటీవల ముగిసింది. ఈ కేసు కారణంగా మొహంతిని బిజెడి నుంచి బహిష్కరించడమే కాకుండా, అతని ప్రాథమిక సభ్యత్వాన్ని కూడా రద్దు చేశారు. 1990 నుంచి వరసగా ఐదు సార్లు బస్తా నియోజకవర్గం నుంచి విజయం సాధించిన మొహంతికి 2014లో టిక్కెట్ కూడా ఇవ్వలేదు.

బెంగళూరులో తాగునీటికి కృత్రిమ కొరత

- పెరుగుతున్న పట్టణీకరణ, వృద్ధి చెందుతున్న నిర్మాణాలే కారణం



బెంగళూరు : భారత దేశపు సిలికాన్ వ్యాలీగా పిలవబడే బెంగళూరు కృత్రిమ నీటి కొరతను ఎదుర్కొంటున్నది. నగరంలోని పెద్దపెద్ద అపార్ట్‌మెంట్లకు, ఇళ్ళకు, కార్యాలయాలకు ప్రతిరోజూ 1000కి పైగా టాంకర్లు నీటిని సరఫరా చేస్తున్నాయి. నగరమంతా టాంకర్లు సరఫరా చేసే నీటిపైనే ఎక్కువగా ఆధారపడ్డాయి. ఈ టాంకర్లు పెద్దపెద్ద బోరు బావుల నుంచి నీటిని తోడుకొని సరఫరా చేస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటుతున్నాయి. నీరు లభించని తొలి భారత దేశపు నగరం బెంగళూరు కానున్నదని పలువురు చేసిన హెచ్చరికలు వాస్తవం కానున్నాయి. భూ గర్భ జలాలు అడుగంటడంతో భవిష్యత్ చాలా కష్టంగా ఉండబోతున్నదని, నీటిని ఎక్కడ నుంచి తెచ్చుకోవాలి, ఎలా జీవించాలో ఊహించుకోవడమే అసాధ్యమవుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు 1500 అడుగులు (450 మీటర్లు) లోతుకు తవ్వినా కూడా నీరు అందడం లేదని చెబుతున్నారు. ప్రత్యేకించి నగర శివారు ప్రాంతమైన పనతూరులో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తున్నది. ఇక్కడ అత్యంత వేగంగా నిర్మాణాలు పెరగడమే కారణంగా చెబుతున్నారు. బెంగళూరులోనే అతి పెద్ద సరస్సు బెల్లందూరుకు పక్కనే పనతూరు ఉంది. ఒకప్పుడు బెంగళూరు నగరం పచ్చటి పార్కులతో అలరారుతుండేది. బెంగళూరు చుట్టూ పలు సరస్సులను ఏర్పాటు చేశారు. వర్షపు నీటి రిజర్వాయర్లుగా వీటిని వినియోగించే వారు. విలువైన వర్షపు నీరు వృధా కాకుండా ఈ ఏర్పాట్లు చేశారు. ఇప్పుడు అవి పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. వాటిని పూడ్చివేసి అపార్ట్‌మెంట్‌లను నిర్మించారు. ఇక మిగిలినవి కాలుష్యం బారిన పడ్డాయి. ప్రత్యేకించి బెల్లందూరు పూర్తిగా విషపూరితమయ్యింది. బెంగళూరులో నెలకొన్న ఈ పరిస్థితిపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బెంగళూరు నగరం అంతరించిపోతుందన్న ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్ర రాజధాని అయిన బెంగళూరు నగరం తీవ్రమైన నీటి కొరతతో కేప్ టౌన్ తరువాత నీరు లేని భారత దేశపు తొలి నగరంగా మారుతుందని ప్రముఖ పర్యావరణ వేత్త టి.వి. రామచంద్రన్ గతంలోనే హెచ్చరించారు. ప్రస్తుతం నగరం వృద్ధి చెందుతున్న తీరు, పట్టణీకరణ ఇదేవిధంగా కొనసాగితే 2020 నాటికి 94 శాతం భూమి 'కాంక్రీట్ కట్టడాలతో నిండిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

శరద్‌పవార్‌తో రాజ్‌థాకరే భేటీ

ముంబయి : మహారాష్ట్ర నవ నిర్మాణ సేన (ఎంఎన్ఎస్) ఆదివారం ఇక్కడ ర్యాలీ నిర్వహించనున్న నేపథ్యంలో ఆ పార్టీ చీఫ్ రాజ్ థాకరే ఎన్‌సిపి అధ్యక్షుడు శరద్ పవార్‌తో సమావేశమయ్యారు. కేవలం మర్యాదపూర్వకంగానే పవార్‌ను కలిశాను తప్ప ఇందులో రాజకీయ కోణమేమీ లేదని అనంతరం థాకరే చెప్పారు. ఆదివారం జరగనున్న పార్టీ ర్యాలీనుద్దేశించి రాజ్ థాకరే ప్రసంగించనున్నారు.

మహారాష్ట్రలో ముగ్గురు బంగ్లాదేశీయులు అరెస్టు

పూనె : అల్‌ఖైదా ప్రేరణతో నడుస్తున్న నిషిద్ధ ఇస్లామిక్‌ఉగ్రవాద సంస్థ అన్సరుల్లా బంగ్లా టీమ్ (ఎబిటి)తో సంబంధాలున్నాయన్న అనుమానంపై ముగ్గురు బంగ్లాదేశ్ జాతీయులను మహారాష్ట్ర ఉగ్రవాద నిరోధక బృందం (ఎటిఎస్) బృందం శనివారం అరెస్టు చేసింది. నకిలీ గుర్తింపు పత్రాలను ఉపయోగించి ఈ ముగ్గురు పూనెలో నివసిస్తున్నట్లు ఎటిఎస్ వర్గాలు తెలిపాయి. నగరంలోని అకుర్డి, వనోద్రి ప్రాంతాల నుంచి వారిని అరెస్టు చేసినట్లు ఎటిఎస్ అధికారి తెలిపారు. వారికి ఎబిటితో ఉన్న అనుబంధం, అందులో వారి ప్రమేయంపై ప్రశ్నిస్తున్నామని ఆయన చెప్పారు. అరెస్టయిన ముగ్గురు బంగ్లాదేశ్‌లోని ఖుల్నా జిల్లాకు చెందిన వారు కాగా, మరొకరు షరియత్పూర్ జిల్లాకు చెందిన వాడని వారు పేర్కొన్నారు. పూనెలోని కొండ్వా-వనోరియా ప్రాంతంలో అక్రమంగా వలస వచ్చిన బంగ్లాదేశీయుడు నివసిస్తున్నారని ముందుగా అందిన సమాచారం మేరకు ఎటిఎస్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్ సునీల్ దరేకర్ నేతృత్వంలోని బృందం అతనిని అరెస్టు చేసి ప్రశ్నించగా మిగిలిన ఇద్దరి సమాచారం తెలిసిందని, దీనితో వారిని అరెస్టు చేశామని ఆ అధికారి చెప్పారు.

యుపిలో ఉన్నతాధికారుల బదిలీలు

అక్రమాలకు పాల్పడిన అధికారికి ప్రమోషన్

లక్నో : ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 16 మంది జిల్లా మెజిస్ట్రేట్‌లతో సహా 37ఐఎఎస్ అధికారులను బదిలీ చేసింది. వివాదాస్పద గోరఖ్‌పూర్ జిల్లా మెజిస్ట్రేట్ రాజీవ్ రౌతెలాను దేవిపటన్ డివిజనల్ కమిషనర్‌గా ప్రమోషన్ యిస్తూ బదిలీ చేసింది. బుధవారం జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద మీడియాను దూరంగా ఉంచి రాజీవ్ రౌతెలా అక్రమాలకు పాల్పడి వివాదాస్పదుడైన విషయం తెలిసిందే. రాష్ట్రంలో అధికారుల బదిలీలు శుక్రవారం పొద్దు పోయిన తరువాత జరిగాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సొంత నియోజకవర్గమైన గోరఖ్‌పూర్‌ను దశాబ్దాల తరువాత సమాజ్‌వాది పార్టీ తాజా ఉప ఎన్నికల్లో కైవశం చేసుకుంది.

'జన్యుమార్పిడి' ఆహారాన్ని నిషేధించండి

'జిఎం' ఫ్రీ ఇండియా సంస్థ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : దేశంలో జన్యు మార్పు (జిఎం) ఆహారాన్ని నిషేధించాలని భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ)కు జిఎం ఫ్రీ ఇండియా అనే సంస్థ విజ్ఞప్తి చేసింది. భారత ఆహార భద్రత, ప్రమాణల చట్టం ప్రకారం 'జన్యుమార్పిడి' ఆహారానికి దేశంలో అనుమతి లేదని తెలిపింది. కానీ విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న 'జన్యుమార్పిడి' ఆహారాన్ని సూపర్ మార్కెట్లులో విక్రయిస్తున్నారని తన లేఖలో పేర్కొంది. దీనిపై వెంటనే విచారణ ప్రారంభించాలని కోరింది. కొన్ని సంస్థలు జన్యుపరంగా మార్పు చేసిన సోయాబీన్, కనోలా అయిల్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసి విక్రయిస్తున్నాయని, వీటికి పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి, కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవని ఆ సంస్థ కో-కన్వీనర్ కవితా కరుగంటి తెలిపారు.

నెహ్రూ విగ్రహంపై నల్ల రంగు

బెంగాల్‌లో ఘటన

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ లోని కత్వా జిల్లాలో దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ విగ్రహంపై గుర్తుతెలియని కొందరు వ్యక్తులు నల్ల రంగు పోసి విధ్వంసం సృష్టించారు. కత్వాలోని టెలిఫోన్ మైదాన్ వద్ద ఉన్న నెహ్రూ విగ్రహంపై శుక్రవారం రాత్రి ఈ దాడి జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని దానిని శుభ్రం చేయించారు.

ఎన్డీయే సర్కారుపై అవిశ్వాసానికి పూర్తి మద్దతు

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం భారత స్థిరీకరణ నిధి నుండి దాదాపు పదిలక్షల కోట్ల రూపాయల మేర సొమ్మును ఉపసంహరించుకునేందుకు ఉద్దేశించిన ఫైనాన్స్ బిల్లును సభ ఎలా ఆమోదించిందని ప్రశ్నించింది. సభా నిర్వహణలో బిజెపి సర్కారు అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలకు ఇది నిదర్శనంగా నిలుస్తోందని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. బిజెపి సర్కారు అనుసరిస్తున్న ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపింది.

మహారాష్ట్ర రైతులకు అభినందనలు

వ్యవసాయ రుణాల మాఫీ, మద్దతు ధర, పెన్షన్, అటవీ హక్కుల చట్టం అమలు వంటి డిమాండ్లతో మహారాష్ట్ర ప్రభుత్వంపై జరిపిన పోరాటంలో విజయం సాధించిన ఆ రాష్ట్ర రైతులకు పొలిట్‌బ్యూరో అభినందనలు తెలియచేసింది. అఖిల భారత కిసాన్‌సభ సారధ్యంలో ఈ నెల 6న నాశిక్ నుండి ముంబయి వరకూ రైతులు చేపట్టిన లాంగ్ మార్చ్ గొప్ప విజయం సాధించిందని అభిప్రాయపడింది. తొలుత 25 వేల మందితో ప్రారంభమైన ఈ లాంగ్ మార్చ్‌లో ఈ నెల 12న ముంబయి నగరానికి చేరుకునే సమయానికి 50 వేల మంది రైతులు జత కలిసారని వివరించింది. రైతులు భారీ సంఖ్యలో నిర్వహించిన ఈ మార్చ్ ఒత్తిడికి తలొగ్గిన మహారాష్ట్ర ప్రభుత్వం రైతుల డిమాండ్లను ఆమోదిస్తూ లిఖితపూర్వక హామీ ఇచ్చిందని తెలిపింది. ఇది దేశవ్యాప్తంగా ప్రభావాన్ని చూపుతుందని, రైతులకు ఇచ్చిన హామీలను నిర్దిష్ట కాల అవధిలో నిలుపుకునేందుకు మహారాష్ట్ర సర్కారు ప్రయత్నించాలని సూచించింది. రైతుల ఉద్యమానికి మహారాష్ట్రలోని అన్ని వర్గాల ప్రజలతోపాటు, రాజకీయ, సామాజిక వర్గాల నుండి లభించిన విస్తృత మద్దతు పట్ల పొలిట్‌బ్యూరో హర్షం వ్యక్తం చేసింది.

ఉన్నత విద్యపై దాడులు

బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి ఉన్నత విద్యా సంస్థలు ముఖ్యంగా సెంట్రల్ యూనివర్శిటీలపై దాడులు పెరిగిపోయాయని పొలిట్‌బ్యూరో ఆందోళన వ్యక్తం చేసింది. ఉన్నత విద్యారంగంపై జరుగుతున్న ఈ దాడులన్నీ భారతీయ చరిత్రను హిందూ పుక్కిట పురాణాలతో నింపటంతో పాటు భారతీయ తత్వశాస్త్ర అధ్యయనాన్ని హిందూ వేదాంత శాస్త్రంగా మార్చే లక్ష్యంతోనే జరుగుతు న్నాయని విమర్శించింది. ఢిల్లీలోని జవహర్లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్‌యు)లో వున్న ఆరెస్సెస్ అనుకూల వైస్ ఛాన్సలర్ విద్యార్థుల ప్రజాతంత్ర హక్కులను అణచివేసేందుకు, వారి కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపేందుకు ప్రయత్నిస్తుండటం ప్రజాస్వామ్య వ్యతిరేకమని విమర్శించింది.

యూనివర్శిటీ పాలనా యంత్రాంగం కొంతమంది డీన్‌లు, విభాగాధిపతులను తొలగించిందని, ఆరెస్సెస్‌కు చెందిన విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జెఎన్‌యు విద్యార్థుల ఉద్యమంపై దాడులు జరుగుతుండగా, ప్రగతిశీల బోధనా సిబ్బంది స్థానంలో హిందూ మత సిద్ధాంతాలను ప్రచారం చేసే వారిని నియమించారని పొలిట్ బ్యూరో విమర్శించింది. కొత్తగా నియమకాలు చేపట్టే పోస్టులకు సంబంధించి రిజర్వేషన్ రోస్టర్లలో న్యాయవ్యవస్థ సూచన ప్రకారం మార్పులు చేయాలంటూ యుజిసి తాజాగా నోటిఫికేషన్ జారీ చేసిందని, ఇది రిజర్వేషన్ కేటగిరి నియామ కాలకు తీవ్ర విఘాతం కలిగిస్తుందని తెలిపింది. దీనిపై రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని ప్రభుత్వం చెప్పి నప్పటికీ ఇప్పటి వరకూ ఆ పని చేయలేదని పేర్కొంది. యుజిసి జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌ను నిలిపివేసి రిజర్వేషన్ పోస్టుల భర్తీ ప్రక్రియ సత్వరం చేపట్టాలని సూచించింది.

ఉప ఎన్నికల ఫలితాలు

యుపి, బీహార్‌లలో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో బిజెపి ఓటమి పాలు కావటం ఒక సానుకూల పరిణామమని పొలిట్‌బ్యూరో అభివర్ణించింది. యుపిలోని గోరఖ్‌పూర్, ఫూల్పూర్, బీహార్‌లోని అరారియా స్థానాలకు జరిగిన ఈ ఉప ఎన్నికలో సమాజ్‌వాది, ఆర్‌జెడి అభ్యర్థులకు వామపక్షాలు మద్దతు ప్రకటించాయన్న పొలిట్‌బ్యూరో, బిజెపిని నిర్ద్వంద్వంగా తిరస్కరించిన ఓటర్లకు అభినందనలు తెలియచేసింది. బీహార్‌లోని జెహానాబాద్ అసెంబ్లీ స్థానంలో సిపిఐఎంఎల్ అభ్యర్థికి సిపిఎం మద్దతునిచ్చినట్లు కూడా పొలిట్‌బ్యూరో తెలిపింది.

త్రిపుర ఎన్నికలు

త్రిపుర శాసనసభకు ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై అందిన ప్రాథమిక నివేదికను తాము సమగ్రంగా పరిశీలించినట్లు పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో వివరించింది. త్రిపురలో గత లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం ప్రజానుకూల కార్యక్రమాలను అమలు చేసేందుకు, రాష్ట్రంలో శాంతి, సామరస్యాలను కాపాడేందుకు తన శక్తివంచన లేకుండా ప్రయత్నించినప్పటికీ ఈ ఫలితాలు రావటం అనూహ్యమైన విషయమని అభిప్రాయపడింది. అయితే ప్రజల్లో పెరుగుతున్న ఆకాంక్షలను తీర్చటానికి అందుబాటులో వున్న పరిమిత వనరులతో లెఫ్ట్ ప్రభుత్వానికి కార్యాచరణ కష్టసాధ్యమైందని వ్యాఖ్యానించింది. ఈ ఎన్నికల్లో బిజెపితో జత కట్టి విజయం సాధించిన ఐపిఎఫ్‌టి తమ విజయం ప్రత్యేక ఆదివాసీ రాష్ట్రం త్విప్రాలాండ్‌కు దారి తీస్తుందని చెబుతోందని, రాష్ట్రంలో అధికార మార్పిడికి బిజెపి-ఐపిఎఫ్‌టి కూటమి ఈ నినాదాన్ని నేర్పుగా వినియోగించుకున్నదని పొలిట్‌బ్యూరో అభిప్రాయపడింది. దీనితో పాటు ఈ ఎన్నికలను ప్రభావితం చేసేందుకు బిజెపి ధన బలంతో పాటు ఇతర వనరులను కూడా భారీయెత్తున వినియోగించిందని, చివరకు గతంలో కాంగ్రెస్ పార్టీకి పోలయిన లెఫ్ట్ వ్యతిరేక ఓట్లను కూడా బిజెపి సమీకరించగలగడంతో లెఫ్ట్ ఫ్రంట్‌కు ఈ ఎన్నికల్లో ఎదురు దెబ్బతగిలిందని భావిస్తున్నట్లు వివరించింది. అయినా ఈ ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్‌కు 45 శాతం ఓట్లు లభించగా, బిజెపి-ఐపిఎఫ్‌టి కూటమికి 50.5 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయని వివరించింది. కాగా ఎన్నికల అనంతరం బిజెపి మూకలు రెచ్చిపోయి రాష్ట్రంలో కొనసాగిస్తున్న హింసాకాండను పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. వీరి హింసాకాండలో దాదాపు 750కి పైగా పార్టీ ఆఫీసులపై దాడి జరిగిందని, అనే కార్యాలయాలు దగ్ధం చేయటం లేదా కూల్చివేయటం జరిగిందని వివరించింది. దాదాపు 742 మంది పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులపై భౌతిక దాడులు జరిగాయని, దాదాపు 1,829 ఇళ్లపై దాడులు చేసి లూటీ చేశారని, 217 ఇళ్లను తగులబెట్టారని తెలిపింది. పార్టీ సభ్యులు, మద్దతుదారులకు చెందిన 442 షాపులను దగ్ధం చేసారని ఈ ప్రకటనలో పేర్కొంది. 35 రబ్బర్ ప్లాంటేషన్లను ధ్వంసం చేశారని, దాదాపు 230 మందికి పైగా ప్రజల దగ్గర అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని తెలిపింది. త్రిపుర ప్రజలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా దేశంలో అనేక ప్రాంతాలలో సంఘీభావ ప్రదర్శనలు జరిగినట్లు వార్తలందుతున్నాయని పొలిట్‌బ్యూరో వెల్లడిస్తూ, త్రిపురలో ఆరెస్సెస్, బిజెపి గూండాల దాడులకు గురవుతున్న కార్యకర్తలకు సంఘీభావంగా నిలవాలని పార్టీ యూనిట్లు, శ్రేణులకు పిలుపునిచ్చింది.

పార్టీ వ్యవస్థాగత నివేదిక

ఏప్రిల్ 18 నుండి 22 వరకూ హైదరాబాద్‌లో జరుగనున్న పార్టీ 22వ మహాసభలలో సమర్పించే పార్టీ వ్యవస్థాగత నివేదిక ముసాయిదాపై పొలిట్‌బ్యూరో సమగ్రంగా చర్చించింది. ఈ నెల 28, 29, 30 తేదీలలో జరిగే కేంద్ర కమిటీ సమావేశాలలో దీనిపై చర్చించి ఆమోదించిన అనంతరం మహాసభలలో ప్రవేశపెడతామని పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో వివరించింది.

ఇరాన్ అణు ఒప్పందంపై మరోసారి చర్చలు

టెహరాన్ : ఇరాన్ అణు ఒప్పందంపై మరోసారి చర్చలు జరపాలని ఇరాన్, అమెరికా భావిస్తున్నాయి. ఆస్ట్రియా రాజధాని వియన్నాలో ఈ చర్చలు జరగనున్నాయి. అణు ఒప్పందం అమలుపై చర్చించేందుకు వియన్నా వచ్చిన ఇరాన్ దౌత్య బృందం అమెరికా అధికారులతో సహా ఇతర పక్షాల ప్రతినిధులను కూడా కలవనుందని ఇరాన్ ప్రతినిధులకు సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇరాన్‌పై ఆంక్షలను తొలగించడం, ఈ ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించిన ఉదాహరణలపై ఉభయ పక్షాలు చర్చించనున్నాయి. సంయుక్త సమగ్ర కార్యాచరణ ఒప్పందంపై తాజాగా జరుగుతున్న చర్చల్లో బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, చైనా, రష్యా ప్రతినిధులు కూడా పాల్గొంటున్నారు.

అభినందన

ఇరాకీ నగరాలలోని స్టేడియంలలో అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్‌లపై నిషేధం తొలగించినందుకు అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఫెడరేషన్(ఫిఫా)కు అభినందనలు తెలుపుతున్న ఇరాకీ ప్రధాని



23 మంది బ్రిటిష్ దౌత్యవేత్తలను బహిష్కరించిన రష్యా

మాస్కో: బ్రిటన్‌లో తమ మాజీ అధికారిపై విషప్రయోగం జరిగిన కేసులో 23 మంది బ్రిటిష్ దౌత్యవేత్తలను తమ దేశం నుండి బహిష్కరిస్తున్నట్లు రష్యా ప్రకటించింది. దీనితో పాటు మరిన్ని చర్యలు కూడా తీసుకుంటామని రష్యా విదేశాంగశాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. సాంస్కృతిక, శాస్త్ర పరిశోధనలకు సంబంధించిన బ్రిటిష్ ప్రభుత్వ సంస్థ బ్రిటిష్ కౌన్సిల్ మూసివేతకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపిన రష్యా విదేశాంగశాఖ సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో బ్రిటిష్ కాన్సలేట్ పునఃప్రారంభానికి సంబంధించిన ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. బ్రిటన్ దౌత్యవేత్తలు వారం రోజుల్లోగా తమ దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. బ్రిటన్ రష్యా పట్ల 'అమర్యాద' కర చర్యలు తీసుకుంటే తాము మరిన్ని ప్రతీకార చర్యలు తీసుకోవాల్సి వుంటుందని రష్యా ఈ ప్రకటనలో హెచ్చరించింది. బ్రిటిష్ రాయబారి లారీ బ్రిస్టోవ్‌ను శనివారం నాడు తమ కార్యాలయానికి పిలిపించిన రష్యా విదేశాంగశాఖ ఈ చర్యలకు సంబంధించిన సమాచారాన్ని అందచేసింది. బ్రిటన్ ప్రధాని థెరెస్సా మే ఈ వారంలో 23 మంది రష్యా దౌత్యవేత్తలను బహిష్కరించటంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు గాడితప్పిన విషయం తెలిసిందే.

వియత్నాం మాజీ ప్రధాని ఫాన్‌వాన్‌ఖై కన్నుమూత

హనోయ్: వియత్నాం మాజీ ప్రధాని ఫాన్‌వాన్‌ఖై (85) శని వారం ఇక్కడ కన్ను మూశారు. అర్థ శతాబ్ది నాటి పోరు అనంత రం అమెరికాతో సంబంధా లను మెరుగుపర్చుకు నేందుకు కృషి చేసిన ఖై వియత్నాం ఆర్థిక వ్యవస్థలో మార్కెట్ సంస్కరణ లకు తెరతీశారు. దక్షిణ వియత్నాం లోని హోచిమిన్ సిటీ శివార్ల లోని కుచి జిల్లాలగో 1933 డిసెంబర్ 25న జన్మించిన ఖై 14వ ఏటనే నాటి ఫ్రెంచ్ వలస పాలనకు వ్యతిరేకం గా బాలల విప్లవోద్యమంలో చేరారు. 26వ ఏట కమ్యూనిస్టు పార్టీలో చేరిన ఆయన 1985లో హోచి మిన్ సిటీ మేయర్‌గా ఎన్నికైన ఖై ఆరేళ్ల తరు వాత వియత్నాం కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యారు. మాజీ ప్రధాని ఖై మరణ వార్తను వియత్నాం ప్రభుత్వం శనివారం ఉదయం అధికారికంగా ప్రకటించింది.

అధ్యక్షుడిగా మరోసారి సీ జిన్‌పింగ్

బీజింగ్ : చైనా పరిస్థితులకు అనువైన సోషలిజాన్ని అమలు చేస్తామని ప్రకటించిన చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సీ జిన్‌పింగ్ దేశాధ్యక్షుడిగా మరోసారి పగ్గాలు చేపట్టారు. శుక్రవారం ఇక్కడ భేటీ అయిన పార్లమెంట్ ఆయన్ను మరోసారి దేశాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సీకి సన్నిహితుడైన వాంగ్ కి షాన్‌ను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటూ పార్లమెంట్ మరో తీర్మానాన్ని ఆమోదించింది. పార్లమెట్ సమావేశానికి హాజరైన మొత్తం 2,970 మంది ప్రతినిధులు సీ జిన్‌పింగ్‌ను దేశాధ్యక్షుడిగానూ, చైనా సెంట్రల్ మిలటరీ కమిషన్ ఛైర్మన్‌గానూ ఎన్నుకుంటూ తీర్మానాన్ని ఆమోదించారు.

గత నవంబర్‌లో జరిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ మహాసభల్లో ఆయన మరోసారి పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన విషయం తెలిసిందే. వీరితో పాటు సీ జిన్‌పింగ్ వద్ద గతంలో చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా వ్యవహరించిన లీ ఝాన్షును పార్లమెంట్ కొత్త ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. దీనితో పాటు ప్రభుత్వ వ్యవస్థను సమూలంగా మార్పు చేయాలన్న ప్రధాన సంస్కరణల ప్రతిపాదనలకు కూడా పార్లమెంట్ ఆమోదముద్ర వేసింది. ఈ సంస్కరణల ద్వారా ప్రభుత్వ వ్యవస్థల్లో వ్యవస్థాగత సామర్థ్యం మరింత పెరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ ప్రారంభించిన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బిఆర్ఐ) ప్రాజెక్టును అమలు చేసేందుకు స్టేట్ ఇంటర్నేషనల్ డెవలెప్‌మెంట్ కో-ఆపరేషన్ ఏజెన్సీ (సిడ్కా) అనే సంస్థను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు కూడా పార్లమెంట్ ఆమోదముద్ర వేసింది. సిడ్కా ద్వారా విదేశాల నుండి ఆర్థిక సహాయాన్ని సేకరించేందుకు వీలవుతుంది. చైనా ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల్లో ఇంకా కొత్తగా ఇమిగ్రేషన్ ఏజెన్సీ ఏర్పాటు, బ్యాంకింగ్, బీమా నియంత్రణా వ్యవస్థల విలీనం వంటి ప్రతిపాదనలకు కూడా ఆమోదం లభించింది. ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారుగా వ్యవహరిస్తున్న యాంగ్‌జీ చి నేతృత్వంలో సిపిసి



అంతర్జాతీయ వ్యవహారాల విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ వ్యవస్థ నేరుగా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ పర్యవేక్షణలో పనిచేస్తుంది.

అమెరికాలో కొనసాగుతున్న ఉద్వాసనల పర్వం

ఎఫ్‌బిఐ మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఆండ్రూమెకాబే పై వేటు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో ఉద్వాసనల పర్వానికి ఇప్పట్లో తెరపడే అవకాశాలు కన్పించటం లేదు. మూడు రోజుల క్రితం విదేశాంగ మంత్రి టిల్లర్సన్, శుక్రవారం నాడు జాతీయ భద్రతా సలహాదారు లెఫ్టినెంట్ మెక్‌మాస్టర్‌ను తొలగించిన ట్రంప్ తాజాగా ఎఫ్‌బిఐ మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఆండ్రూ మెక్‌కాబెపై వేటు వేశారు. ఆయన మరో రెండు రోజుల్లో పదవీవిరమణ చేయనుండగా ఈ వేటు పడటం విశేషం. ఈ చర్యపై తీవ్రంగా స్పందించిన మెక్‌కాబే ట్రంప్ ప్రభుత్వం ఎఫ్‌బిఐ పై ప్రకటించిన యుద్ధంలో భాగంగానే తనను తొలగించారని మండిపడ్డారు. హిల్లరి క్లింటన్ ఇ-మెయిల్ దుర్వినియోగం వ్యవహారంపై జరుగుతున్న దర్యాప్తునకు సంబంధించిన సమాచారాన్ని ఎటువంటి అనుమతి లేకుండా లీక్ చేశారన్న ఆరోపణలపై మెక్‌కాబేను తొలగించాలని ఎఫ్‌బిఐ క్రమశిక్షణా కమిటీ చేసిన సిఫార్సు మేరకు ఈ వేటు వేసినట్లు అటార్నీ జనరల్ జెఫ్ సెషన్స్ చెప్పారు. ఎఫ్‌బిఐలో పనిచేసే ప్రతి ఉద్యోగి నిజాయితీ, సమగ్రతతో బాధ్యతాయుతంగా అత్యున్నత ప్రమాణాలతో వ్యవహరిస్తారని ఆశిస్తామని, అందుకు భిన్నంగా వ్యవహరించిన వారిపై చర్య తప్పదని సెషన్స్ శుక్రవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో వివరించారు.

ఇంటిపై కూలిన విమానం

పది మంది మృతి

మనీలా : మనీలాకు ఉత్తరంగా ఆరు సీటర్ల చిన్న విమానం శనివారం ఒక ఇంటిపై కూలిపోవడంతో మొత్తంగా పది మంది మరణించారు. విమానంలో వున్న ఐదుగురు ఫిలిప్పీన్స్ జాతీయులు మృతి చెందగా, నేలపై కూలిన ఘటనలో మరో ఐదుగురు మరణించారని అధికారులు తెలిపారు. విమానం టేకాఫ్ అయిన కొద్ది సేపటికే ఈ దుర్ఘటన సంభవించింది. పైపర్-23 అపాచి విమానం బులకన్ ప్రావిన్స్‌లోని ప్లారిడెల్ పట్టణంలో విమానాశ్రయం నుండి బయలుదేరిందని, కాసేపటికే ఇంటిపై కూలిపోయిందని పౌర విమానాయాన శాఖ ప్రతినిధి ఎరిక్ అపోలొనియో తెలిపారు. విమానం కూలగానే పెద్ద మంట వచ్చిందని, ఆ మంటలకు ఇల్లు ఆహుతై పోయిందని, అందులో ఐదుగురు చనిపోయారని, మరో ఇద్దరు గాయపడ్డారని చెప్పారు. ప్రమాదానికి గల కారణం తెలియరాలేదన్నారు. విమానం ముందుగా చెట్టును, ఆ తర్వాత విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఇంటిపై కూలిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

సమస్యల్లో కూరుకుపోయిన అబె ప్రభుత్వం

- చీకటి ఒప్పందానికి సంబంధించి మరిన్ని సాక్ష్యాలు

టోక్యో : షింజో అబె ప్రభుత్వం ప్రమేయమున్నట్లుగా భావిస్తున్న మోరిటమో ఒప్పందానికి సంబంధించి మరిన్ని సాక్ష్యాధారాలు వెలుగులోకి రావడంతో ప్రభుత్వం మరింతగా సమస్యల్లోకి కూరుకుపోయింది. ప్రభుత్వ భూమిని నేషనలిస్ట్ స్కూలు నిర్వాహకుడికి చాలా తక్కువ ధరకే కట్టబెట్టారని ప్రభుత్వం ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆ వివాదం నుండి బయట పడేందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రభుత్వ పత్రాలను తారుమారు చేసినట్లు ఈ వారం ప్రభుత్వమే అంగీకరించింది. ఈ చీకటి ఒప్పందానికి సంబంధించి కాంట్రాక్టర్ నుండి తాజా సమాచారం వెల్లడి



కావడంతో అబె ప్రభుత్వం మరింత ఒత్తిడిని, విచారణను ఎదుర్కోనాల్సి వుంది. అబెను, ఆయన భార్యను, సీనియర్ మంత్రులను చిక్కుల్లో పెట్టిన ఈ భూ ఒప్పందానికి సంబంధించిన కాంట్రాక్టర్ మాట్లాడుతూ, ఆ ప్రదేశంలో తగలబెట్టిన వ్యర్థాల గురించి తప్పుడు సమాచారం ఇచ్చామని చెప్పారు. అది కూడా ప్రభుత్వ అభ్యర్థన మేరకేనని తెలిపారు. ఆ తప్పుడు సమాచారం వల్లనే అసలు విలువ కన్నా చాలా తక్కువ ధరకు భూమి విక్రయం జరిగిందని కాంట్రాక్టరు తెలిపారు. స్కూలు నిర్వాహకులు, ప్రభుత్వం ఇద్దరూ డిమాండ్ చేసిన విధంగానే తాము తప్పుడు సమాచారం ఇచ్చామని ఆ ప్రాంతాన్ని పరిశీలించిన నిర్మాణ కంపెనీ ఓసాకా ప్రాసిక్యూటర్లకు తెలిపింది. మార్కెట్ విలువలో కేవలం 14శాతం మొత్తానికే ఆ భూమిని కొనుగోలు చేశారు. పైగా చెత్తను తొలగించడానికి అయిన ఖర్చును కూడా ఆ మొత్తం నుండి తగ్గించి మరీ ఇచ్చారు. ఈ ప్రదేశంలో ప్రాథమిక స్కూలును నిర్మించనున్న నిర్వాహకుడు అబె భార్యనే ఆ స్కూలుకు గౌరవ ప్రిన్సిపాల్‌గా నియమించనున్నారు.

వచ్చే వారం శ్రీలంక ప్రధానిపై అవిశ్వాస తీర్మానం



కొలంబో : ప్రధాని రానిల్ విక్రమసింఘెకి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించనున్నట్లు ప్రతిపక్ష కూటమి తెలిపింది. వచ్చే వారం పార్లమెంట్ తిరిగి సమావేశం కాగానే అవిశ్వాస తీర్మానం నోటీసును స్పీకర్‌కు అందచేయనున్నట్లు ప్రతిపక్ష కూటమి ఎంపి రంజిత్ సోయ్సా తెలిపారు. శ్రీలంక మాజీ అధ్యక్షుడు మహింద్రా రాజపక్స మద్దతు ఈ కూటమికి వుంది. ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని, త్వరలో విక్రమసింఘె పదవి నుండి వైదొలగుతారని విలేకర్లతో మాట్లాడుతూ రాజపక్స చెప్పారు. గత మూడేళ్ళలో విక్రమసింఘెపై వచ్చిన ఆర్థిక దుర్వినియోగం ఆరోపణలన్నీ ఆ అవిశ్వాస తీర్మానంలో పేర్కొననున్నట్లు చెప్పారు. విక్రమసింఘె పార్టీ యుఎన్‌పికి చెందిన కొందరు సభ్యులు కూడా ఈ తీర్మానంపై సంతకాలు చేస్తారని తెలిపారు. గత నెల 10న జరిగిన స్థానిక ఎన్నికల్లో రాజపక్స నూతనంగా స్థాపించిన శ్రీలంక పీపుల్స్ పార్టీ ఘన విజయం సాధించడంతో విక్రమసింఘె రాజీనామాకు డిమాండ్ ఊపందుకుంది.

అకాల వర్షంతో అపార నష్టం

(మొదటిపేజీ తరువాయి)

మార్కెట్ యార్డు కందుల కొనుగోలు కేంద్రంలో ఉంచిన కందులు వర్షంతో తడిసి ముద్దయ్యాయి. నీరు ప్రవహించడంతో కింది వరసల్లోని బస్తాలన్నీ తడిశాయి. పట్టాలు అరకొరగానే ఉండడంతో కందులను పూర్తిస్థాయిలో కాపాడేందుకు వీల్లేకపోయింది. ఈ అంశంలో అధికారుల నిర్లిప్తతపై విమర్శలు వస్తున్నాయి. కొల్లూరు మండలంలో శనివారం మధ్యాహ్నం కొద్దిపాటి వర్షానికి జొన్న పైరు నేలవాలింది. కృష్ణాజిల్లా ముసునూరు మండలంలో పందిళ్ళపై ఆరబెట్టిన పొగాకు తడిచిపోయిందని పలువురు రైతులు వాపోయారు. వర్షంతోపాటు ఈదురుగాలులు తోడైతే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళన గోదావరి జిల్లాల్లోని మామిడి రైతుల్లో నెలకొంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఆక్వా చెరువుల్లో ఆక్సిజన్ సమస్యల వల్ల రొయ్యలు ఒడ్డుకు చేరుతున్నాయి. నిర్ణీత సమయంలో ఏరియేటర్స్ రన్నింగ్‌లో లేకపోతే చనిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం మరో రెండు రోజులు కొనసాగితే రొయ్యలు చనిపోయే ప్రమాదముందని చెబుతున్నారు. కడప జిల్లాలో చాలాకాలంగా వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఒకింత ఊరటనిచ్చింది. ఎండిపోతున్న పంటలకు కొంత జవసత్వాలనూ చేకూర్చింది. శుక్రవారం రాత్రి జిల్లాలో భారీ వర్షానికి పట్టణాలు, నగరాల్లో కాల్వలు పొంగి పొర్లాయి. రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. వేంపల్లి మండలం కుమ్మరాంపల్లి, వీరన్నగట్టు, ఇడుపులపాయ గ్రామాల్లో దాదాపు వంద ఎకరాల్లో పొద్దుతిరుగుడు, దోస, చాపాడులో పసుపు, దోస, జమ్మలమడుగులో పి.బొమ్మేపల్లిలోని పదెకరాల కోతకోసిన వరి పంట నీటిపాలైంది. వీరబల్లి మండలం వంగిల్లనాగిరెడ్డిగారిపల్లెలో పిడుగుపాటుకు రెండు గేదెలు మృత్యువాతపడ్డాయి. దాదాపు రూ.80 వేలు నష్టం వాటిల్లింది. గడికోట గ్రామంలో విద్యుత్ స్తంబాలు నేలకొరిగాయి. 17 గ్రామాలు అంధకారంలో ఉండాల్సి వచ్చింది. సుండుపల్లి, సంబేపల్లిలో అక్కడక్కడ విద్యుత్ తీగలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. భారీ వర్షానికి రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు, రాజంపేట మండలాల్లో పెద్దఎత్తున అరటి పంట దెబ్బతింది. జిల్లాలో 297 ఎకరాల్లో వివిధ ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. రూ.1.76 కోట్లు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. దాదాపు 285 ఎకరాల్లో అరటి పంట దెబ్బతింది. రూ.1.71 కోట్లు నష్టం వాటిల్లింది. రైల్వేకోడూరు నియోజకవర్గం పరిధిలోనే దాదాపు 20 గ్రామాలకు సంబంధించి 225 ఎకరాల్లో అరటి దెబ్బతినడం వల్ల దాదాపు రూ.9కోట్లు నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతుంటే, అధికారులు జిల్లావ్యాప్తంగా రూ.1.71 కోట్లు మాత్రమే నష్టం వాటిల్లినట్లు అంచనాలు వేయడం గమనార్హం.

సోమవారం నుంచి ఎండలే

శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు కోస్తాలోని నెల్లూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి, రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో పలు చోట్ల భారీ నుంచి ఓ మోస్తరు వర్షాలు నమోదయ్యాయని విశాఖ వాతావరణ అధికారులు తెలిపారు. ఆదివారం కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన తేలికపాటి జల్లులు కురుస్తాయని, ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా ఉంటుందని తెలిపారు. సోమవారం నుంచి పొడి వాతావరణం నెలకొంటుందన్నారు.

ఏ ఒక్క రైతూ నష్టపోకూడదు

- ముఖ్యమంత్రి ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల ఏ ఒక్క రైతూ నష్టపోకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. రియల్‌టైంపై శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. వర్షాలకు మిర్చి పంట తడిస్తే నష్టం వస్తుందని, అలాకాకుండా ఎప్పటికప్పుడు రైతుల్ని అప్రమత్తం చేయాలని సూచించారు. రాష్ట్రంలో సంభవించిన వేర్వేరు ఘటనల గురించి అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. విశాఖలో మురుగు గుంతలో పడి నలుగురు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. బాధితులను ఆదుకోవాలని ఆదేశించారు. నక్కపల్లి ఘటన ఎలా జరిగిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. కృష్ణా జిల్లా గుడివాడలో ఇంటిలోకి దోపిడీ దొంగలు ప్రవేశించి, ఇద్దరిని హత్య చేసి, నగలు దోచుకెళ్లిన ఘటనపైనా సమీక్షించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసు గస్తీని మరింత ముమ్మరం చేయాలన్నారు. దోపిడీ దొంగల్ని పట్టుకోవాలని, రాష్ట్రమంతా సిసి కెమెరాల ఏర్పాటు వేగవంతం చేయాలని ఆదేశించారు. దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

దేశాన్ని చీల్చేందుకు బిజెపి యత్నం

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవలి మరణించిన నాయకులకు ప్లీనరీ సంతాపం తెలిపింది. స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించింది. శనివారం రాజకీయ, వ్యవసాయం తీర్మానాలపై చర్చ జరిగింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో 2019 లోక్‌సభ ఎన్నికలకు అనుసరించాల్సిన రాజకీయ దార్శనిక ముసాయిదా తీర్మానాలపై చర్చించి ఆమోదించనున్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ బిజెపి దేశాన్ని అడ్డగోలుగా చీల్చేస్తోందని ధ్వజమెత్తారు. "ప్రస్తుతం దేశమంతా అసంతృప్తి, ఆగ్రహంతో ఉంది. ఈ పరిస్థితుల్లో దేశం మొత్తాన్ని ఏకం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ఈ ప్లీనరీ దేశానికి, కాంగ్రెస్ పార్టీకి మార్గదర్శకంగా ఉండాలి. కాంగ్రెస్‌ను ముందుకు నడిపించడంలో యువతకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. పార్టీలోని అనుభవజ్ఞులు యువతకు మార్గ నిర్దేశం చేయాలి. సీనియర్ నేతలనూ, యువ నేతలనూ కలుపుకొని పార్టీని ముందుకు తీసుకువెళ్లడం నా పని. ఈ దేశం ప్రజలందరిది. అన్ని మతాలు, వర్గాల వారిది. అన్ని వర్గాల ప్రజల అభివద్ధి, ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పనిచేస్తోంది. బిజెపి కోపాన్ని ప్రదర్శిస్తోంది. మేం ప్రేమతో పనిచేస్తున్నాం. దేశాన్ని ఐక్యంగా ఉంచి ముందుకు నడిపించేది చేతిగుర్తే" అని రాహుల్ అన్నారు.

మోడీ వన్నీ డ్రామాలే: సోనియా గాంధీ

కాంగ్రెస్ విజయం, ప్రతి ఒక్కరి విజయమని, కాంగ్రెస్ అనేది ఒక రాజకీయ పదం కాదని అక ఉద్యమమని పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ అన్నారు. "పార్టీ విజయంలో ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం ఉంది. పార్టీని ఎలా బలోపేతం చేయాలనే దాని గురించి ఆలోచించాల్సిన సమయం ఇది. 40ఏళ్ల క్రితం ఇందిరా గాంధీ చిక్‌మగుళూర్‌లో అద్భుతమైన విజయాన్ని సాధించి దేశ రాజకీయాలను తనవైపునకు తిప్పుకున్నారు. ఇప్పుడు మరోసారి అటువంటి ప్రదర్శనే పార్టీకి కావాలి. మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో ఆర్థిక వద్ధి అత్యధిక స్థాయిలో ఉంది. కానీ, ప్రస్తుతం మోడీ హయాంలోని పరిస్థితులను చూస్తుంటే బాధగా ఉంది. గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన పథకాలను అభివద్ధి చేయడం మోడీ మరిచిపోయారు. గత నాలుగేళ్లలో కాంగ్రెస్ పార్టీని నాశనం చేసేందుకు మోడీ ప్రభుత్వం ఏ అవకాశాన్ని వదల్లేదు. కానీ, ఎన్ని సవాళ్లు ఎదురైనా కాంగ్రెస్ మాత్రం బలహీనపడలేదు. ప్రధాని మోడీ, ఆయన వెంట ఉండే వారి మోసాన్ని, అవినీతిని మేం బయటపెట్టాం" అని పేర్కొన్నారు.

ఏపికి ప్రత్యేక హెూదాపై తీర్మానం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశం ఈ ప్లీనరీ సమావేశంలో చర్చకు వచ్చింది. ప్లీనరీ రాజకీయ తీర్మానంలో ప్రత్యేక హోదా అంశాన్ని చేర్చారు. ఏపికి ప్రత్యేక హోదాను ఇప్పటి వరకూ ఇవ్వకపోవడాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండించింది. విభజన చట్టాన్ని అమలు చేయాలని స్పష్టం చేసింది. తాము అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అమలు చేస్తామంటూ తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్, గులాం నబీ ఆజాద్, దిగ్విజయ్ సింగ్, ఆనంద్ శర్మ, ఏకె ఆంటోని వంటి సీనియర్ నేతలతో పాటు, అధిక శాతం యువ నేతలు పాల్గొన్నారు.

తీర్మానాలు:

వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో ఈ ప్లీనరీ నుంచి శ్రేణులకు దిశానిర్దేశం ఉండాలని పలు తీర్మానాలు చేయబోతున్నారు. వ్యవసాయం, యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, నిరుద్యోగం, పేదరిక నిర్మూలన, దేశ భద్రత, ఆర్థిక, పారిశ్రామిక విధానం, విదేశీ వ్యవహారాలు, కుంభకోణాలు, అవినీతిపై ప్లీనరీలో రాజకీయ తీర్మానంలో పొందుపరిచారు.

1. మహిళా సాధికారిత: దేశంలో మహిళలు చాలా సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావాలని, 2019 ఎన్నికలకు ముందే బిల్లును ఆమోదించి, అమలు చేయాలని, అందుకు కాంగ్రెస్ మద్దతు ఉంటుందని తీర్మానంలో పేర్కొంది.
2. యువత: ప్రతి ఏడాది రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సమయంలో బిజెపి దేశ యువతకు హామీ ఇచ్చింది. కానీ అమలు చేయలేదు. ఉద్యోగాలు ఇవ్వకపోగా, ఉన్న ఉద్యోగాలు కోల్పోయే విధంగా విధానాలు అమలు చేసింది.
3. సామాజిక న్యాయం: అటవీ హక్కుల చట్టం-2006 అమలు చేయాలి. అందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది. దీంతో గిరిజనులకు భూమిపైన, ఇతర వనరుల పైన హక్కు ఉంటుంది. పని హక్కు, విద్యా హక్కు, సమాచార హక్కు, ఆహార భద్రత వంటివి సామాజిక న్యాయంలో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఒబిసిలకు 27 శాతం ఉద్యోగ, విద్యా రంగంలో అమలు చేయాలి.
4. దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులకు ఖండన: దేశంలో దళిత, గిరిజన, మైనార్టీలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోంది. బిజెపి అధికారంలో ఉన్నప్పుడు సాదారణంగానే మైనార్టీల్లో అభద్రతభావం నెలకొంటుంది. మైనార్టీలందరికి భద్రత, సమానత, ప్రాథమిక హక్కుల కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తోంది.
5. ఆరెస్సెస్, బిజెపి: దేశంలో ఆరెస్సెస్, బిజెపి పాలనలో రాజ్యాంగ నిర్మాణ సూత్రాలు, భారత గణతంత్ర విలువలు, రాజ్యాంగ అనుబంధ సంస్థలపై వ్యవస్థాగత దాడి జరుగుతోంది. లౌకిక వాద సూత్రాలను ధ్వంసం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయి. పౌరుల స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛ, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అప్రజాస్వామ్యక పద్ధతులని రాజ్యాంగం పేర్కొంది. దీనిపై బిజెపి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ గట్టిగా హెచ్చరిస్తోంది.
6. అవినీతి: కేంద్రంలో, బిజెపి పాలిత ప్రాంతాల్లో అవినీతి పెరిగింది. రఫెల్ కుంభకోణంలో ప్రధాన మంత్రి పాత్ర ఉంది. అవినీతిపై లోక్‌పాల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు కనీస చర్యలు తీసుకోలేదు. అవినీతిని అరికడతామని, విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తెప్పిస్తామని ఎన్నికల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు కనీసం ఆలోచించలేదు.
7. అంతర్గత, బాహ్య భద్రత వాతావరణం క్షీణించింది: దేశం అంతర్గత, బహిర్గత భద్రత ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు. ఉగ్రవాదం, తిరుగుబాటు దారులు, నక్సలిజం వంటి సవాళ్లను ఎదుర్కొవడంలో ప్రభుత్వం విఫలం అయ్యింది.
8. ఏపి ప్రత్యేక హోదా
9. న్యాయ వ్యవస్థ: న్యాయ వ్యవస్థ పనితీరుపై అసంతృప్తి పెరిగింది. న్యాయ వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలి.
10. పదో షెడ్యూల్: రాజ్యాంగంలోని పది షెడ్యూల్‌తో ఫిరాయింపుల నిర్మూలన లక్ష్యాలను సాధించలేము. కాంగ్రెస్ ఆందోళనతో సూచన చేస్తోంది.
11. ఎన్నికల నిర్వహణ: రాజ్యాంగం ప్రకారం ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం హామీ ఉండాలి. పోలింగ్, కౌంటింగ్ వంటి వాటిలో అవకతవకలు ఉండకూడదు. ఈవిఎంలను తమకు అనుకూలంగా మార్చేందుకు ఆస్కారం ఉంది. కనుక ఎన్నికల ప్రక్రియపై విశ్వసనీయత కోసం పాత పద్దతి(బ్యాలెట్) ద్వారానే ఎన్నికలు నిర్వహించాలి.
12. ఏకకాల ఎన్నికలు: ఏక కాల ఎన్నికలనే బిజెపి ఆలోచన రాజ్యాంగానికి వ్యతిరేకం. అసాధ్యమైంది.
13 మీడియా: ప్రజాస్వామ్యంలో ప్రజల అభిప్రాయాన్ని వెల్లడించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. జాతీయ అవసరాలను, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మీడియా సమానతను పునరుద్ధరించేందుకు కాంగ్రెస్ ప్రోత్సహిస్తోంది.

ముదురుతున్న యుసి పోరు

(మొదటిపేజీ తరువాయి)

ఇదే విషయాన్ని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం కేంద్రం నుంచి 1500 కోట్ల రూపాయల వరకు రాష్ట్రానికి రాగా, అదనంగా 82 కోట్లు ఖర్చయ్యాయి. ఈ మేరకు యుసి పంపినట్లు అధికారులు చెబుతున్నారు. అది కూడా గతేడాది జనవరిలోనే రూ.800 కోట్లకుపైగా లెక్కలు చూపించగా, ఏడాది చివరిలో మరో 700 కోట్లకుపైగా ఖర్చుకు యుసిలు పంపించామని పేర్కొన్నారు. ఇందులో తాత్కాలిక సచివాలయం, మౌలిక సౌకర్యాలతో పాటు శాసనసభ భవనాల నిర్మాణానికి రూ. 810 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు రెండు యుసిలు పంపించారు. అలాగే అమరావతిలో ఉద్యోగుల వసతి పనులకు రూ.773 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు గత డిసెంబర్‌లో మరో యుసి పంపించినట్లు అధికారులు నివేదించారు. ఇందులో తాత్కాలిక భవనాల నిర్మాణాన్ని రాజధాని నిర్మాణంగా చూపించచినప్పటికీ, ఉద్యోగుల వసతి ఎక్కడ పూర్తయ్యిందన్న ప్రశ్న నెలకొంటోంది. కాగా, కేంద్రం ఇచ్చిన రూ.1500 కోట్లకు తాము యుసిలు పంపించిన తరువాత నీతి అయోగ్ కూడా సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు. గత డిసెంబర్ 28నే నీతి అయోగ్ డైరెక్టర్ దీనిపై సానుకూలంగా స్పందించి మిగిలిన వెయ్యి కోట్లను ఇవ్వవచ్చునని చెప్పారని అన్నారు..

రాజధాని నిర్మాణంలో భాగంగానే గుంటూరు, విజయవాడల్లో భూగర్భ డ్రైనేజీ పనులకు సంబంధించి వెయ్యి కోట్ల రూపాయలను విడుదల చేయగా, దానిని ఖర్చు చేసిన దాఖలాలు కనిపించడం లేదని స్వయంగా అధికారులే అంగీకరిస్తున్నారు. ఇదే అంశాన్ని ఎపి భవన్ అధికారులు కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. వెనుకబడిన జిల్లాలకు ఇచ్చిన నిధులపైనా అస్పష్టత కనిపిస్తోంది. ఈ మధ్య కాలంలోనే కేంద్రం నేరుగా కలెక్టర్ల నుంచి వివరాలు తెప్పించుకోగా, తమకు నిధులు ఇంకా రాలేదని కొన్ని జిల్లాల కలెక్టర్లు చెప్పినట్లు సమాచారం. పోలవరం ప్రాజెక్టుకు ముందుగానే రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఖర్చుచేసి, తరువాత రీయింబర్స్ కోరిందని, అందువల్ల దీనికి యుసిలు పంపించాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఆర్థిక శాఖ స్పష్టం చేస్తోంది. ఇదే సమయంలో లోటు నిధులకూ యుసిలివ్వాల్సిన అవసరం లేదని పేర్కొంటోంది.

ప్రజలకు టిడిపి క్షమాపణ చెప్పాలి

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతున్నారని చెప్పారు. కొన్ని సార్లు ప్రత్యేక హోదా ఎందుకు దండగ అని, మరో సారి ప్రత్యేక హోదా ఇవ్వాలని, అవిశ్వాసం వల్ల ఏమిటీ ఉపయోగం అని ఒక సారి, అవిశ్వాసం పెట్టాలని మరోసారి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని చెప్పారు. పవన్ కల్యాణ్ గుంటూరు సభతో ప్రతిపక్షాల ఉద్యమం బలోపేతమైందనీ, వామపక్షాలతో కలిసి ప్రత్యేక హోదా కోసం ఉద్యమం చేస్తామని పవన్ కల్యాణ్ ఇప్పటికే ప్రకటించారనీ వివరించారు.. ఈనెల 19న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలో ఒక బలమైన ఉద్యమం ఆవిర్భవిస్తుందనీ చెప్పారు. ఇచ్ఛాపురం నుంచి చిత్తూరు వరకూ బస్సు యాత్ర నిర్వహించే ఆలోచన ఉందన్నారు. విభజన హామీల అమలు కోసం ప్రతిపక్ష పార్టీలన్నింటినీ ఒకేతాటికి పైకి తీసుకువచ్చి కేంద్రానికి ఏపి సత్తా తెలియచేస్తామన్నారు. బిజెపి వివిధ రాష్ట్రాల ఉప ఎన్నికల్లో ఓటమి పాలవుతోందని, అస్తవ్యస్త విధానాల వల్ల టిడిపి ఒంటరిగా మిగిలిందన్నారు. పలు కీలక అంశాలపై ద్వంద్వ వైఖరి అవలంభించి రాష్ట్రంలో టిడిపి ఒక పక్కకు నెట్టబడిందన్నారు. నాలుగేళ్లుగా అబద్ధాలతో ప్రజలను మభ్య పెట్టిన టిడిపి నేతలు ఇప్పుడు అరచి గీ పెట్టుకున్నా ఉపయోగం లేదన్నారు.

హోదా కోసం రేపు మానవహారాలు

వైసిపి పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా కోసం పార్లమెంట్‌లో పోరాటం చేస్తున్న ఎంపీలకు మద్దతుగా సోమవారం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మానవహారాల్ని నిర్వహిస్తామని వైసిపి అధికార ప్రతినిధి కొలుసు పార్థసారధి తెలిపారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక హోదా కోసం ముందు నుంచీ పోరాటం చేస్తున్నది వైసిపియేనన్నారు. అభద్రతా భావంతోనే టిడిపి విమర్శలు చేస్తోందన్నారు. ప్రజలు తరిమి కొడతారనే భయంతోనే కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఏ కూటమి నుంచి బయటకొచ్చారన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు పూటకో మాట మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంపై వైసిపి పెట్టే అవిశ్వాసానికి ముందుగా మద్దతిస్తామని చెప్పిన టిడివి, మాట మార్చిందని తెలిపారు. ఇప్పటి వరకు హోదా కోసం ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఎన్నికల ముందు నాటకాలాడుతోందన్నారు. జాతీయ స్థాయిలో వైసిపికి వస్తున్న మద్దతు కారణంగానే ఇప్పుడు టిడిపి అవిశ్వాసం పెడతానంటోందని ఆయన విమర్శించారు. గత నాలుగేళ్లుగా ఈ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.


ఆ ఆలోచన లేదు



\- కళ్యాణ్‌రామ్

ప్రస్తుతానికి "సినిమా మొదటి భాగం కార్పొరేట్ బ్యాక్‌డ్రాప్‌లోనూ, ద్వితీయార్థం రాజకీయాన్ని స్పృశించే అంశాలతో 'ఎం.ఎల్.ఎ.' సినిమా వుంటుంది. నేను రాజకీయాల్లోకి రావడం కోసం ఈ సినిమా చేయలేదు. ప్రస్తుతానికి ఆ ఆలోచన లేదు. మున్ముందు వస్తానో, రానో తెలియదు" అని కథానాయకుడు కళ్యాణ్‌రామ్ అన్నారు. ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి నిర్మించిన ఈ చిత్రానికి 'మంచి లక్షణాలున్న అబ్బాయి'గా ట్యాగ్ లైన్ పెట్టారు. ఈ చిత్రం గురించి కళ్యాణ్‌రామ్ శనివారంనాడు పలు విషయాలను వెల్లడించారు.

- దర్శకుడు ఉపేంద్ర మాధవ్ చెప్పిన కథ కొత్తగా, నిజాయితీగా అనిపించింది. క్యారెక్టర్ ఆసక్తికరంగా వుంది. కార్పొరేట్ ఉద్యోగిగా నటించా. తనుండే ఊరిలో తరతరాలుగా వున్న ఓ రాజకీయనాయకుడు ప్రజల్ని మోసం చేస్తుంటాడు. ఆ సమయంలో అక్కడికి ప్రవేశించి ఏం చేశాననేది కథ. ఊరి సమస్య కోసం ఎలా పోరాడనేది ఆసక్తికరంగా వుంటుంది.
- కమర్షియల్‌తోపాటు ఆద్యంతం వినోదాత్మకంగా దర్శకుడు మలిచాడు. 'లక్ష్మీ కాళ్యాణం' తర్వాత కాజల్‌తో కలిసి నటించడం ఆనందంగా వుంది. తన ఎంపిక చిత్ర టీమ్ నిర్ణయమే. చదువు ప్రాధాన్యత ఏమిటో తెలిపే పాత్రలో ఆమె కన్పిస్తుంది. నాతోపాటు అన్ని పాత్రల తీరును దర్శకుడు చక్కగా తీర్చిదిద్దాడు.
- రాజకీయ నేపథ్యం వున్నా కథ మేరకు ఎంత వుండాలో అంతే వుంటుంది. పొలిటకల్ డైలాగ్స్ కూడా కథ మేరకే వుంటాయి. నటుడిగా, నిర్మాతగానూ సంతోషంగా వున్నా. అందుకే సక్సెస్‌లు తెచ్చుకునే ప్రయత్నంలో ముందుకు సాగుతున్నా.
- భిన్నమైన అంశంతో తీసిన 'ఇజం' సినిమా కమర్షియల్‌గా ఫలితం ఇవ్వకపోయినా నటుడిగా సంతృప్తి నిచ్చింది. నటుడిగా నాలోని పలు కోణాల్ని ఆవిష్కరించింది. ఇప్పుడు ఈ సినిమాలోనూ నా డైలాగ్ డిక్షన్, బాడీ లాంగేజ్‌లో మార్పు కన్పిస్తుంది.
- నేను ఏ సినిమా చేసినా నా గత చిత్రాలకు భిన్నంగా వుండేలా జాగ్రత్త పడతాను. అదే సమయంలో కొత్తగా ట్రై చేశాడనిపించుకునేలా చూసుకుంటా. ఏది ఏమైనా కథ నచ్చితేనే చేస్తాను. నా తదుపరి సినిమా 'నా నువ్వే' కూడా బాగా నచ్చి చేస్తున్నా. దీనికి జయేంద్ర దర్శకుడు. ఇది పూర్తి ప్రేమకథా చిత్రం. తొలిసారిగా లవ్‌స్టోరీ చేస్తున్నాను. ఇది అన్ని బాషల్లోనూ తీసేట్లుగా వుంటుంది.
- మల్టీస్టారర్ చిత్రాలు చేయడానికి సిద్ధమే. సాయిధరమ్‌తేజ్‌తో సినిమా చేయాల్సి వుంది. కె.ఎస్. రవికుమార్ రాసుకున్న కథ సంతృప్తిగా లేదు. అందుకే చేయలేకపోయా. ఇది కాకుండా ప్రస్తుతం ఇలాంటి చిత్రం చేయడానికి చర్చలు జరుగుతున్నాయి. అది ఈ ఏడాదిలోనే వుంటుంది. దానికి పవన్ సాధినేని దర్శకుడా? ఎన్‌టిఆర్ హీరోనా? అనేది త్వరలో తేలనుంది.
- తమ్ముడు ఎన్‌టిఆర్, నేను తరచూ కలుస్తూనే వుంటాం. సినిమాల గురించి, అందులోని సన్నివేశాల గురించి, రాజకీయాల గురించి చర్చించుకుంటూనే వుంటాం. తనకు నటన పట్ల నమ్మకం ఎక్కువ. ఈ సినిమా ట్రైలర్ చూశాక.. చాలా కొత్తగా వుందని ప్రశంసించాడు.



రవితేజ 'నేల టిక్కెట్టు'

రవితేజ హీరోగా 'సోగ్గాడే చిన్నినాయనా, రారండోయ్ వేడుక చూద్దాం' చిత్రాల దర్శకుడు కళ్యాణ్‌కష్ణ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రానికి 'నేల టిక్కెట్టు' పేరు ఖరారు చేశారు. రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న సినిమా ఫస్ట్‌లుక్‌ని తెలుగువారి మొదటి పండుగ ఉగాది సందర్భంగా రవితేజ ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. క్లాస్ మాస్ మేళవింపుతో ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి రవితేజ సరసన మాళవిక శర్మ హీరోయిన్‌గా నటిస్తుంది.

జగపతిబాబు, బ్రహ్మానందం, జయప్రకాశ్, రఘుబాబు, సుబ్బరాజు, ఆలి, పోసాని కష్ణమురళి, అన్నపూర్ణమ్మ, ప్రియదర్శి, ప్రభాస్ శ్రీను, ప థ్వీ, సురేఖా వాణి, ప్రవీణ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. దాదాపు అరవై శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మే 24న విడుదల చేయాలని నిర్మాతలు అనుకుంటున్నారు. 'ఫిదా' ఫేం శక్తికాంత్ కార్తీక్ సంగీతం, ఛోటా కే ప్రసాద్ కూర్పు, బ్రహ్మ కడలి కళ, ముఖేష్ ఛాయాగ్రహణం సమకూరుస్తున్నారు.

'ఆనందం'తో మళ్లీ హ్యాపీడేస్



'ఆనందం' దర్శకుడు గణేష్‌రాజ్, తరుణ్, నిర్మాత గురురాజ్


మలయాళంలో విజయవంతమయిన 'ఆనందం' చిత్రాన్ని అదే పేరుతో తెలుగులో వస్తోంది. సుఖీభవ మూవీస్ బేనర్‌పై ఎత్తరి గురురాజ్ అందిస్తున్నారు. ఈ నెల 23న విడుదలకానుంది. గణేశ్ రాజ్ దర్శకత్వం వహించారు. కేరళ టాప్ హీరో 'ప్రేమమ్' ఫేమ్ నివిన్ పాల్ ఇందులో గెస్ట్ రోల్ చేశారు. మిగిలిన నటీనటులందరూ దాదాపుగా కొత్తవారే. తెలుగులో అనువాదమవుతోన్న 'ఆనందం' చిత్రానికి వీరా వెంకటేశ్వర రావు (పెదబాబు), వి.ఆర్.బి.రాజు, రవి వర్మ చిలువూరి సహ నిర్మాతలు. సీనియర్ నిర్మాత ఆర్. సీతారామరాజు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. సచిన్ వారియర్ సంగీతం అందించిన ఈ సినిమా ఆడియో విడుదల శనివారం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది. హీరో తరుణ్ ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ... నేను 'ఆనందం' ట్రైలర్ చూశాక.. బాగా నచ్చింది. మనం అందరం కూడా చదువకునే రోజుల్లో ట్రిప్స్‌కు వెళ్లే ఉంటాం. అలా ఓ ట్రిప్‌కు వెళ్లిన కాలేజీ యువతీయువకుల కథే ఇది. అన్ని వర్గాల ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుంది. మలయాళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రం తెలుగులో కూడా మంచి విజయాన్ని సాధిస్తుంది" అన్నారు.

చిత్ర నిర్మాత గురురాజ్ మాట్లాడుతూ.. సినిమా చూసే వారికి వారి కాలేజీ రోజులు గుర్తుకు వస్తాయి. నాతో పాటు ఈ సినిమాను మా పిల్లలు చూశారు. వారు సినిమా చాలా బావుంది. తెలుగులో మీరే విడుదల చేయండి అని నన్ను కోరడంతో తెలుగు హక్కులను నేనే సొంతం చేసుకున్నాను. తక్కువ బడ్జెట్‌లో రూపొందిన ఈ సినిమా మలయాళంలో ఇరవై కోట్ల రూపాయలను వసూలు చేసింది. తెలుగు ప్రేక్షకులకు కూడా సినిమా తప్పకుండా నచ్చుతుందని భావిస్తున్నాం" అన్నారు.

దర్శకుడు గణేష్ రాజ్ మాట్లాడుతూ.. 2010 నుండి ఈ కథను రాసుకుంటూ వచ్చాను. 2016లో మలయాళంలో విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని సాధించింది. కాలేజ్‌లో ట్రిప్‌కు వెళ్లిన కొంత మంది విద్యార్థుల కథే ఈ సినిమా. యూనివర్సల్ పాయింట్‌తో తెరకెక్కిన ఈ సినిమా తప్పకుండా తెలుగు ఆడియెన్స్‌కు కూడా నచ్చుతుందని భావిస్తున్నాను. తెలుగులో విడుదలైన హ్యాపీడేస్ సినిమా నాకు ఎంతో ఇన్‌స్పిరేషన్‌గా నిలిచింది. అందుకే కథ ప్రకారం 'హ్యాపీడేస్ ఎగైన్' అని ట్యాగ్‌లైన్ పెట్టామని అన్నారు.

'చి.ల.సౌ.' ఫస్ట్‌లుక్

సుశాంత్ కథానాయకుడిగా సిరుని సినీ కార్పొరేషన్ పతాకంపై రాహుల్ రవీంద్రన్ దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కిస్తున్న చిత్రం "చి.ల.సౌ". ఈ చిత్రాన్ని జస్వంత్ నడిపల్లి నిర్మిస్తున్నారు. సుశాంత్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఉగాది సందర్భంగా శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత జస్వంత్ నడిపల్లి మాట్లాడుతూ.. సుశాంత్ పుట్టినరోజు సందర్భంగా సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉంది. షూటింగ్ పూర్తై ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. మే11న చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్: వినోద్ శర్మ (వివి), ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కోయలగుండ్ల, ఎడిటర్: ఛోటా కె.ప్రసాద్, మ్యూజిక్ డైరెక్టర్: ప్రశాంత్ ఆర్.విహారి, సినిమాటోగ్రఫీ: ఎం.సుకుమార్, నిర్మాత: జస్వంత్ నడిపల్లి, దర్శకత్వం: రాహుల్ రవీంద్రన్.



సుశాంత్

అఖిల్ సినిమాకు రంగం సిద్ధం



అఖిల్

అఖిల్ నటించబోయే మూడో సినిమా గురించి పస్తుతం అభిమానుల్లో చర్చ జరుగుతోంది. మొదటి సినిమా 'అఖిల్' ఫెయిల్. రెండో సినిమా 'హలో' పేరొచ్చినా కమర్షియల్‌గా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ప్రస్తుతం మూడో సినిమా కోసం భారీ కసరత్తు చేస్తున్నాడు. ఈసారి ఓ నవతరం దర్శకుడికే అవకాశం అన్న మాటా వినిపిస్తోంది. ఈసారి 'తొలి ప్రేమ' ఫేం వెంకీ అట్లూరితో సినిమా దాదాపు ఖాయమైనట్టేనని తెలుస్తోంది. ప్రస్తుతం అఖిల్, వెంకీ బ్యాంకాక్‌లో మంతనాలు సాగిస్తున్నారు. స్క్రిప్టును సాధ్యమైనంత తొందర్లోనే ఫైనల్ చేసేస్తారని తెలుస్తోంది. ఉగాది కానుకగా దర్శకుడెవరో ప్రకటిస్తారని ఇదివరకూ ప్రచారం జరుగుతోంది. ఇక ఈ సినిమాని మెజారిటీ పార్ట్ బ్యాంకాక్‌లో తెరకెక్కిస్తారు. 60శాతం చిత్రీకరణ థాయ్‌ల్యాండ్‌లో సాగుతుందని తెలుస్తోంది.



'గులేబకావళి'లో హన్సిక

'గులేబకావళి' గ్రామం కథ

ప్రభుదేవా, హన్సిక జంటగా నటించిన తమిళ చిత్రం గులేబకావళి. కల్యాణ్ దర్శకత్వం వహించారు. సీనియర్ నటి రేవతి ఓ శక్తివంతమైన పాత్రలో నటించారు. తమిళనాట సంక్రాంతికి విడుదలైన ఈచిత్రం అక్కడ ఘన విజయాన్ని నమోదు చేసుకుంది. కాగా ఇప్పుడు ఈ చిత్రాన్ని అదే పేరుతో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ప్రైవైట్ లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ తెలుగులోకి అనువదిస్తున్నారు. ఏప్రిల్ 6న తెలుగు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ.. తమిళంలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం తెలుగు నేటివిటికి దగ్గరగా వుంటుంది. యూనివర్శల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందనే విశ్వాసంతో తెలుగులోకి అనువదిస్తున్నాను. ఇటీవల విడుదలైన థియేట్రికల్ ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. త్వరలోనే ఆడియోను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. గులేబకావళి అనే గ్రామంలో నిక్షిప్తమైన నిధి కోసం జరిగే అన్వేషణ నేపథ్యంలో ఈ కథ కొనసాగుతుంది. పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్‌గా సాగే ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే హైలైట్‌గా వుంటుంది. అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో ప్రభుదేవా నత్యాలు, నటన ప్రధాన హైలైట్‌గా వుంటాయని తెలిపారు. సంగీతం: వివేక్ మెర్విన్, కెమెరా: ఆర్ఎస్ ఆనంద్‌కుమార్, ఆర్ట్: కదీర్, పాటలు: సామ్రాట్, దర్వకత్వం: కల్యాణ్, నిర్మాత: మల్కాపురం శివకుమార్.

'ఇంతలో ఎన్నెన్ని వింతలో'



నందు, సౌమ్య, తదితరులు

నందు కథానాయకుడిగా సౌమ్య వేణుగోపాల్ నాయికగా పూజ రామచంద్రన్ కీలక పాత్రలలో నటిస్తున్న చిత్రం 'ఇంతలో ఎన్నెన్ని వింతలో'. హరిహర చలన చిత్ర సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఎస్ శ్రీకాంత్ రెడ్డి, ఇప్పిలి రామమోహనరావు నిర్మాతలు. వరప్రసాద్ వరికూటి దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రం గురించి నిర్మాత ఇప్పిలి రామమోహన రావు మాట్లాడుతూ... యాజమాన్య సంగీతంలో ఇటీవలే విడుదలైన మా ఆడియోలో సురేష్ ఉపాధ్యాయ రాసిన ఎన్నో రంగుల్లో ముంచేస్తుందే 'ఈ సమయం..' అనే పాటకు యూట్యూబ్‌లో 1.5 మిలియన్‌పైగా వీక్షకులను ఆకట్టుకుంది. మా చిన్న చిత్రానికి ఇంత స్పందన రావడం ఆనందంగా ఉందని తెలియపరుస్తూ, మా ఈ చిత్రాన్ని ఏప్రిల్ 6న విడుదల చేస్తున్నామని అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: డి.శ్రీనివాస్ ఓంకార్, కెమెరామెన్: ఎస్ మురళీ మోహన్ రెడ్డి.

సీక్వెల్‌కు ఇదే ఆఖరు



'దండుపాళ్యం 3' దర్శక నిర్మాతలు

'దండుపాళ్యం' సీక్వెల్‌కు 'దండుపాళ్యం 3' సినిమానే ఆఖరనీ, ఇంకా ఇటువంటి సినిమాలు తీసే సాహసం చేయలేనని.. చిత్ర దర్శకుడు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సాయి ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేయడానికి సహకరించారు. ఇంతకుముందు 'దండుపాళ్యం' తీశాను. మంచి స్పందన వచ్చింది. సెకండ్ పార్ట్‌ను సరిగ్గా తీయలేదనే విమర్శ వుంది. బెంగుళూరు పరిసర ప్రాంతాల్లోని కామపూర ప్రాంతాల్లో ఈ గ్యాంగ్ మానవ మృగాలుగా ప్రవర్తిస్తారు. దాన్ని బేస్ చేసుకుని కథ రాసుకున్నా. కొన్ని వాస్తవ సంఘటల్ని కూడా జొప్పించాను. అందుకే చాలా బోల్డ్‌గా వుంటాయి. ఈ క్రైం సినిమాను ఇంకా సాగదీయం సమంజసంకాదనించింది. ఇటీవలే నాల్గవ భాగాన్ని తీస్తున్నట్లు కొందరు ప్రకటించారు. దానికి నాకూ ఏ సంబంధం లేదు. ఇందులో నటించిన ఆర్టిస్టులే తాము నటించడం లేదని స్పష్టం చేశారు. త్వరలో మంచి ప్రేమకథను తెరకెక్కించనున్నానని తెలిపారు.

'కోమగటు మరు' ఉదంతంపై చిత్రం


ఈ ఏడాది విడుదలై మంచి విజయాన్ని అందుకున్న చిత్రాల్లో 'భాగమతి' ఒకటి. 'పిల్ల జమిందార్' ఫేమ్ అశోక్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేశారు. ఇప్పుడీ దర్శకుడు తన తర్వాతి సినిమాను అంతర్జాతీయ స్థాయిలో రూపొందించనున్నారు. 1914లో జరిగిన కోమగటుమరు ఉదంతాన్ని ఆధారంగా చేసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారాయన. ఈ చిత్రాన్ని నిర్మాత మహమ్మద్ అలీ తన పెన్ అండ్ ప్రొడక్షన్స్ కంపెనీతో పాటు కెనడియన్ ఫిల్మ్ కౌన్సిల్‌తో కలిసి సంయుక్తంగా నిర్మించనున్నారు. ఈ చిత్రం కోసం జాతీయ, అంతర్జాతీయ నటీ నటుల్ని తీసుకొనున్నారు. జూన్ నెలలో మొదలుకానున్న ఈ చిత్రాన్ని ఇండియా, కెనడా, హాంగ్ కాంగ్, చైనాలలో చిత్రీకరించనున్నారు. 1914లో బ్రిటిష్ రాజ్ నుండి 376 మంది ప్రయాణీకులతో జపాన్ ఓడ కోమగటు మరు కెనెడాకు బయలుదేరుతుంది. కానీ కెనడా ప్రభుత్వం వలసలను దేశంలోకి రాకుండా అడ్డుకుంటుంది. ఇదే కోమగటు మరు ఉదంతం యొక్క నైపథ్యం. కాగా, ఈ చిత్రాన్ని హిందీ, ఇంగ్లీషులో నిర్మించనున్నారు.



'మనం సైతం' టీషర్టు ఆవిష్కరించిన తమన్నా



నిస్సహాయులకు అండగా నిలుస్తున్న 'మనం సైతం' సంస్థ కార్యక్రమాలను ప్రముఖ నాయిక తమన్నా అభినందించారు. ఈ సేవా సంస్థకు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఆమె తెలిపారు. 'మనం సైతం' టీషర్టును ఆవిష్కరించిన తమన్నా...పరిశ్రమలో అండలేని వాళ్లను ఆదుకునేం దుకు ఇలాంటి సంస్థను ప్రారంభించడం, వందలాది మందికి సహాయం అందిం చడం గొప్ప విషయమన్నారు. మనం సైతం కార్యక్రమాల గురించి తెలుసు కున్నాను. ఎంతో మంది పేదవాళ్లను ఆదుకుంటోంది మనం సైతం. ఈ సంస్థ సేవా కార్యక్రమాల్లో ఇకపై నేనూ భాగస్వామి అవుతాను. ఇండస్ట్రీలోని ఇరవై నాలుగు విభాగాల కార్మికులకు మనం సైతం అండగా నిలవడం సంతోషంగా ఉంది. కాదంబరి కిరణ్‌కి ఆయన బృందానికి నా అభినందనలు అన్నారు.





ఫెస్ట్ వచ్చే.. జోష్ తెచ్చే



కబుర్లు చెప్పుకుంటానికేముంది.. చాలానే చెప్పుకోవచ్చు. కానీ వాటిలో నిండుగా జోష్ ఉండాలంటే మాత్రం అవి కచ్చితంగా కాలేజీ కబుర్లే అయ్యుండాలి. మూడు నాలుగేళ్ల పాటు కాలేజీలో ఎన్ని చక్కర్లు కొట్టినా, ఫెస్ట్ జరిగే రోజులు మాత్రం భలే ప్రత్యేకంగా ఉంటాయి. ఎన్ని బ్యాచ్‌లు మారుతున్నా, ఆ జోష్ ఎప్పటికప్పుడు కొత్తగానే ఉంటుంది. కాలేజీకి కొత్త అందాన్ని మోసుకొస్తుంది. విజ్ఞానమూ, ఆటలూ, పాటలూ, చిన్నిచిన్ని సరదాలూ, బోలెడన్ని కార్యక్రమాలూ... అసలైన జోష్ అంతా ఆ రోజుల్లో అక్కడక్కడే తిరుగుతూ ఉంటుంది. రంగురంగుల దీపాలూ, చుట్టూతా స్టాల్స్, అలరిస్తూ కాలేజ్ ఎఫ్‌ఎం, ఫెస్ట్ కోసమో ప్రత్యేకంగా వచ్చిన చుట్టుపక్కల ప్రాంతాల స్టూడెంట్స్... అన్నీ కలగలసి కాలేజీకి పండగ వాతావారణం వచ్చేస్తుంది. అలా కాసేపు జోష్‌ను ఈ వారం 'జోష్'లో తలుచుకుందాం రండి.

ఫెస్ట్ సన్నాహాలకు పెద్ద తతంగమే జరుగుతుంది. ఇది పెళ్లి సన్నాహాలకు ఏమాత్రమూ తీసుపోదు. హడావుడంతా కళ్లకు కనిపిస్తూనే ఉంటుంది. ఒక్కోపనినీ గ్రూపులుగా విడిపోయి పంచుకుంటారు. ఏ పనికి సమర్థులైనవారు, ఆ పనిని చక్కబెట్టే వ్యవహారాల్లో పూర్తిగా నిమగ్నమైపోతారు. చిన్న విషయాలకూ రాజీ పడకుండా, ఈ బాధ్యతను ఎంతో ప్రతిష్టాత్మకంగా వీళ్లంతా భుజానికి ఎత్తుకుంటారు. ఎవరేం పనిచేయాలి... ఇలా చేయాలనే ప్రణాళిక సిద్ధం చేసుకోగానే, ఇక హడావుడి షురూ అవుతుంది. కొందరు స్టేజ్ రడీ చేసుకుంటూ, ఇంకొందరు మిగిలిన కాలేజీలకు ఆహ్వానాలిస్తూ ... ఇలా ఎన్నెన్నో పనులు, జోష్‌జోష్‌గా నడుస్తూనే ఉంటాయి.

హ్యాపీ హ్యాపీ ప్రాక్టీస్

మరి ఇంత జరుగుతుంటే... ఆట కట్టకుండా ఉంటారా... పాట పాడకుండా ఉంటారా... వీటికి స్పెషల్‌గా ఆడిషన్స్ కూడా జరుగుతాయి. ఫెస్ట్ వస్తుదంటే చాలు, తమ టాలెంటంతా చూపించెయ్యడానికి సిద్ధమైపోతారు. సోలో డ్యాన్సులూ, గ్రూప్ డ్యాన్సులూ, మిమిక్రీ, డ్రామా, పాట, సంగీతం ఇలా ఒక్కొక్కటీ క్యూలో నడిచొస్తాయి. స్టేజ్ మీదకెక్కి అలరించేస్తాయి. స్నేహ పూర్వకమైన పోటీ వాతావరణంలో అందరూ తమ సత్తా చూపించేస్తారు. వీటికోసం ప్రత్యేకమైన కసరత్తులు జరుగుతూనే ఉంటాయి. డ్రామాలకు స్క్రిప్ట్ రెడీ చేసుకుంటూ కొందరూ, కొత్తకొత్త స్టెప్పులు ప్రాక్టీస్ చేస్తూ ఇంకొందరూ, కొరియోగ్రాఫర్‌తో మంతనాలు జరుపుతూ మరికొందరూ... ఇలా వారివారి టాలెంట్లతో కుస్తీ పడుతూ ఉంటారు. ఈ హంగామా అంతా అసలీ జోష్‌కి ఇంకాస్త అందాన్ని తీసుకొస్తుంది. సమయమంతా హ్యాపీ హ్యాపీగా గడిచిపోతుంది.



'క్రికెట్, వాలీబాల్' ఫీవర్

ఎన్ని యాక్టివిటీస్ ఉన్నా... క్రికెట్, వాలీబాల్ ఇచ్చే కిక్కే వేరు కదా! కాలేజ్ ఫెస్ట్ అప్పుడు ఈ ఫీవర్ మరీ ఎక్కువగా ఉంటుంది. అన్ని కాలేజీల నుంచీ టీములొచ్చేస్తాయి. టైటిల్ పోరు కోసం మినీ యుద్ధమే జరుగుతుంది. మరోవైపు ఏ లోటూ లోకుండా నిర్వాహకులు గ్రౌండ్‌ని రెడీ చేసే పనిలో ఉంటారు. మరోపక్క ప్రతికాలేజీలో అన్నివిధాలా సమతూగేలా తమ టీంని రెడీ చేసుకుంటాయి. అన్నట్టు ఈ ఫెస్ట్ మొత్తం మీద ఆడియన్స్ ఎక్కువగా ఉండేదీ ఈ ఆటకే. ఈ పోటీలు ఓ వారం ముందుగానే మొదలవడంతో పండగ వాతావరాణాన్ని కాస్తంత ముందుగానే కాలేజీకి తీసుకొస్తుంది. ఎవరి గెలుపు కోసం వారు, సర్వశక్తులూ ఒడ్డి, కష్టపడేతీరు అందరినీ కట్టిపడేస్తుంది. దీనికోసం ప్రత్యేకంగా ప్రాక్టీస్ కూడా చేస్తారు. నాణ్యమైన ఆటగాళ్లను ఎంచుకోవడానికి జరిగే వడపోత కోసం చాలా ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడుతారు. చివరికి ఎంతో బలమైన టీమ్‌ని రెడీ చేసుకుని కానీ రంగంలోకి దిగరు. వీరికి ఎంకరేజ్‌మెంట్ కూడా కాస్త ఎక్కువగానే ఉంటుంది. ఆ టీమ్‌లతో పాటే వారిని ఎంకరేజ్ చేసే బ్యాచ్ కూడా వచ్చేస్తుంది. క్రికెటే కాదు, వాలీబాల్ తీరూ ఇలానే ఉంటుంది. రసవత్తరంగా సాగే వీటిని అప్పటికప్పుడు చూసి తీరాల్సిందే.

అలరించే ఎఫ్‌ఎం

ఇది ప్రత్యేకించి ఫెస్ట్ జరిగే మూడునాల్రోజుల్లో మాత్రమే రన్ అయ్యే కాలేజ్ ఎఫ్‌ఎం. రకరకాల ఈవెంట్స్, ఒక పక్క జరుగుతూనే ఉంటాయి. మరోపక్క ఈ ఎఫ్‌ఎం ఫన్‌ని పంచుతూ ఉంటుంది. మధ్యమధ్యలో అవసరమైన అనౌన్స్‌మెంట్లనూ చేస్తూ, అన్ని పనులకూ సాయమూ చేస్తుంది. మామూలుగా అయితే ఈ ఎఫ్‌ఎంలో నిర్ణయించిన కనీసధర చెల్లించి, ఎవరైనా తమకు ఇష్టమైన పాటను ప్లే చేయించుకోవచ్చు. కానీ మొదటిపాటకు మాత్రం పెద్ద తతంగమే జరుగుతుంది. అన్నింటికంటే ముందు ఏ పాటను ప్లే చేయాలనే దానికోసం కొన్నిచోట్ల బిడ్ కూడా నిర్వహిస్తారు. తమ అభిమాన హీరో పాటకోసం, ఈ బిడ్‌లో చాలామందే పోటీపడతారు. ఇదీ కొంత మజాగానే ఉంటుంది. ఆ తర్వాతి నుంచి, ఎవరికి కావాల్సిన పాటను వాళ్లు ప్లే చేయించేసుకుంటారు. వాటిని ఇష్టమైన అమ్మాయి కోసమూ, దోస్త్ కోసమూ, టీచర్ కోసమూ... ఇలా వారికి నచ్చినట్టూ అంకితమిస్తూ ప్లే చేయిస్తారు. మధ్యమధ్యలో ఈ ఎఫ్‌ఎంలోనే చిన్నచిన్న ఇంటర్వ్యూలూ జరుగుతుంటాయి. అవీ భలేగా సాగుతాయి. స్టూడెంట్స్ అడిగే సరదాసరదా ప్రశ్నలకు లెక్చరర్లూ, స్పోర్టివ్ సమాధానాలిస్తారు. ఫెస్ట్‌లోనే కాకుండా, జీవితంలోనూ మరచిపోలేని జ్ఞాపకాల్లో, కాలేజ్ ఎఫ్‌ఎం కూడా మిగిలిపోతుంది.

ముగింపు సంబరం అదరహో

అప్పటివరకూ జరిగిందంతా ఎంత జోష్‌గా ఉంటుందో, ముగింపు సంబరం అంతకు పదింతల జోష్‌తో ఉంటుంది. అప్పటి వరకూ ప్రాక్టీస్ చేసిన డ్యాన్స్‌లూ, పాటలూ, డ్రామాలూ, మిమిక్రీలూ... ఇలాంటి రకరకాల స్పెషల్ ఎంటర్‌టైన్మెంట్ అంతా అప్పుడే డయాస్ మీదకు ఎక్కుతుంది. మంచి బీట్‌తో పాటలూ, కోలాహలంలో స్టూడెంట్స్... ఓ నాలుగైదు గంటలు ప్రాంతమంతా దుమ్ములేచిపోతుంది. మిగతా కార్యక్రమాలకు హాజరైనా, కాకున్నా, ఈ ముగింపు సంబరాన్ని మాత్రం ఎవ్వరూ మిస్ అవ్వరు. విద్యార్థులే కాదు, వారి తల్లిదండ్రులూ కొంతమంది వీటికి, హాజరై చక్కని జోష్ జోష్ వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తారు.

మీరూ ఇవన్నీ చేసిన వాళ్లే కదా... మీ ఫెస్ట్‌లో ఇలా ఎంజాయ్ చేసేసి ఉంటారు కదా... ఆ నాలుగురోజుల పండగనూ మరోసారి గుర్తుచేసుకుని, మరింత ఉత్సాహంతో ఎకడిమిక్ కెరియర్‌లో దూసుకెళ్లండి. మళ్లీ వచ్చే ఏడాది ఫెస్ట్‌కి రెట్టింపు ఉత్సాహంతో సిద్ధమైపోండి.

★



జోరుగా ఉగాది

కాలం ఏడాదులై నడుస్తున్నప్పుడు, కొన్ని తేదీలు జ్ఞాపకాలుగా మిగిలుంటాయి. ఆ తేదీలే పండగలైతే, అందులోనూ అవి ప్రకృతి పండగలైతే మరిన్ని ఆనందాలను తీసుకొస్తాయి. చక్కని ఆహ్లాదకర వాతావరణాన్నీ మోసుకొస్తాయి. అలా వచ్చే పండగల్లో ఉగాదికి ఎప్పటికీ ఒక ప్రత్యేకస్థానం ఉంటుంది. ఉగాదికీ, సాహిత్యానికీ అనాది నుంచీ చక్కని అనుబంధం ఉంది. ఇప్పటికీ ఎన్నెన్నో తరాలు మారినా, అనాదిగా ఆ బంధం కొనసాగుతూనే ఉంది. అయితే దీనిని యువత ఎలా చూస్తున్నారో ఓ లుక్కేద్దాం పదండి.

సాహిత్యంలోనూ యువత జోష్ కాలం మనుషులను ఎంత వేగవంతం చేస్తున్నా, కొత్తకొత్త రంగాలు లోకానికి ఆహ్వానికి పలుకుతున్నా, ఇప్పటి యువత సాహిత్యాన్ని హత్తుకుంటుంది. ప్రేమిస్తుంది. కథలలోనూ, కవిత్వంలోనూ తమ తాలూకా ముద్రనూ వేస్తుంది. సమస్యల మీదా, ప్రకృతి మీదా, తమకు ఏం తోస్తే దాని మీద... కథలనూ, కవిత్వాన్నీ అల్లేస్తున్నారు. ఇక్కడ తామేంటో చూపిస్తున్నారు. ఇటీవల కాలంలో ఎంతో మంది యువత రాయడంతో పాటు, చక్కని పుస్తక పరిచయాలనూ చేస్తూ, తమ కలం సత్తాను ప్రపంచానికి చూపిస్తున్నారు.

బిజీ లైఫ్‌లో భలే రిలీఫ్.. కొందరు విద్యార్థులైతే, ఈ బిజీ లైఫ్‌లో సాహిత్యం గొప్ప రిలీఫ్‌ని ఇస్తుందని చెప్తున్నారు. తాము చదివిన పుస్తకాలనూ, ఆ వివరాలనూ... తమ స్నేహితులతో షేర్ చేసుకుని, వారి చేతా చదివిస్తున్నారు. కాస్త తీరిక దొరికనప్పుడు, అటు చదువుతూనే, ఇటు చక్కని సాహిత్యాన్ని రాస్తున్నారు. సోషల్ మీడియాలోనూ, వార్తా పత్రికల్లోనూ విరివిగా దర్శనమిస్తూనే ఉన్నారు. మరి ఉగాదిలాంటి ప్రకృతి పండగొచ్చినప్పుడు, వారి కలాలు పారకుండా ఎలా ఉంటాయి. సాహిత్య యుద్ధం చేయకుండా ఎలా ఉంటారు.

అందుకు ఈ రెండు కవితలూ ఉదాహరణే. ప్రస్తుతం ఎంతో మంది యువత కథలనూ, కవితలనూ రాస్తున్నారు. వారిలోని ఈ ఇద్దరి కవిత్వాన్నీ మీ ముందుకు తెచ్చాం. ఈ రోజున సోషల్ మీడియాలో, కవిత్వ పూలతోటలై వికసిస్తున్న ఎంతోమందిలో వీరు కేవలం ఇద్దరు మాత్రమే. యువత సాహిత్యాన్ని పక్కన పెడుతున్నారనే మాటలకు, చెక్‌పెడుతూ... సాహిత్యలోకంలో ఇలా ఎంతోమంది సూర్యుళ్ళై ఉదయిస్తున్నారు. చందమామలై వెన్నెలనూ పంచుతున్నారు.

ఉగాది

గాలిబుడగల జీవనం పోయి
గుప్పెళ్ళతో నక్షత్రాలను కోసుకోవడం
కిరణాల తేరులపై పాలపుంతను చేరుకోవడం..
ఈ అనుభూతులన్నీ
కమ్మని కలలో, ఊహలో కాదు.. కాకూడదు
వాస్తవం కావొచ్చు.. కావాలి..
నా కలలన్నీ సాకారం కావడం
ఊహలన్నీ వాస్తవరూపం దాల్చడం
వాంఛనీయం.. అవాంఛనీయం కాకపోవచ్చు

కానీ
కదిలించే కలలతో కలిసి పయనించడం
ఉల్లాసపు ఊహలతో స్నేహించడం
కాలానికి జీవాన్నిస్తాయి
జీవితానికి చైతన్యాన్నిస్తాయి..
అదే సరికొత్త ఉగాది

- నిశిత

మళ్లొచ్చిందో ఉగాది

మళ్లీ వచ్చింది ఉగాది
మొన్నొచ్చింది...
నిన్నొచ్చింది...
ఈ రోజు కూడా...
నన్ను ప్రాణిగా నిలపడానికి
కొత్త చిగుర్లేసుకొని
నలిగిన జీవితాల్లోంచి
నవయవ్వనాన్ని పొదిగి పొదిగి
పొంతనలేని సంబరాన్ని మోసుకొచ్చింది

నీకూ నాకూ
ఇదొక అద్భుత ప్రకృతి
వికృతంగా నవ్వే ఎండల ఎడారిలో
పచ్చని చేలన్నీ బీడై పోతే
ప్రకృతి అందాలు పరుచుకుంటుంది
కొంటెగా చిగురించి
పాటలు పాడుతుంది
కాలాన్ని ప్లాస్టిక్ సంచుల్లో మోస్తూ


భుగభుగలు భగభగలు
భూగోళం బద్ధలయ్యింది
గుండ్రంగా నీ కన్నుల్లో
సుడులు తిరిగే నైరాశ్యం
మళ్లీ పుడుతుంది
నవ్వుత్వపు రుతురాగం

పంచాంగం పంచెల్లో
ఎప్పటివో కోరికలు
పంచముల గుండెల్లో
ఇప్పటికీ గునపాలు
ఎన్ని వికలంబులు
ఎన్ని సుభిక్షాలు
భిక్షాటనచేసే బీదబతుకుల్లో
ఎన్నెన్ని ధర్మసందేహాలు
కొత్తవత్సరం కాలానికా?

కార్పొరేట్ల రేటుల్లో
రోజేదైనా కాలిపోవాల్సిందే
మాసమేదైనా మసికావాల్సిందే
సంవత్సరమేదైనా సమాధికావాల్సిందే
ఇంకెందుకు సంబరాలు?
అంబరాన్ని పిడికిళ్లతో తడితే
ఆకాశం నుండి సూర్యుళ్లు రాలి
ప్రకృతి అంతా కాలిపోయి
కొత్త చిగుర్లు వేయాలి
సరికొత్త చైతన్యం రావాలి

అప్పడొస్తుంది
మరో ఉగాది
నిన్నూ నన్నూ
పొదిమి పొదిమి
పులకింపజేస్తుంది

- ప్రవీణ్ వెలువోలు





చిన్నారి

ఎవరది?

పుట్టింది మహాబలేశ్వరం,
మెట్టింది ఆంధ్రరాష్ట్రం,
చేసింది సస్యశ్యామలం,
చేరింది బంగాళాఖాతం?

జవాబు : కృష్ణానది

జోక్:

టీచర్ : చిన్నప్పుడు కాపీలు కొట్టి, పరీక్షలు రాసేవాడివి. ఇప్పుడేం చేస్తున్నావురా సోమూ?

సోము : డబ్బింగ్ సినిమాలు తీస్తున్నా సార్!

నీడ కనిపెట్టండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని జీవులు, వాటి నీడలు ఉన్నాయి. అందులో ఏ నీడ దేనిదో కనిపెట్టండి!

కుక్కలకూ ఇన్సూరెన్స్!



పిల్లలూ.. మీరు ఇన్సూరెన్స్ అనే మాటను వినే ఉంటారు కదా! మనుషులకు ఇన్సూరెన్స్ చేస్తే పాలసీని బట్టి ఉపయోగాలు ఉంటాయి. అలాగే వస్తువులకు చేస్తే వాటిని ఎవరైనా దొంగిలించినా, అవి కాలిపోయినా మనకు ఇన్సూరెన్స్ డబ్బులు వస్తాయి. కానీ కుక్కలకూ ఇన్సూరెన్స్ ఉందని మీకు తెలుసా? మీకే కాదు పిల్లలూ చాలామందికి ఈ విషయం తెలియదు. కుక్కల కోసమూ చక్కని పాలసీలు ఉన్నాయి. అల్లారుముద్దుగా పెంచుకునే కుక్కల్ని దొంగలిస్తే... ప్రాణాంతక వ్యాధుల బారిన పడితే... వైద్యం ఎంతో ఖరీదుగా ఉంటుంది. అందుకే పెంపుడు జంతువుల కోసం కొన్ని బ్యాంకులు ఇన్సూరెన్స్ పాలసీలు అందిస్తున్నాయి.



ప్రస్తుతం మన దేశంలో 'ది ఓరియంటల్ ఇన్సూరెన్స్' కంపెనీ కేవలం కుక్కల కోసమే ఇన్సూరెన్స్ ఇస్తుంది. కుక్క ధరను బట్టి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. కుక్కలకు ఇన్సూరెన్స్ చేయాలంటే మొదట పాలసీని ఆన్‌లైన్‌లో కొనుక్కోవాలి. ఆ తర్వాత కుక్కల్ని బీమా సంస్థ ఆఫీసుకు తీసుకెళ్లాలి. ఆ కుక్కలకు కచ్చితంగా నోస్ ప్రింట్ లాంటి ఐడెంటిఫికేషన్ మార్కు ఉండాలి. వీటన్నింటితో పాటు కుక్కకు సంబంధించిన పేపర్స్ ఉండాలి. అయితే ఈ ప్రాసెస్ చాలా కష్టంగా ఉంటోందని, సులభ పద్ధతిలో ఉంటే బాగుంటుందని డాగ్ లవర్స్ అంటున్నారు. ఇన్సూరెన్స్ తీసుకోవాలంటే కుక్కకు సంబంధించిన వివరాలను పొందుపర్చిన వెటర్నరీ సర్టిఫికెట్ ఉండాలి. వాటి వయసు ఎనిమిది వారాల నుంచి ఎనిమిది సంవత్సరాలు ఉండాలి. కుక్క ఎంత ధర పలుకుతుందో చెప్పే పత్రం ఉండాలి. ఆ పత్రాన్ని క్వాలిఫైడ్ వెటర్నరీ డాక్టర్ ఇవ్వాలి.

★





పి.నందిని,
5వ తరగతి,
మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్,
షేర్ మొహమ్మద్ పేట,
కృష్ణాజిల్లా.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మాచిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com






సింధు ఓటమి

ఆల్ ఇంగ్లండ్ సెమీస్‌లో యమగుచి చేతిలో పరాభవం

ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్ షిప్ 1898లో ప్రారంభమైంది. ప్రపంచ బ్యాడ్మింటన్ చరిత్రలో అత్యంత పురాతన టోర్నీ ఇది. భారత్ తరపున ప్రకాశ్ పదుకొణె, పుల్లెల గోపీచంద్‌లు మాత్రమే ఈ టోర్నీ విజేతలుగా ఇప్పటివరకు నిలిచారు. ప్రస్తుత భారత బ్యాడ్మింటన్ తరానికి మాత్రం ఇది అందని ద్రాక్షలాగే మిగిలిపోయింది. మహిళల విభాగంలో ఐదుసార్లు ఈ టోర్నీ బరిలోకి దిగిన పీవీ సింధు కనీసం క్వార్టర్ ఫైనల్స్ దాటలేదు. కానీ ఈసారి సెమీఫైనల్‌వరకు మాత్రమే ప్రవేశించగల్గింది. భారత్ తరపున అత్యుత్తమ ప్రదర్శన సైనా నెహ్వాల్ మాత్రమే 2010లో సెమీస్ వరకు వెళ్ళగల్గింది.



బర్మింగ్‌హామ్ : ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో ఆరంభం నుంచి విజయం కోసం తీవ్రంగా చెమటోడుస్తున్న పూసర్ల వెంకట సింధు పోరాటం ముగిసింది. శనివారం ఉత్కంఠభరితంగా జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో చివర్లో ఒత్తిడికి గురై ఓటమిపాలైంది. 2వ సీడ్ జపాన్‌కు చెందిన యమగుచి చేతిలో 21-19, 19-21, 18-21 పాయింట్ల తేడాతో ఓడి టోర్నీనుండి నిష్క్రమించింది.

అంతకుముందు శుక్రవారం క్వార్టర్ ఫైనల్లో జపాన్‌కు చెందిన ఏడో సీడ్ నొజొమి ఒకు హర తోనూ హోరాహోరీగా తలపడిన సింధు 20-22, 21-18, 21-18తో నెగ్గి సెమీస్ చేరుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ టోర్నీలో తొలిసారి క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని అధిగమించి సెమీ ఫైనల్లోకి ప్రవేశించగల్గింది.

అయితే ఇప్పటివరకూ వీరిద్దరి మధ్య సాగిన పోరులో సింధుదే ఆధిక్యం. వీరిద్దరూ తొమ్మిది సార్లు తలపడగా, అందులో సింధు ఆరుసార్లు, యమగుచి మూడుసార్లు మాత్రమే విజయం సాధించగల్గింది. ఇటీవల 2018 ఫిబ్రవరిలో బ్యాడ్మింటన్ ఆసియా టీమ్ ఛాంపియన్‌షిప్‌లో వీరిద్దరూ ముఖాముఖి తలపడ్డారు. అయితే ఈ మ్యాచ్‌లో సింధుకు రెండో సెట్‌లలోనే మ్యాచ్‌ను ముగించింది. యంవంగంచి క్వార్టర్‌ఫైనల్లో ప్రమాదకర స్పెయిన్ షట్లర్, మాజీ ప్రపంచ నంబర్‌వన్ కరోలినా వారిన్నం యమగుచి 21-15, 21-18 తేడాతో సునాయాసంగా ఓడించింది. కేవలం రెండు సెట్ల లోపే మ్యాచ్ ఫలితాన్ని ముగించేసింది.

ఆల్‌ఇంగ్లండ్‌లో ముగిసిన భారత్ పోరు

సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్.. ఇప్పటికే ఆల్ ఇంగ్లండ్ టైటిల్ పోరులో ఇంటిముఖం పట్టారు. 11వసారి బరిలోకి దిగిన 27 ఏళ్ల సైనా సైతం తొలిరౌండ్‌లోనే ప్రపంచ నెంబర్‌వన్, డిపెండింగ్ ఛాంపియన్ తై-జు-యింగ్ (చైనీస్-తైపే) ముందు తలవంచాల్సి వచ్చింది. సెమీస్‌లో యమగుచి చేతిలో సింధు ఓటమి పాలవ్వ డంతో భారత్ పోరాటం ముగిసింది.



ఫైనల్లో తై-జు-యింగ్

శనివారం జరిగిన ఆల్‌ఇంగ్లండ్ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి చైనీస్-తైపేకి చెందిన నంబర్ వన్ షటర్ తై-జు-యింగ్ ప్రవేశించింది. శనివారం జరిగిన తొలి సెమీఫైనల్ పోరులో చైనాకు చెందిన చెన్-యుఫిపై 21-15, 20-22, 21-13 పాయింట్ల తేడాతో గెలిచి ఫైనల్లోకి ప్రవేశించింది. రెండో సెమీఫైనల్ పీవీ సింధు-యమగుచిల విజేతతో ఆదివారం జరిగే టైటిల్‌పోరులో తలపడనుంది.



క్వార్టర్స్‌లో ప్రణయ్ ఓటమి

శుక్రవారం అర్ధరాత్రి జరిగిన క్వార్టర్‌ఫైనల్స్ మ్యాచ్‌లో భారత్‌కు చెందిన ప్రణయ్‌రాయ్ ఓటమిపాలయ్యాడు. చైనాకు చెందిన అన్‌సీడెడ్ వాంగ్‌తో తలపడిన ప్రణయ్ 22-20, 16-22, 21-23తో హోరాహోరీ పోరులో పరాజయం చెందాడు. తొలిసెట్‌ను గెలిచిన ప్రణయ్ రెండో సెట్‌లో రాణించలేకపోయాడు. నిర్ణయాత్మకమైన మూడో సెట్‌లో హోరాహోరీగా తలపడి చివరకు ఆ సెట్‌ను 21-23తో చేజార్చుకున్నాడు. ఆల్‌ఇంగ్లండ్‌లో ప్రణయ్ ఓటమితో పురుషుల విభాగంలో భారత పోరాటం ముగిసినట్లయ్యింది.

భారత్ మరో సిరీస్ సాధించేనా?

సంచలన విజయాల బంగ్లాదేశ్‌తో ఢీ

నేడు టీ20 ట్రై సిరీస్ ఫైనల్

రాత్రి 7.00 గం॥లకు

నిదహాస్ టీ20 సిరీస్ ఫైనల్ కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో ఆదివారం జరగనుంది. టీమిండియా తొలుత శ్రీలంక చేతిలో ఓడినా... అనంతరం జరిగిన మూడు మ్యాచ్‌లలో విజయాలను నమోదు చేసుకొని ఫైనల్‌కు చేరింది. బంగ్లాదేశ్‌జట్టు ఆతిథ్య శ్రీలంకపై సంచలన విజయాలను నమోదుచేసుకొని టైటిల్‌కై టీమిండియాతో అమీతుమీ తేల్చుకోనుంది. నేడు జరిగే ఈ ఫైనల్‌పోరు హోరాహోరీగా జరగనుంది.



సిరీస్‌లో నిలకడగా రాణిస్తున్న శిఖర్ ధావన్

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్)

నిదహస్ టీ20 ట్రై సిరీస్ ఫైనల్లో భారత్-బంగ్లాదేశ్ జట్లు టైటిల్‌కై నేడు ముఖాముఖి తలపడనున్నాయి. ఈ టోర్నీ ఫైనల్‌కు చేరిన ఇరుజట్లలో భారత్‌కంటే... బంగ్లాదేశ్ గురించే ఎక్కువగా ప్రస్తావించుకోవాల్సి ఉంది. ఆ జట్టు ఆతిథ్య శ్రీలంక జట్టుపై రెండుసార్లు గెలుపొంది ఫైనల్లోకి ప్రవేశించింది.

బలహీనజట్టు అయిన బంగ్లాదేశ్ లంకతో తలపడిన తొలిమ్యాచ్‌లో 215 భారీ లక్ష్యాన్ని ఛేదించి క్రికెట్ విమర్శకుల నోరు మూయించింది. ఇక రెండోమ్యాచ్‌లో 160 పరుగుల లక్ష్యాన్ని ఉత్కంఠపోరులో మరో బంతి మిగిలి ఉండగానే సాధించింది. దీంతో ఇరుజట్ల మధ్య జరిగే టైటిల్‌పోరు ఆసక్తిదాయకంగా జరిగే అవకాశముంది.



ఇక టీమిండియా విషయా నికొస్తే శిఖర్ ధావన్, సురేష్ రైనా, రోహిత్ శర్మలు బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్నారు. బౌలింగ్‌లో వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, మహ్మద్ సిరాజ్‌లు కూడా పొదుపుగా బౌలింగ్ చేసి భారతజట్టును గెలిపించారు. ఈ టోర్నీ ప్రారంభ మ్యాచ్‌లో తప్ప మిగతా మ్యాచ్‌లలో టీమిండియా సమిష్టిగా రాణించింది. అదే జోరును ఈ మ్యాచ్‌లోనూ కొనసాగిస్తే భారత్ మరో టైటిల్ విజయం సాధించడం ఖాయం.

భారతజట్టు (అంచనా) : రోహిత్ శర్మ (సారథి), శిఖర్ ధావన్, కెఎల్ రాహుల్, సురేష్ రైనా, మనీష్ పాండే, దినేష్ కార్తీక్ (కీపర్), వాషింగ్టన్ సుందర్, చాహల్/అక్షర్ పటేల్, శార్దూల్ ఠాకూర్, మహ్మద్ సిరాజ్, ఉనద్కట్/రిషబ్ పంత్.

బంగ్లాదేశ్‌జట్టు (అంచనా) : షకీబ్-అల్-హసన్ (సారథి), తమీమ్ ఇక్బాల్, లింటన్ దాస్, షబ్బీర్ రహమాన్, ముస్తఫిజుర్ రహీమ్(కీపర్), సౌమ్య సర్కార్/ఇమ్రుల్ ఖయాస్, మహ్మదుల్లా, ముస్తఫిజుర్ రహమాన్, రుబెల్ హొస్సైన్, నజముల్ ఇస్లామ్/తస్కిన్ అహ్మద్.



షకీబ్, నూరుల్‌పై ఐసీసీ సీరియస్ మ్యాచ్ ఫీజులో 25% కోత

శ్రీలంకతో శుక్రవారం జరిగిన నిర్ణయాత్మక టీ20 మ్యాచ్‌లో క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించిన బంగ్లా సారథి షకీబ్ అల్ హసన్, రిజర్వ్ ప్లేయర్ నురుల్ హసన్‌లపై అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి (ఐసీసీ) జరిమానా విధించింది. మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడమే కాకుండా ఓ డీమెరిట్ పాయింట్‌నూ కేటాయించింది. బంగ్లాదేశ్ బ్యాటింగ్ చివరి ఓవర్లో మైదానంలో గందరగోళ పరిస్థితి ఏర్పడిన విషయం తెలిసిందే. రెండు బంతులు భుజం కంటే ఎత్తులో వెళ్లినా అంపైర్లు నోబాల్ ఇవ్వకపోవడంపై బంగ్లా బ్యాట్స్‌మన్ అసహనానికి గురయ్యారు. ముస్తఫిజుర్ రనౌటైన గ్యాప్‌లో గ్రౌండ్‌లోకి వచ్చిన బంగ్లా రిజర్వ్ ప్లేయర్ నురుల్ శ్రీలంక సారథి తిసారా పెరీరాతో వాగ్వాదానికి దిగాడు. అంపైర్లు కలగజేసుకుని సర్దిచెప్పేలోపే షకీబ్ బౌండరీ దగ్గరకొచ్చి 'బయటికి వచ్చేయండి..' అంటూ గట్టిగా కేకలు వేశాడు. ఈ ఘటనను సిరీ యస్‌గా పరి గణించిన రిఫరీ క్రిస్ బోర్డ్ ఐసీసీ కోడ్ 2.1.1 ప్రకారం షకీబ్‌కు, 2.1.2 కింద నూరు ల్‌లు క్రీడాస్ఫూర్తిని దెబ్బతీస్తూ నిబంధనలు అతిక్ర మించారని ఇద్దరిపైనా జరిమానాలు విధించింది.

నాగిని డ్యాన్స్ చేస్తే..నాదస్వరం ఊదుతా! శ్రీలంక బౌలర్ అపోన్సో

శ్రీలంకతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్ళు నాగిని డ్యాన్స్ చేసి అలరించిన సంగతి తెలి సిందే. ఈ మ్యాచ్‌లో ముష్ఫికర్ రహీమ్ ఎక్స్‌ట్రా కవర్ మీదుగా భారీ షాట్‌కు యత్నించి అవుట య్యాడు. శ్రీలంక బౌలర్ అపోన్స్ వేసిన 13 ఓవర్ మూడో బంతికి తిషారా పెరీరా చక్కటి క్యాచ్ పట్టడంతో రహీమ్(28) పెవిలియన్ బాట పట్టా డు. దాంతో బౌలర్ అపో న్సో మాత్రం నాదస్వరం ఊది రహీమ్‌కు సెండాఫ్ ఇచ్చాడు. గత మ్యాచ్‌లో బంగ్లా గెలిచిన తర్వాత ముష్ఫికర్ నాగి న డ్యాన్స్ చేస్తే దానికి ఇప్పుడు అపోన్సో ఇలా సమాధానమి చ్చాడు. 'నువ్వు నాగిన డ్యాన్స్ చేస్తే.. నేను నాదస్వరం ఊదుతా' అనే అర్థం వచ్చేలా అపోన్సో స్లెడ్జ్ చేశాడు.



డ్రెస్సింగ్ రూమ్‌ను ధ్వంసం చేసిన బంగ్లాదేశ్ ఆటగాళ్లు!

చావో రేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ చివరి వరకు పోరాడి విజయం సాధించింది. మరి గెలుపు ఇచ్చిన ఉత్సాహమో, ఫైనల్‌కు చేరామన్న ఆనందమో కానీ విజయం అనంతరం బంగ్లాదేశ్ ఆటగాళ్లు రెచ్చిపోయారు. డ్రెస్సింగ్ రూమ్‌కు చేరుకున్న వెంటనే విజిటర్స్ డ్రెస్సింగ్ రూము అద్దాలను బ్యాట్‌తో ధ్వంసం చేశారు. అయితే చివరి ఓవర్లో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య జరిగిన వివాదమే ఇందుకు కారణమని తెలిసింది.

డే-నైట్ టెస్ట్‌కు హైదరాబాద్ ఆతిథ్యం?



టీమిండియా తొలి డే-నైట్ టెస్ట్ మ్యాచ్‌ను నిర్వహించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) హైదరాబాద్ లేదా రాజ్‌కోట్ వేదికగా నిర్వహించాలని భావిస్తోంది. 2018-19 సీజన్‌లో స్వదేశంలో జరగనున్న మ్యాచ్‌ల వేదికలను ఎంపికచేయడం కోసం బీసీసీఐ శనివారం సమావేశం నిర్వహించింది. స్వదేశంలో టీమిండియా కేవలం మూడు టెస్టు మ్యాచ్‌లే ఆడనుంది. అఫ్ఘనిస్తాన్‌తో చారిత్రాత్మక ఏకైక టెస్టు, వెస్టిండీస్‌తో రెండు టెస్టు మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే వీటిలో ఒక టెస్ట్ మ్యాచ్‌ను ప్రయోగాత్మకంగా డే-నైట్ టెస్టు మ్యాచ్ నిర్వహించాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ మేరకు సమావేశంలోని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ ప్రతిపాదనకు పాలకుల కమిటీ (సీఓఏ) ఆమోదం తెలుపాల్సి ఉందని బీసీసీఐ కార్యదర్శి అమితాబ్ చౌదరి మీడియాకు తెలిపారు.

రెస్టాఫ్ ఇండియా-236/6



విదర్భ-800/7 - ఇరానీ ట్రోఫీ మ్యాచ్

నాగ్‌పూర్ : రెస్టాఫ్ ఇండియా-విదర్భ జట్ల మధ్య జరుగుతున్న ఇరానీ ట్రోఫీ మ్యాచ్‌లో విదర్భ జట్టు తొలి ఇన్నింగ్స్ ముగించింది. శనివారం ఆ జట్టు 7 వికెట్ల నష్టానికి 800 పరుగుల స్కోర్ వద్ద తొలి ఇన్నింగ్స్ ముగిస్తున్నట్లు ప్రకటించింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ఆరంభించిన రెస్టాఫ్ ఇండియా జట్టు నాల్గోరోజు ఆటముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. హనుమ విహారి(81), జయంత్ యాదవ్(62) పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. రంజీట్రోఫీలో రాణించిన విదర్భ బౌలర్ గుల్బానీ ఈ మ్యాచ్‌లోనూ 4 వికెట్లను పడగొట్టాడు.

హెలెప్‌కు షాక్

ఇండియన్‌వెల్స్ ఫైనల్లో ఒసాకా, కసట్కినా



ఒసాకా



కసట్కినా

కాలిఫోర్నియా : ఇండియన్‌వెల్స్ మాస్టర్స్ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి నయోమి ఒసాకా, కసట్కినా ప్రవేశించారు. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన సెమీఫైనల్స్‌లో ఒసాకా ప్రపంచ నెంబర్ హెలెప్‌పై... కసట్కినా 8వ సీడ్ వీనస్ విలియమ్స్‌పై సంచలన విజయాలను నమోదు ఫైనల్‌కు చేరారు. తొలి సెమీఫైనల్ మ్యాచ్‌లో జపాన్‌కు చెందిన అన్ సీడెడ్ క్రీడాకారిణి నయోమి ఒసాకా 3-6, 0-6 తేడాతో ప్రపంచ నెంబవర్ వన్ హెలెప్‌ను ఓడించింది. కేవలం 64 నిమిషాల వ్యవధిలోనే హెలెప్‌ను ఒకాసా ఓడించింది. హెలెప్ అనవసర తప్పిదాలతో తొలి సెట్‌ను కోల్పోయినా... రెండో సెట్‌లో కూడా అవే తప్పిదాలను పునరావతం చేసి మ్యాచ్‌ను చేజార్చుకుంది. రెండో సెమీస్‌లో రష్యాకు చెందిన 20వ సీడ్ డారియా కసట్కినా చేతిలో 8వ సీడ్ అమెరికాకు చెందిన వీనస్ విలియమ్స్ 6-4, 4-6, 5-7 సెట్ల తేడాతో ఓటమిపాలైంది. దీంతో ఆదివారం జరిగే తుదిపోరులో రష్యాకు చెందిన దారియా కసట్కినాతో ఒసాకా అమీతుమీ తేల్చుకోనుంది.

పంజాబ్ వేదికలను మార్చిన బీసీసీఐ



ముంబయి: ఐపీఎల్‌లో భాగంగా మే 12, మే 14న కింగ్స్ ఎలెవన్ పంజాబ్ తన సొంత మైదానంలో ఆడే రెండు మ్యాచ్‌ల వేదికలను మారుస్తున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శనివారం తెలియజేసింది. శుక్రవారం ఆ వేదికలను మార్చాల్సిందిగా బీసీసీఐకి పంజాబ్ లేఖ రాసిన సంగతి తెలిసిందే. మే 12 నుంచి మే 31 వరకు చండీగఢ్ విమానాశ్రయాన్ని మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నారు. ఈ నేపథ్యంలో మే 12న కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో, మే 14న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మొహాలీలో జరిగే మ్యాచ్‌లను లక్నోకు మార్చాల్సిందిగా పీసీఏ, ఐపీఎల్ నిర్వాహకులు బీసీసీఐకు లేఖ రాశారు. దీనిపై స్పందించిన బీసీసీఐ పంజాబ్ వేదికలను మార్పు చేసింది.

బీసీసీఐకు సహకరిస్తా : షమి



న్యూఢిల్లీ: తనపై వచ్చిన ఆరోపణలపై భారత్ క్రికెట్ నియంత్రణమండలి (బీసీసీఐ) అవినీతి నిరోధక విభాగానికి తాను పూర్తిగా సహకరిస్తానని టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ షమి అన్నాడు. శనివారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో షమి పైవిధంగా స్పందించాడు. తన భార్య హసిన్ జహాన్ చేసిన మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలను షమి పూర్తిగా కొట్టిపారేశాడు. ఈ అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరగాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపాడు. తాను ఎప్పుడూ ఎలాంటి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడలేదని... తనకు బీసీసీఐ ఎప్పుడూ మద్దతుగా నిలిచిందని పేర్కొన్నాడు. 'నేను బీసీసీఐ నుంచి ఆశిస్తున్నది ఒకటే.. ఈ అంశంపై వారు పూర్తి స్థాయి విచారణ చేపట్టి అన్ని అంశాలను పరిశీలించాలి. ఓ పాకిస్థానీ అమ్మాయి వద్ద నుంచి తాను డబ్బులు తీసుకోవడం.. దుబాయి వెళ్లిన ఘటనలను రెండింటినీ తప్పుగా కలిపి చూపిస్తు న్నారు. నేనెప్పుడూ తప్పు చేయ లేదు. భవిష్యత్తులో చేయను కూడా. ఇదంతా నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడానికే... దీనిపై పూర్తి స్థాయి విచారణ జరగాలని కోరుకుంటున్నా' అని షమి చెప్పుకొచ్చాడు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68